పరిహారం ఇచ్చాకే నీళ్లు నింపాలి

- త్యాగం చేసిన వారికి 'వెలిగొండ' శాపం కాకూడదు
- నిర్వాసితులకు అండగా సంక్రాంతి తర్వాత మరో పోరాటం : వి శ్రీనివాసరావు

లోపలి పేజీలో..

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 164 | విజయవాడ, ఆదివారం 15 జనవరి 2023 | 8 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 15 January 2023 | Rs

పాఠకులకు, ఏజెంట్లకు, ప్రకటనకర్తలకు, శ్రేయోభిలాషులకు

ప్రజాశక్తి

సంక్రాంతి శుభాకాంక్షలు

ఆదివారం మా కార్యాలయానికి సెలవు, కావున సోమవారం పత్రిక వెలువడదు. పునర్దర్శనం మంగళవారం.

-చీఫ్ జనరల్ మేనేజర్

ఎదురులేని బండి...

ఉత్సాహంగా రాష్ట్ర స్థాయి ఎడ్ల పందేలు

రాష్ట్ర స్థాయి ఎడ్లపందెం పోటీలు నెల్లూరు జిల్లా కోవూరు మండలం కొత్తూరు గ్రామంలో ఉత్సాహ పూరిత వాతావరణంలో జరిగాయి. సంక్రాంతి సందర్భంగా రైతు సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో ఇక్కడ ప్రతి ఏటా ఈ పోటీలను నిర్వహిస్తారు. శనివారం జరిగిన పోటీల్లోనూ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుండి ఎడ్లను తీసుకువచ్చారు. ఈ పోటీలను తిలకించడానికి జిల్లాలోని పలు ప్రాంతాల నుండి ప్రజలు తరలివచ్చారు. సీనియర్ విభాగంలో బాపట్ల జిల్లా స్టూవర్టుపురం గ్రామానికి చెందిన బి.జయంతి ఎడ్ల జట్టు మూడు కిలోమీటర్ల దూరాన్ని 7.27 నిమిషాల్లో చేరుకొని ప్రథమ స్థానం, జూనియర్ విభాగంలో నెల్లూరు జిల్లా కొవ్వూరులోని చెర్లో సంఘానికి చెందిన శ్రీ ఆంజనేయ ఎడ్ల జట్టు రెండు కిలోమీటర్ల దూరాన్ని 5.14 నిమిషాల్లో చేరుకొని ప్రథమ స్థానం కైవసం చేసుకున్నాయి.

చీకటి జిఓపై ఆగ్రహజ్వాల

రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు • భోగి మంటల్లో జిఓ-1 ప్రతులు దగ్ధం

ప్రజాశక్తి- యంత్రాంగం

జిఒ-1 పట్ల ప్రజాగ్రహజ్వాల ఎగిసిపడింది. ఈ జిఓను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా పౌర హక్కుల సంఘాలు, ప్రజాసంఘాలు, న్యాయవాదుల సంఘాలు, ట్రేడ్ యూనియన్లు, రాజకీయ పార్టీలు శనివారం పెద్ద ఎత్తున ఉద్యమించాయి. జిఓ ప్రతులను భోగి మంటల్లో వేసి దగ్ధం చేసి తమ నిరసన తెలిపాయి. ప్రజాపోరాటాలను, ఉద్యమాలను అణగదొక్కడానికి, ప్రతిపక్షాల గొంతునొక్కడానికి ప్రభుత్వం ఈ జిఓను తీసుకొచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. చీకటి జిఓను రద్దు చేసే వరకూ పోరాటం ఆగదని స్పష్టం చేశాయి. విజయవాడ దుర్గాపురంలో జిఓ కాపీలను భోగి మంటల్లో వేసి దగ్ధం చేసి నిరసన తెలిపారు. ప్రజాస్వామ్య విరుద్ధంగా ఉన్న ఈ జిఓను రద్దు చేయాలని నినాదాలు చేశారు. ఐలూ, పౌర హక్కులు, ప్రజాసంఘాల నేతలు, స్థానిక పెద్దల ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో అప్రజాస్వామిక జిఓ-1 వ్యతిరేక పోరాట ఐక్య వేదిక కన్వీనర్, బార్ కౌన్సిల్ సభ్యులు సుంకర రాజేంద్రప్రసాద్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల గొంతు నొక్కడానికే ఈ జిఓ తెచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగం ప్రసాదించిన పౌర హక్కులను ప్రభుత్వం కాలరాయడం దుర్మార్గమన్నారు. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా రోడ్లపై పాదయాత్రలు చేసి మహాత్మా గాంధీ ప్రజలను చైతన్య పరిచారని, నేటి జగన్ ప్రభుత్వం రోడ్లపై శాంతియుతంగా జరిపే సభలను, ప్రదర్శనలను నిషేధించడం శోచనీయమని పేర్కొన్నారు. సిపిఎం రాష్ట్ర

మిగతా 2లో

విజయవాడ దుర్గాపురంలో భోగి మంటల్లో జిఓ-1 ప్రతులను దగ్ధం చేస్తున్న సుంకర రాజేంద్రప్రసాద్, బాబూరావు తదితరులు

సంక్రాంతి సంబరాల్లో సిఎం దంపతులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తన సతీమణి వైఎస్ భారతితో కలిసి తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం వద్ద సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్నారు. సిఎం దంపతులకు అర్చకులు స్వాగతం పలికారు. భోగమంటలు, హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల విన్యాసాలు, పిండివంటలు, సాంస్కృతిక కార్యక్రమాలు, చిన్నారుల సంక్రాంతి నృత్యాలతో వేడుకలు వైభవంగా జరిగాయి. సాంప్రదాయ పంచెకట్టుతో సిఎం ఈ సంబరాల్లో పాల్గొన్నారు. రాష్ట్రప్రజలకు సిఎం ఈ సందర్భంగా సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంక్రాంతికి అందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సంబరాల్లో ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, తిరుమల తిరుపతి దేవస్థానం(టిటిడి) బోర్డు చైర్మన్ వైవి సుబ్బారెడ్డి, ఎంపి నందిగం సురేష్, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను, ముఖ్యమంత్రి కార్యాలయం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్య పాల్గొన్నారు.



రీ సర్వేలో 'ఎడిట్' ఏమైంది ?

- జిఓ ఇచ్చినా అమల్లోకి రానివైనం
- ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

భూముల రీ సర్వేలో తప్పులను సరిదిద్దడానికి ఎడిట్ ఆప్షన్ ఇస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రకటన ఆచరణలో అమలులోకి రాలేదు. దీంతో తప్పులను గుర్తించినా సరిచేయడానికి సాధ్యం కావడం లేదు. ఈ విషయమై అధికారులను సంప్రదించినా ఫలితం ఉండటం లేదని రైతులు వాపోతున్నారు. రీ సర్వే సందర్భంగా తప్పులను సరిచేసేందకు ఎడిట్ ఆప్షన్ ఇస్తున్నట్లు సిసిఎల్‌ఏ సాయిప్రసాద్ గతంలో ప్రకటించారు. దీనికి సంబంధించి జిఓ కూడా ఇచ్చారు. అయితే, ఇంత వరకు జిఓను బయటపెట్టలేదు. అధికారులకు పంపలేదు. ఎక్కువ తప్పులు వచ్చిన ఒకటీ రెండు జిల్లాలకు పంపించినా అక్కడ జిఓలోని అంశాలను అమలు చేయడం కష్టంగా మారింది. దీంతో ఎక్కడికక్కడ అధికారులు మిన్నకుండిపోయారు. జిఓ ప్రకారం తప్పులను గుర్తించిన గ్రామాల్లో మరలా గ్రామసభలు నిర్వహించాల్సి ఉంటుంది. గ్రామ సభల్లో వచ్చిన అభిప్రాయల ఆధారంగా నివేదిక రూపొందించి, ఆన్‌లైన్లో సరిచేయడానికి అవకాశం కల్పించారు. . దీనివల్ల ఎక్కడికక్కడ సమస్య పరిష్కారం అవుతుంది. వివిధ రైతు సంఘాల నాయకులు కూడా దీన్ని స్వాగతించారు. అయితే అమలు చేయకపోవడంతో పాటు , పాసు పుస్తకాలు ముద్రించేయడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఒకసారి ముద్రించేస్తే దాన్ని సరిచేయడానికి కోర్టుకు వెళ్లాల్సివస్తుంది. దీనిపై రైతు సంఘాల నాయకులు వడ్డే శోభనాద్రీశ్వరరావు, వై.కేశవరరావును వివరణ కోరితే గ్రామాల్లో గుర్తించిన తప్పులను అక్కడికక్కడే సరిచేసే ఇబ్బందేమీ లేదని, జిఓ ఇచ్చినా బయటపెట్టకపోవడం, అమలు చేయకపోవడం ఏమిటనే ఆందోళన అందరిలోనూ వ్యక్తమవుతుందని తెలిపారు. దీనిపై సిసిఎల్‌ఏ సాయిప్రసాదు వివరణ ఇవ్వాలని వారు కోరారు.

1800 గ్రామాల్లో తప్పులు

రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన రీసర్వేలో సుమారు 1800 గ్రామాల్లో తప్పులు దొర్లినట్లు ప్రభుత్వం గుర్తించింది. సర్వే వేగవంతంగా చేయాలని టార్గెట్ పెట్టడంతో సర్వేయర్లు ఎక్కడికక్కడ వారి వద్ద రికార్డులు ఆధారంగా పాసు పుస్తకాలు ముద్రించేశారు. కేంద్రం ఇచ్చిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్(ఎస్‌ఓపి) ప్రకారం

మిగతా 2లో

సంక్రాంతి సంబరాలు

సంక్రాంతి సందర్భంగా గంగిరెద్దుల వారి సందడి

హరిదాసు సంకీర్తనలు

ఫొటో గ్రాఫర్ టివి రమణ

సంక్రాంతిని జూదదినంగా మార్చారు

- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తెలుగువారి సంస్కృతి, సాంప్రదాయాలకు చిరునామాగా ఉన్న సంక్రాంతి పండుగను అధికార పార్టీ నేతలు జూదదినంగా మార్చారని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు ఆరోపించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా రోడ్లను సైతం బ్లాక్‌చేసి కోడిపందాలు ఆడిస్తున్నారని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో అధికార పార్టీనేతలు యథేచ్ఛగా కోడిపందేలు, జూదం ఆడిస్తూ వేలాది కుటుంబాలను రోడ్డునపడేస్తున్నారని విమర్శించారు. అక్రమాలను ప్రశ్నిస్తున్న పోలీసులపై సైతం దాడులకు తెగబడుతున్నారని తెలిపారు. క్యాసినోలు, పేకాట క్లబ్బులు, జూదాలు ప్రవేశపెట్టి యువత భవిష్యత్‌ను నాశనం చేస్తున్నారని పేర్కొన్నారు. అధికార పార్టీ నేతలు బరుల నిర్వహణకు ధరలు నిర్ణయిస్తూ సంక్రాంతి మూడు రోజుల పాటు జూద క్రీడలకు ఎలాంటి అడ్డంకులు లేకుండా చూసుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం, పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు ఉన్నాయా? పోలీసులు ఇకనైన స్పందించి కోడిపందాలు, జూద కేంద్రాలను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. రాబోయే రెండు రోజులైన సామాన్యులు సంక్రాంతి సంబరాలు సాఫీగా జరుపుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఊరూరా జగన్ దొంగలు : సుధాకర్‌రెడ్డి

అలీబాబా 40 దొంగలు మాదిరి ఊరూరా జగన్ బాబా దొంగలు ఉన్నారని టిడిపి అధికార ప్రతినిధి ఎన్‌బి సుధాకర్ రెడ్డి విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా వైసిపి నేతలు, కార్యకర్తలు ప్రజల్ని నిత్యం దోచుకోవడమే పనిగా పెట్టుకున్నారని పేర్కొన్నారు. టిడిపి కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. వైసిపి పాలనలో రోజురోజుకు దోపిడీలు, దొంగతనాలు, అరాచకాలు పెరిగిపోతున్నాయని, ప్రశ్నించిన వారిపై దాడులకు దిగుతున్నారని విమర్శించారు. చిత్తూరు జిల్లాకు చెందిన ఓ ముఖ్యనేత తన అనుచరులతో రాష్ట్రవ్యాప్తంగా అక్రమ మైనింగ్‌తో కోట్లు గడిస్తూ రాయలసీమలో రౌడీయిజాన్ని పెంచిపోషిస్తున్నారని విమర్శించారు. శేషాచలం అడవుల్లో ఉన్న ఎర్రచందనాన్ని యథేచ్ఛగా తరలిస్తూ మూడున్నరేళ్లల్లో దాదాపు రూ.40వేల కోట్లు దోచుకున్నారని విమర్శించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ముగ్గురు మంత్రులు వారి స్థాయిలో దోచుకుంటుంటే వైసిపి ఎమ్మెల్యేలు వారి కుటుంబ సభ్యుల్ని సైతం దోపిడీలో భాగస్వాముల్ని చేస్తున్నారని పేర్కొన్నారు. కాళహస్తి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, ఆయన భార్య, కుమార్తె మండలాలను పంచుకొని మరీ దోచుకుంటున్నారని విమర్శించారు.

పరిహారం ఇచ్చాకే నీళ్లు నింపాలి

- త్యాగం చేసిన వారికి 'వెలిగొండ' శాపం కాకూడదు
- నిర్వాసితులకు అండగా సంక్రాంతి తర్వాత మరో పోరాటం : వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- మార్కాపురం (ప్రకాశం జిల్లా)

పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు పరిహారం ఇచ్చాకే ఆ ప్రాజెక్టులో నీళ్లు నింపాలని, గ్రామాలను ఖాళీ చేయించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ప్రాజెక్టు కోసం త్యాగం చేసిన వారికి న్యాయం చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతోందని, ప్రభుత్వ నిర్లక్ష్యం, వ్యవహార శైలి నిర్వాసితులకు శాపంగా మారిందని పేర్కొన్నారు. పదేపదే సర్వేలతో నిర్వాసితుల సంఖ్య కుదించాలని చూడడం తగదన్నారు. వెలిగొండ ముంపు గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. నిర్వాసితుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మార్కాపురంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో శ్రీనివాసరావు మాట్లాడారు. వెలిగొండ నిర్వాసితులు ఏడు వేలకుపైగా ఉన్నారని, కటాఫ్ తేదీ పొడిగిస్తే ఆ సంఖ్య ఇంకా పెరుగుతుందని తెలిపారు. సర్వేల పేరుతో నిర్వాసితుల సంఖ్యను నాలుగు వేలకు కుదించడం అన్యాయమన్నారు. ఎందరికో మంచి జరగాలని సర్వస్వం త్యాగం చేసిన వారి పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తోన్న తీరు బాధాకరమని పేర్కొన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం గ్రామాలను ఖాళీ చేసే నాటికి కలిగిన విలువకు తగ్గట్టుగా పరిహారంతోపాటు ప్యాకేజీ ఇవ్వాల్సి ఉందన్నారు. ఎప్పుడో ఇచ్చిన ప్యాకేజీతో నిర్వాసితులను సాగనంపాలని ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి ఈ ప్రాజెక్టు నీటిని విడుదల చేస్తామని చెప్పారని ఈ సందర్భంగా శ్రీనివాసరావు గుర్తు చేశారు. దీంతో, నిర్వాసితుల్లో ఆందోళన నెలకొందన్నారు.

వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులతో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

అర్హత కలిగిన వారు వేలల్లో ఉన్నారని, వారిని ప్యాకేజీల నుంచి తొలగించి గ్రామాలు ఎలా ఖాళీ చేయిస్తారని ప్రశ్నించారు. నిర్వాసితులను సంతోషంగా సాగనంపేందుకు ప్రభుత్వం ఎంత భారమైనా మోయాల్సిందేనన్నారు.

డాక్టర్ సురేష్ అందరికీ మంత్రిగా వ్యవహరించాలి

వెలిగొండ ప్రాజెక్టు పరిధిలో ప్రాతినిధ్యం వహిస్తోన్న రాష్ట్ర మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ కొందరికి మాత్రమే మంత్రిగా వ్యవహరించడం సరికాదని శ్రీనివాసరావు విమర్శించారు. పెద్దారవీడు మండలంలోని నిర్వాసితుల సమస్యలు శ్రద్ధతో పరిష్కరించాలని అధికారులకు చెప్పడం, మిగిలిన వారి గురించి పట్టించుకోకపోవడం సరికాదన్నారు. వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులందరికీ పూర్తి స్థాయిలో న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నిర్వాసితులకు రూ.18 లక్షల ప్యాకేజీతో ఇస్తామని వైసిపి ప్రతిపక్షంలో ఉండగా సురేష్ హామీ ఇచ్చారని, ఇప్పుడు దీనికి ఆయన కట్టుబడి ఉండాలని కోరారు. నిర్వాసితులను సంతోషంగా సాగనంపేందుకు ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు కూడా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. అధికారులు చట్టాన్ని అనుసరించి పనిచేయాలని, మానవత్వంతో వ్యవహరించాలని కోరారు. వెలిగొండ నిర్వాసితుల విషయంలో ఈ విధంగా చేయకపోవడంతో నిర్వాసితులు తీవ్ర ఆందోళనతో ఉన్నారని తెలిపారు. నిర్వాసితులకు జరుగుతున్న అన్యాయంపై జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకోవాలని కోరారు. నిర్వాసితుల సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోపోతే సంక్రాంతి తర్వాత మరో పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పూనాటి ఆంజనేయులు, వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసిత పోరాట సంఘం కన్వీనర్ గాలి వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

కప్పేసిన మంచుదుప్పటి

ప్రజాశక్తి-పాలకొండ (పార్వతీపురం మన్యం)

పార్వతీపురం మన్యం జిల్లాలో ఏజెన్సీ ప్రాంతంలో పాటు మైదాన ప్రాంతాన్ని పొగమంచు కప్పేసింది. శనివారం వేకువజామున 4 గంటల నుంచి పొగమంచు దట్టంగా కురిసింది. ఉదయం 10 గంటల వరకు పొగమంచు కురవడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. రోడ్లు కూడా కనిపించకపోవడంతో వాహనదారులు కొంత ఇబ్బందులకు గురయ్యారు. ఈ పొగమంచు వలన మామిడిపూత రాలిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పొగమంచు కావడంతో ప్రజలు పనుల నిమిత్తం బయటకు రావడానికి ఇబ్బంది పడ్డారు. సీతంపేట: అసలే మన్యంలో దట్టమైన అడవులు ఉండటంతో పొగ మంచు పడుతుంది. అంతా మంచు దుప్పటి మాదిరిగా అల్లుకుంది. ఏజెన్సీలో శనివారం మంచుదుప్పటి కప్పేసింది. ఉదయం 9 గంటల వరకూ బయటికి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఇదిలా ఉండగా రోజురోజుకు ఉష్ణోగ్రతలు పడిపోవడంతో వృద్ధులు, చిన్నారులు చలితో ఇబ్బందులు తప్పడం లేదు సాయంత్రం మూడు గంటలయ్యేసరికి చలి పెరిగిపోతుంది. దీంతో ప్రజలు ఐదు గంటలలోపే మార్కెట్ చేసుకొని ఇంటికి వెళ్ళిపోతున్నారు. ఉదయం 9 గంటల వరకు ఎవరూ బయటకు రావడం లేదు. చల్లటి గాలి వీస్తుంది. వృద్ధులు, చిన్నారులకు ఇబ్బందులు తప్పడం లేదు.

రేగలో 13 పూరిళ్లు దగ్ధం

ప్రజాశక్తి - లక్కవరపుకోట (పార్వతీపురం మన్యం)

మండలంలోని రేగ గ్రామ పంచాయతీలో శనివారం తెల్లవారుజామున సంభవించిన అగ్ని ప్రమాదంలో 13 పూరిళ్లు దగ్ధమయ్యాయి. రూ 30 లక్షలు ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. 13 కుటుంబాలకు చెందిన 55 మంది కట్టు బట్టలతో మిగిలారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ఈ పమాదం జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ ఘటనలో దమ్ము అచ్చియమ్మ , బత్తిన అప్పలనరస, సిమ్మ రాము , బి.ముత్యాలమ్మ , ఎన్.ఆచారి , కె.పైడమ్మ , ఎస్.ఆదినారాయణ , ఎన్ .ప్రసాద్ , పి.నీలకంఠం , రావాడ జోగినాయుడు , బి.కనకరాజు , బి.బంగారమ్మ లకు చెందిన ఇళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఎంపిటిసి సభ్యుడు బొడ్డు గణపతి ఇచ్చిన సమాచారం మేరకు కొత్తవలస అగ్నిమాపక వాహనం హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని ఎస్ఎఫ్ఓ వై.అశోక్ కుమార్ , సిబ్బంది మంటలను అదుపు చేశారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గాడి అప్పారావు కోరారు. బాధితులందరికీ ప్రభుత్వమే పక్కా గృహాలు కట్టించి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

రీ సర్వేలో 'ఎడిట్' ఏమైంది ?

(మొదటి పేజీ తరువాయి)

రీసర్వే చేయాలంటే తొలుత భూమి వివరాలు సేకరించి వాటిని గ్రౌండ్ ట్రూతింగ్ చేసిన తరువాత డ్రోన్ ఫొటో తీసి హద్దులు నిర్ణయించాల్సి ఉంటుంది. అటువంటిదేమీ చేయకుండానే టార్గెట్ అందుకోవడం కోసం పాసు పుస్తకాలు ఇచ్చేశారు. పాసు పుస్తకాల్లో అనేక తప్పులు కనపడుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

జమకాని ఇన్సూరెన్స్ ప్రీమియం

- ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినా కనిపించని ఫలితం
- ఎండియు ఆపరేటర్లకు రికవరీ కాని సొమ్ము

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా లబ్ధిదారులకు రేషన్ అందిస్తున్న ఎండియు (మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్స్) ఆపరేటర్లకు ప్రభుత్వం చెల్లిస్తానని చెప్పిన ఇన్సూరెన్స్ ప్రీమియం సొమ్ము వారి ఖాతాల్లో జమ కాలేదు. ఎండియు ఆపరేటర్ల నుంచి సొమ్మును తీసుకోవద్దని, తిరిగి వారికే చెల్లించాలని ప్రభుత్వం బ్యాంకు ఆఫ్ బరోడాకు లేఖ పంపినా ప్రయోజనం కానరాలేదు. ఇన్సూరెన్స్ కింద బ్యాంకు ఆఫ్ బరోడా మినహాయించుకున్న డబ్బులు వారి ఖాతాలకు తిరిగి బదిలీ కాలేదు. దీంతో, పండగ పూట చేతిలో డబ్బులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 9,060 మంది ఎండియు ఆపరేటర్లు పనిచేస్తున్నారు. వీరికి రేషన్ డోర్ డెలివరీ కోసం గతేడాది జనవరి 21న ప్రభుత్వం రూ.5.83 లక్షల విలువైన వాహనాలను అందించింది. ఇన్సూరెన్స్ సొమ్మును ప్రభుత్వమే చెల్లిస్తుందని చెప్పింది. గతేడాది ఆపరేటర్ల ఖాతాల నుంచే సొమ్మును రికవరీ చేశారు. దీంతో, అప్పట్లో ఎండియు ఆపరేటర్లు ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని, పౌరసరఫరాల ఉన్నతాధికారులను పలుదఫాలు కలిశారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వమే ఇన్సూరెన్స్ సొమ్ము జమ చేయాలని మొరపెట్టుకున్నారు. ఈ నెల ఆరో తేదీ నుంచి ఇన్సూరెన్స్ కింద వారి డబ్బులు కట్ అవుతుండడంతో తీవ్ర ఆందోళనతో ఉన్నారు. దీనిపై ఎండియు ఆపరేటర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు రౌతు సూర్యనారాయణ రాష్ట్ర పౌర సరఫరాల మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావుతో ఇటీవల మాట్లాడారు. దీనిపై మంత్రి స్పందిస్తూ, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డితో మాట్లాడి ప్రభుత్వమే ఇన్సూరెన్స్ డబ్బులు చెల్లిస్తుందంటూ ఈ నెల 11న పత్రికా ప్రకటన విడుదల చేశారు. 13వ తేదీన ప్రీమియం నగదు విడుదల చేయాలని ఆర్థిక శాఖను ముఖ్యమంత్రి ఆదేశించినట్లు మంత్రి కారుమూరి ఈ ప్రకటనలో పేర్కొన్న విషయం విదితమే.

చీకటి జిఓపై ఆగ్రహజ్వాల

(మొదటి పేజీ తరువాయి)

కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, ప్రజాసంఘాల నేతలు పాల్గొన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని సోమాలమ్మ గుడి సెంటర్‌లో అప్రజాస్వామిక జిఓ-1 వ్యతిరేక పోరాట కమిటీ రాష్ట్ర కన్వీనర్, మానవ హక్కుల సంఘం నాయకులు ముప్పాళ్ల సుబ్బారావు ఆధ్వర్యంలో అఖిలపక్షం నాయకులు భోగి మంటల్లో జిఓ ప్రతులను దగ్ధం చేశారు. తొలుత చెత్తబుట్టల్లో జిఓ ప్రతులను వేసి ప్రదర్శన నిర్వహించారు. కాకినాడలో జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద ఆంధ్రప్రదేశ్ సివిల్ లిబర్టీస్ అసోసియేషన్ (ఎపిసిఎల్‌ఎ) ఆధ్వర్యంలో, సామర్లకోటలో అమ్మనమ్మ అపార్ట్‌మెంట్ వద్ద ఐద్వా ఆధ్వర్యాన జిఓ ప్రతులను భోగి మంటల్లో వేసి దగ్ధం చేశారు. పశ్చిమగోదావరి జిల్లాలో పౌరహక్కుల సంఘాలు, న్యాయవాదుల సంఘాలు, కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జిఓ ప్రతులను దహనం చేసిన నిరసన తెలిపారు. గుంటూరు జిల్లాలో డివైఎఫ్‌ఐ, ఐద్వా, ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో భోగి మంటల్లో జిఓ ప్రతులను దగ్ధం చేశారు. కర్నూలు, నంద్యాల జిల్లా వ్యాప్తంగా ప్రజాసంఘాల ఆధ్వర్యంలో భోగిమంటల్లో జిఓ1 ప్రతులను దగ్ధం చేసి నిరసన తెలిపారు. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో జిఓ ప్రతులను దగ్ధం చేశారు. కృష్ణా జిల్లా మోపిదేవిలో సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు నిరసన తెలిపారు. పెంచిన 30 శాతం రోడ్డు ట్యాక్స్‌ను రద్దు చేయాలని, జిఓ 21ని ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు. పార్వతీపురంలో ప్రజాసంఘాలు ఆధ్వర్యాన, మున్సిపల్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యాన, సాలూరు, పాలకొండ, నెల్లిమర్లలో సిఐటియు ఆధ్వర్యాన జిఓ ప్రతులను దగ్ధం చేసి నిరసన తెలిపారు. శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలసలో ఐలు ఆధ్వర్యాన నిరసన జిఓ ప్రతులను దగ్ధం చేశారు.

సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన...

ప్రకాశం జిల్లా ఒంగోలులో సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో దిబ్బల రోడ్డు జంక్షన్‌లో భోగి మంటలలో జిఓ పత్రులను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చీకటి జిఓ నెంబర్-1 తెలుగు ప్రజల పోరాటాన్ని, స్వాతంత్రోద్యమాన్ని అవమానించేదిగా ఉందని విమర్శించారు. చరిత్ర, ప్రజల పోరాటాలు తెలుసుకోకుండా నిరంకుశ చట్టాన్ని రుద్దడాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు తీవ్రంగా వ్యవరేకిస్తున్నారని తెలిపారు. నేడు బిజెపి ప్రభుత్వంతో రాజ్యాంగానికి ప్రమాదం వచ్చిందని, బిజెపి అనుసరిస్తోన్న ప్రజావ్యతిరేక విధానాలనే రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తోందని విమర్శించారు. ఈ జిఓను రద్దు చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఐక్య పోరాటాలు ద్వారా తిప్పికొడతామని హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన జిఓ-1 ప్రతులను భోగి మంటల్లో వేసి నిరసన తెలిపారు.

టిడిపి ఆధ్వర్యాన...

శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం నిమ్మాడలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపి రామ్మోహన్‌నాయుడు జిఓ ప్రతులను భోగి మంటల్లో వేశారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపక్షాలను లక్ష్యంగా చేసుకుని, రాజకీయ పార్టీల స్వేచ్ఛా హక్కును కాలరాసే విధంగా ఈ జిఓ జారీ చేసిందని విమర్శించారు. టిడిపి కార్యకర్తలపై నమోదైన కేసుల ఎఫ్‌ఐఆర్ కాపీల ప్రతులనూ భోగి మంటల్లో వేశారు. టిడిపి ఆధ్వర్యాన రాష్ట్ర వ్యాప్తంగా నిరసన తెలిపారు. వీటిలో పలుచోట్ల ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు పాల్గొన్నారు.

నేడు వందేభారత్ ప్రారంభం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తెలుగు రాష్ట్రాల ప్రజలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 15న ప్రారంభం కానుంది. సికింద్రాబాద్ - విశాఖపట్నం మధ్య నడిచే ఈ రైలును ఢిల్లీ నుంచి ప్రధాని మోడీ ఆదివారం వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. తాజాగా వందే భారత్ రైలులో ఛైర్ కార్, ఎగ్జిక్యూటివ్ క్లాస్ ప్రయాణ ఛార్జీలు వెల్లడయ్యాయి. విశాఖ - సికింద్రాబాద్ మధ్య ఒక్కరికి రూ. 1,720 (ఛైర్ కార్), రూ.3,170 (ఎగ్జిక్యూటివ్ క్లాస్)కు ఛార్జీలు వసూలు చేయనున్నారు. అలాగే సికింద్రాబాద్ నుంచి విజయవాడకు ఒక్కరికి రూ.905 (ఛైర్ కార్), రూ.1775 (ఎగ్జిక్యూటివ్ క్లాస్) ఇక సికింద్రాబాద్ నుంచి రాజమహేంద్రవరానికి రూ.1365 (ఛైర్ కార్), రూ.2485 (ఎగ్జిక్యూటివ్ క్లాస్) (క్యాటరింగ్ ఛార్జీలతో కలిపి) టికెట్ ధరలను నిర్ణయించారు. ఈ ఛార్జీలను ఐఆర్‌సిటీసీ వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తీసుకొచ్చారు. తొలుత ఈ నెల 19న ప్రారంభం కావాల్సిన ఈ రైలును సంక్రాంతి పండగ కానుకగా నాలుగు రోజులుగా ముందుగానే అందుబాటులోకి తెస్తున్నారు. తాజాగా ఈ రైలు నంబర్, ఆగే స్టేషన్లు, కాలపట్టిక వివరాలను దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. ఈ నెల 15న (ఆదివారం) ఉదయం 10.30 గంటలకు సికింద్రాబాద్ నుంచి బయలుదేరి.. చర్లపల్లి, భువనగిరి, జనగామ, ఖాజీపేట్, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, మధిర, కొండపల్లి, విజయవాడ, నూజివీడు, ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, రాజమండ్రి, ద్వారపూడి, సామర్లకోట, తుని, అనకాపల్లి, దువ్వాడ స్టేషన్లలో ఆగుతుంది (కేవలం 15వ తేదీ మాత్రమే ఈ స్టేషన్‌లలో ఆగుతుంది). రాత్రి 8.45 గంటలకు విశాఖ రైల్వే స్టేషన్‌కు చేరుకుంటుంది. 16వ తేదీ నుంచి అంటే సోమవారం నుంచి ప్రయాణికులకు అందుబాటులోకి రానుంది. ఆదివారం మినహా వారంలో ఆరు రోజుల పాటు ఈ రైలు సేవలందిస్తుంది.

విశాఖ నుంచి బయలుదేరే వందే భారత్ రైలు (20833) ప్రతి రోజూ ఉదయం 5.45 గంటలకు ప్రారంభమవుతుంది. మధ్యాహ్నం 2.15 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఈ రైలు (20834) మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమయ్యే రైలు.. రాత్రి 11.30 గంటలకు విశాఖ చేరుకుంటుంది. మార్గమధ్యంలో రాజమండ్రి, విజయవాడ, ఖమ్మం, వరంగల్ రైల్వేస్టేషన్లలో ఆగుతుంది. ఇందులో మొత్తం 14 ఏసీ ఛైర్ కార్లు సహా రెండు ఎగ్జిక్యూటివ్ ఏసీ ఛైర్ కార్ కోచ్‌లు ఉంటాయి. మొత్తం 1128 మంది ఒకేసారి ప్రయాణించడానికి వీలుగా ఈ రైలును తీర్చిదిద్దారు. వందే భారత్‌లో ప్రయాణికులకు కేటరింగ్ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇందుకోసం ఛైర్ కార్, ఎగ్జిక్యూటివ్ క్లాస్‌లో రెండు రకాలుగా ఛార్జీలు వసూలు చేస్తున్నారు. అయితే, ఈ సదుపాయం ఐచ్ఛికం మాత్రమే. ప్రయాణికులు ఒకవేళ ఆహారం వద్దనుకుంటే కేటరింగ్ ఛార్జీలు ఉండవు.

యథేచ్ఛగా కోడిపందేలు

- విచ్చలవిడిగా గుండాట, మూడు ముక్కలాట
- చేతులు మారిన రూ. వందలకోట్లు!
- ప్రేక్షకపాత్రలో పోలీసులు

ప్రజాశక్తి - యంత్రాంగం

ఉభయ గోదావరి జిల్లాల్లో యథేచ్ఛగా కోడిపందేలు సాగాయి. బరుల వద్ద గుండాట, మూడు ముక్కలాట, పేకాట సైతం విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. పందేలను అడ్డుకుంటామని నిన్నటి వరకూ బీరాలు పలికిన పోలీసులు భోగి రోజున చేతులెత్తేశారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ప్రతి మండలంలో సరాసరిన పదికిపైగా బరుల్లో కోడిపందేలు కొనసాగాయి.కాళ్ల మండలం సీసలిలో ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు, బుట్టాయగూడెం మండలం దుద్దుకూరులో పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, పెదవేగి మండలం కొండలరావుపాలెంలో దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బాయి చౌదరి, జడ్‌పి చైర్మన్ కవురు శ్రీనివాస్, పాలకొల్లులో మాజీ ఎమ్మెల్యే మేకా శేషుబాబు కోడిపందేల్లో పాల్గొన్నారు. పెద్దపెద్ద బరుల్లో ఒక్కో పందానికి రూ.ఐదులక్షల నుంచి రూ.పది లక్షలు వరకూ బెట్టింగ్ సాగుతోంది. మధ్యాహ్నం నుంచి గుండాట, మూడు ముక్కలాటలను నిలుపుదలచేయాలని పోలీసులకు ఆదేశాలు వచ్చినట్లు తెలుస్తోంది. బరుల ప్రాతిపదికన ప్రతి పోలీస్‌స్టేషన్‌కు రూ.ఏడు లక్షల నుంచి రూ.ఎనిమిది లక్షలు మామూళ్ల రూపంలో పందేల నిర్వాహకులు అందించినట్లు ప్రచారం సాగుతోంది. భీమవరం ప్రాంతంలోని డేగాపురంలో కోడిపందేలను చూసేందుకు సినీ హీరో కిరణ్ అబ్బవరం హాజరయ్యారు. పందేల్లో ఎక్కువగా స్థానిక అధికార, ప్రతిపక్ష నాయకులే కీలకంగా వ్యవహరిస్తున్నారు.

కాకినాడ జిల్లా తాళ్లరేవు మండల జార్జిపేటలో ఫ్లడ్ లైట్ల వెలుగులో నిర్వహిస్తున్న కోడి పందేలు, (ఇన్‌సెట్‌లో) కోడి పందేలను ప్రారంభిస్తున్న పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

తొలిరోజు దాదాపుగా రూ.50 కోట్లకు పైగా పందేల రూపంలో బెట్టింగ్ సాగినట్లు అంచనా వేస్తున్నారు. రెండు జిల్లాల్లోనూ 47 మండలాల్లో 400కుపైగా బరుల్లో కోడిపందేలు సాగుతున్నట్లు అంచనా. తూర్పుగోదావరి, కాకినాడ జిల్లాలో ఎప్పటిలానే కోడిపందాలు జరిగాయి. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం జార్జిపేటలో అతిపెద్ద బరిని ఏర్పాటు చేశారు. ఇక్కడ పాస్ ఉన్నవారినే లోపలికి అనుమతిస్తున్నారు. ఈ బరి వద్ద ప్రత్యేక డైనింగ్ హాల్‌ను సైతం నిర్వాహకులు ఏర్పాటు చేశారు. రాత్రి కూడా పందేల నిర్వహణకు తగ్గట్టుగా ఫ్లడ్ లైట్లను ఏర్పాటు చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా తొలిరోజు రూ.40 నుంచి రూ.60 కోట్ల వరకూ చేతులు మారినట్టు సమాచారం.

కోనసీమలో తగ్గిన జోరు

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో గతంతో పోల్చుకుంటే కోడిపందేలు జోరు తగ్గింది. జిల్లాలోని ప్రజాప్రతినిధులు అందరూ కోడిపందేల నిర్వహణ కోసం అమలాపురంలో వైసిపి ఎంఎల్‌ఎలు మంత్రి పినిపే విశ్వరూప్ ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశమయ్యారు. అనుమతులు ఇవ్వాలని, కఠినంగా వ్యవహరిస్తున్న ఎస్‌పికి కళ్లెం వేయాలని ఉభయ గోదావరి జిల్లాలో పరిశీలకుడు ఎంపి మిథున్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.

కోడిపందేలను అడ్డుకుంటే ప్రభుత్వమే చూసుకుంటుంది అంటూ రాజోలు ఎమ్మెల్యే రాపాక, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సమావేశం అనంతరం ప్రకటించారు. ఎస్‌పి ఆధ్వర్యంలో పోలీసు బృందాలు వాహనాల్లో తిరుగుతూ పందేలను కట్టడి చేశాయి. రాజకీయ నాయకుల అండతో కొన్ని చోట్ల కోడిపందేలు జరిగాయి.

మట్కా, జూదాలతో మహిళలు, యువతకు దు:ఖం

- ప్రభుత్వం అరికట్టాలని ఐద్వా డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సంక్రాంతి పేరుతో నిర్వహించే కోడిపందాలు, మట్కా జూదాలు మహిళలు, యువతకు దు:ఖాన్ని కలిగిస్తాయని ఐద్వా రాష్ట్ర కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. ఉభయ గోదావరి జిల్లాలతోపాటు, గుంటూరు, కృష్ణా జిల్లాల్లో భారీగా కోడి పందేలు, మట్కా జూదాల నిర్వహణకు వేలమంది ప్రజలను ఆకర్షించే చర్యలకు దోపిడీ ముఠాలు పూనుకోవడం శోచనీయమని ఆ సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి ప్రభావతి, డి రమాదేవి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వీటిని నిర్వహించుకోవచ్చునని బహిరంగంగా చెప్పిన ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ చర్యలకు మంత్రులు, ఎమ్మెల్యేలు మద్దతు తెలపడాన్ని, వాటిని నివారించేందుకు ప్రభుత్వం పనిచేయకపోవడాన్ని ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇలాంటి వాటివల్ల అనేక కుటుంబాలు వీధిన పడుతున్నాయని పేర్కొన్నారు. మట్కా, జూదాలు, కోడిపందేలతో పేద ప్రజలు కూడా తమ కుటుంబాలను హింసిస్తున్నారని పేర్కొన్నారు. వీటిని నిరోధించాల్సిన అధికారపక్షం లాభాల కోసం, అనుచరుల కోసం పనిచేస్తోందని విమర్శించారు. అక్క, చెల్లెళ్ల కోసం పనిచేస్తున్నామని చెప్పుకునే ముఖ్యమంత్రి వీటిపై మాట్లాడాలని, అరికట్టేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సాంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాలతో సంక్రాంతి సంబరాలు నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అందుకు భిన్నంగా ప్రజలను వ్యసనపరులను చేసి కుటుంబాలను ఇబ్బందుల పాలు చేయడం తగదని పేర్కొన్నారు. జూదాలు, అక్రమ మద్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి, డిజిపిలను కోరారు.

డిమార్ట్ లాభాల్లో 7% వృద్ధి

ముంబయి : డిమార్ట్ రిటైల్ చెయిన్ మాతృసంస్థ అవెన్యూ సూపర్‌మర్ట్స్ 2022 డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో 6.71 శాతం వృద్ధితో రూ.589 కోట్ల నికర లాభాలు ప్రకటించింది. 2021 ఇదే అక్టోబర్- డిసెంబర్ త్రైమాసికంలో రూ.552.53 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.9,217 కోట్లుగా ఉన్న రెవెన్యూ.. గడిచిన త్రైమాసికంలో 25.50 శాతం పెరిగి రూ.11,569.05 కోట్లకు చేరింది. 2022 డిసెంబర్ త్రైమాసికంలో అవెన్యూ సూపర్‌మర్ట్స్ వ్యయం 27.02 శాతం పెరిగి రూ.10,788.86 కోట్లుగా నమోదయ్యింది. 2021-22 డిసెంబర్ త్రైమాసికంలో రూ.8,493 కోట్ల వ్యయాలు చేసింది.

సేవ్ వైజాగ్ స్టీల్

- విశాఖలో భోగి మంటల వద్ద ప్రజ్వరిల్లిన 'ఉక్కు' నినాదం

సుజాత నగర్‌లో భోగి మంట వద్ద సేవ్ వైజాగ్ స్టీల్ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న కాలనీవాసులు

ప్రజాశక్తి - విలేకరుల యంత్రాంగం

భోగి పండగ వేళ ఉమ్మడి విశాఖ జిల్లాలో 'ఉక్కు' నినాదం మార్మోగింది. సంక్రాంతి వేడుకల్లో 'సేవ్ వైజాగ్ స్టీల్' పేరిట విస్తృతంగా కార్యక్రమాలు చేపట్టాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఇచ్చిన పిలుపును విశాఖ వాసులు అందిపుచ్చుకున్నారు. పౌర, ప్రజా, కాలనీ సంఘాలతోపాటు సిపిఎం, సిఐటియు ఆధ్వర్యాన వాడవాడలా శనివారం భోగి మంటల వద్ద కార్యక్రమాలు నిర్వహించారు. ఒక్కో కట్టెనూ భోగి మంటలో వేస్తూ 'సేవ్ వైజాగ్ స్టీల్, విశాఖ ఉక్కును కాపాడుకుంటాం, విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు' అంటూ నినదించారు. కొన్నిచోట్ల ప్లకార్డులు ప్రదర్శించారు. మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఉక్కునగరం, గాజువాక పారిశ్రామిక ప్రాంతంలోని స్వతంత్రనగర్, దుర్గానగర్, దశమకొండ, రామచంద్ర నగర్, అక్కిరెడ్డిపాలెం, అప్పన్న కాలనీ, బానోజీతోట ప్రాంతాల్లో కాలనీ సంఘాలు, సిపిఎం, సిఐటియు ఆధ్వర్యాన కార్యక్రమాలు చేపట్టారు. తోకాడలో సమైక్య అపార్టుమెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన 'ప్రయివేటీకరణ భూతం' దిష్టిబొమ్మతో నిరసన తెలిపారు. సీతమ్మధారలోని ఎల్ఐసి అపార్టుమెంట్‌ల వద్ద భోగి మంట వేసి సేవ్ వైజాగ్ స్టీల్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ పాల్గొన్నారు. డాబాగార్డెన్స్‌లోని కృష్ణా గార్డెన్స్ ఏరియాలో డివైఎఫ్ఐ ఆధ్వర్యాన యువకులు భోగి మంటలు వేశారు. విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యాన జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద భోగిమంట వేసి 'అమ్మేదెవడురా.. కొనేదెవడురా' అంటూ నినదించారు. అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లోనూ కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం రాత్రి ఉక్కునగరంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు భోగి మంట వెలిగించారు. రాష్ట్ర ప్రజలకు భోగి, సంక్రాంతి పండగ శుభాకాంక్షలు తెలిపారు. లక్షలాది మంది భవిష్యత్తుతో ముడిపడి ఉన్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేయాలని అనుకోవడం దుర్మార్గమన్నారు. పండగ సమయంలో 'సేవ్ వైజాగ్ స్టీల్' పేరిట కార్యక్రమాలు నిర్వహించి ఉక్కు కార్మికుల పోరాటానికి మద్దతుగా నిలవాలని కోరారు.

'ఉక్కు' ప్రజా గర్జనను జయప్రదం చేయండి

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

ఉక్కునగరంలోని తృష్ణా మైదానంలో ఈ నెల 30న జరిగే ఉక్కు ప్రజా గర్జన సభను జయప్రదం చేయాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారానికి 702వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్‌ప్లాంట్‌లోని వివిధ విభాగాల కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి పోరాట కమిటీ చైర్మన్లు డి.ఆదినారాయణ, ఎం.రాజశేఖర్ మాట్లాడుతూ దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన స్టీల్‌ప్లాంట్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రయివేటీకరించాలని నిర్ణయించడం దారుణమన్నారు. లాభాల్లో నడుస్తోన్న కర్మాగారాన్ని ఎలా అమ్మేస్తారని ప్రశ్నించారు. ఇప్పటికైనా మోడీ సర్కారు తన నిర్ణయాన్ని మార్చుకోవాలని, స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించి, పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో నడిచేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాకాకుండా మొండిగా స్టీల్‌ప్లాంట్ జోలికొస్తే సహించేది లేదని హెచ్చరించారు. దీక్షల్లో నాయకులు మస్తానప్ప, కె.భాస్కరరావు, సిహెచ్.సన్యాసిరావు పాల్గొన్నారు

కెపి రెడ్డయ్యకు కన్నీటి వీడ్కోలు

- ముగిసిన అంత్యక్రియలు

కెపి రెడ్డయ్య భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం సీనియర్ నాయకులు పాటూరు రామయ్య

ప్రజాశక్తి-మొవ్వ

మాజీ ఎంపి కొలుసు పెద రెడ్డయ్య (కె.పి.రెడ్డయ్య) అంత్యక్రియలు అశ్రునయనాల మధ్య ఆదివాకం ముగిశాయి. కృష్ణా జిల్లా మొవ్వ మండలం కారకంపాడులోని సొంత వ్యవసాయ క్షేత్రంలో భౌతికకాయానికి ప్రభుత్వ అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. రెడ్డయ్య కుమారుడు పెనమలూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి కొలుసు పార్థసారథి అంతిమ సంస్కారం చేశారు. అంత్యక్రియల్లో పార్థసారథి సోదరులు డాక్టర్ సురేష్ బాబు, శ్రీకాంత్ యాదవ్‌లతో కలిసి స్థానిక ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ రెడ్డయ్య పాడెను మోశారు. టిటిడి చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి, ఎమ్మెల్యేలు పేర్ని వెంకట్రామయ్య (నాని), సింహాద్రి రమేష్ బాబు, మధుసూదనరావు యాదవ్, మాజీ ఎమ్మెల్యే, సిపిఎం సీనియర్ నాయకులు పాటూరు రామయ్య, మాజీ ఎమ్మెల్యేలు డివై దాస్, ఉప్పులేటి కల్పన, సిపిఎం నాయకులు శీలం నారాయణరావు, మద్దుల బసవరావు తదితరులు రెడ్డయ్య భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

గత 'అనధికారుల'పై ఆరా

వివరాలు కోరిన జిఎడి

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

గత ప్రభుత్వ హయాంలో పనిచేసిన అనధికార ప్రముఖుల వివరాలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. అన్ని శాఖల నుంచి అటువంటి వారి వివరాలు సమర్పించాలని నిర్దేశించింది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తున్న సలహాదారులపై న్యాయస్థానంలో కేసులు నమోదుకావడం, దానిపై హైకోర్టు కూడా సీరియస్‌గానే స్పందించడంతో పాత వివరాలు కూడా సేకరించే పనిలో ప్రభుత్వం పడింది.

ప్రధానంగా రాష్ట్ర విభజన జరిగిన 2014 జూన్ ఒకటి నుంచి నామినేటెడ్ పోస్టుల్లో పనిచేసిన వారి వివరాలు సేకరించాలని వివిధ ప్రభుత్వ శాఖలకు సాధారణ పరిపాలన శాఖ నుండి ఆదేశాలు అందాయి. సలహాదారులు, కన్సల్టెంట్స్, పలు సంస్థలకు చైర్మన్లు, డైరెక్టర్లుగా పనిచేసిన వారందరి వివరాలు ఇవ్వాలని అన్ని ప్రభుత్వ శాఖలకు ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ ఉద్యోగులు కాకుండా మిగిలిన అందరి వివరాలు సమర్పించాలని పేర్కొంది. దీనికోసం ప్రత్యేకంగా ఒక నమూనాను కూడా అన్ని శాఖలకు పంపించింది. నియమితులైన వ్యక్తి పేరు, ఏ శాఖలో నియమితులయ్యారు, ఎప్పుడు నియమితులయ్యారు, ఇచ్చిన వేతనం ఎంత, ఎంత కాలం పనిచేశారన్న వివరాలు సమర్పించాలని నిర్దేశించారు. ఈ వివరాలను ప్రభుత్వ అడ్వకేట్ జనరల్‌కు కూడా పంపించాలని ఆ సర్క్యులర్‌లో పేర్కొన్నారు.

రిబ్బన్ కట్‌చేసి అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న డిఆర్ఒ నాగేశ్వరరావు

ఆదర్శనీయుడు సుందరయ్య

- కొనియాడిన పలువురు వక్తలు
- సుందరయ్య స్ఫూర్తి కేంద్రం ఆధ్వర్యంలో అంబులెన్స్ ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పుచ్చలపల్లి సుందరయ్య గొప్ప ఆదర్శనీయుడని పలువురు వక్తలు కొనియాడారు. ఆయన పేరు మీద సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. సుందరయ్య స్ఫూర్తి కేంద్రానికి దాతలు అవ్వ సుబ్బమ్మ , అవ్వ బాల వీరారెడ్డి, మంజులత వాహనాన్ని విరాళంగా ఇచ్చారు. ఈ వాహనాన్ని ఉచిత అంబులెన్స్‌గా మార్పుచేసి ప్రజల సౌకర్యార్థం సుందరయ్య స్ఫూర్తి కేంద్రం వారు అందుబాటులోకి తీసుకొచ్చారు. కర్నూలు కలెక్టరేట్ ప్రాంగణంలో సుందరయ్య స్ఫూర్తి కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత అంబులెన్స్ వాహనాన్ని డిఆర్ఒ నాగేశ్వరరావు శనివారం ప్రారంభించారు. రవీంద్ర విద్యాసంస్థల అధినేత పుల్లయ్య జెండా ఊపారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వారు మాట్లాడుతూ.. సుందరయ్య కమ్యూనిస్టు గాంధీ అని, అజాత శత్రువు అని కొనియాడారు. అలాంటి గొప్ప వ్యక్తి పేరున ఈ జిల్లాలో ప్రజలకు అనునిత్యం ఉపయోగపడే ఉచిత అంబులెన్స్‌ను ప్రారంభించడం అభినందనీయమని తెలిపారు. సుందరయ్య స్ఫూర్తి కేంద్రం చైర్మన్ కె. ప్రభాకర్ రెడ్డి అధ్యక్షత వహించారు. ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ, డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ వినోద్, డాక్టర్ రాజేంద్రప్రసాద్, రైస్ మిల్ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు బ్రంహయ్య, అవోపా కార్యదర్శి యుగంధర్ బాబు, ప్రముఖ వ్యాపార వేత్త వాహిద్ ఉస్సేన్, యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు సురేష్ కుమార్, సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్, ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ ఏ. సుభాన్, తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు ఉపాధి కల్పనకు యంత్రాలు

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు యంత్రీకరణ దన్ను కల్పించడం హర్షనీయమని, యంత్రాల వల్ల ఉపాధి కోల్పోతున్న వ్యవసాయ కార్మికులకూ దన్నుగా యంత్రాలు సమకూర్చాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దడాల సుబ్బారావు, వి.వెంకటేశ్వర్లు శనివారం ప్రకటన విడుదల చేశారు. యంత్రాల ద్వారా ఉపాధి కోల్పోతున్న వ్యవసాయ కార్మికులు కూడా మనుషులే అన్న స్పృహ పాలకులకు లేకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఇప్పటికే నాట్లు నుండి కోత, నూర్పిడి వరకు, మట్టి తవ్వకం నుండి పరిశ్రమల నిర్మాణం వరకూ యంత్రాలు వచ్చేశాయని తెలిపారు. దీనివల్ల కోట్లమంది వ్యవసాయ కార్మికులు పనిలేక పొట్టకూటి కోసం వలసలు పోతున్నారని వివరించారు. చదువుకోవాల్సిన పిల్లలు పనులకు పోతున్నారని, దీనివల్ల వారి జీవితం ఇబ్బందుల్లో పడుతోందని తెలిపారు. గతంలో ఏడాదికి 200 రోజుల నుండి 250 రోజుల వరకూ పని దొరికేదని, ఇప్పుడు 30 నుండి 40 రోజులు కూడా దొరకడం లేదని పేర్కొన్నారు. యంత్రాలు వారి కడుపులు కొడుతున్నాయని వివరించారు. రైతులకు సబ్సిడీ రేట్లతో యంత్రాలు ఇచ్చినట్లు ఉపాధి కోసం కూలీలకు యంత్రాలు ఇవ్వాలని, లేదా ప్రతి కుటుంబానికి రెండు ఎకరాల భూమి, ఏడాదికి 300 ఉపాధి హామీ ద్వారా పనులు కల్పించి రోజు వేతనం రూ.600 ఇవ్వాలని వారు డిమాండు చేశారు.

ఎనిమిదేళ్లలో క్యాడర్ ఖాళీ

- 2031 నాటికి 1.17 లక్షల మంది పదవీ విరమణ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్ర ప్రభుత్వ పాలనలో కీలకంగా వ్యవహరించాల్సిన ఉద్యోగులు, అధికారులు రానున్న ఎనిమిది సంవత్సరాల్లో పెద్ద సంఖ్యలో రిటైర్ కానున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని సరైన నియామకాల ప్రక్రియ చేపట్టకపోతే భారీ నష్టం జరుగుఉతందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అధికారిక లెక్కల ప్రకారమే లక్ష మందికి పైగా ఉద్యోగులు, అధికారులు 2031 నాటికి పదవీ విరమణ చేయనున్నారు.

గత కొన్నేళ్లుగా సరైన నియామకాలు లేకపోవడం వల్ల భారీగా ఖాళీలు ఏర్పడుతున్నాయి. నాలుగో తరగతి ఉద్యోగుల నుంచి గ్రూప్-1 వరకు ఆశించిన స్థాయిలో నియామకాలు జరగడం లేదు. అడపాదడపా కొన్ని నియామకాలు జరుగుతున్నప్పటికీ.. వాటికన్నా పదవీ విరమణ చేసే వారి సంఖ్య భారీగా ఉంటోంది. భవిష్యత్తులో ఇదే సమస్యగా మారనుంది. తాజాగా తెలిసిన సమాచారం మేరకు 2031 నాటికి 1,17,355 మంది పదవీ విరమణ చేయనున్నారు. ఉద్యోగుల పదవీ విరమణ పరిమితి పెంచడం వల్ల 2022, 2023 సంవత్సరాల్లో పదవీ విరమణ చేసే వారు లేరు. ఆ తరువాత 2024 నుంచి వరుసగా రిటైర్‌మెంట్ తీసుకునే ఉద్యోగులు పెరగనున్నారు. 2024లో 13,643 మంది పదవీయ విరమణ చేయనుండగా, అక్కడి నుంచి ప్రతియేటా వారి సంఖ్య పెరగనుంది. 2030 వరకు భారీగా పెరుగుతుండగా, 2031లో మాత్రం కొద్దిగా తగ్గనుంది.

పింఛన్లకు 2.74 లక్షల కోట్లు

పదవీ విరమణ చేసే వారి సంఖ్య ఎంతగా పెరుగుతోందో వారికి చెల్లించాల్సిన పింఛను మొత్తం కూడా అంతే స్థాయి లో పెరుగుతోంది. 2024 నుంచి 2031 వరకు ఎనిమిదేళ్లలో ఏకంగా 2,73,780 కోట్లు చెల్లించాల్సి ఉంటుందని ఒక అంచనా. అత్యధికంగా 2031లో ఒక్క సంవత్సరమే 34,252 కోట్లు పింఛనుదారులకు చెల్లించాల్సి ఉంటుంది.

రానున్న పదవీ విరమణ ఉద్యోగుల పరిస్థితి

సంవత్సరం	పదవీవిరమణ ఉద్యోగుల సంఖ్య	చెల్లించాల్సిన (రూ.కోట్లలో) పింఛను మొత్తం
2022	---	17,205
2023	---	18,237
2024	13,643	25,520
2025	13,583	26,470
2026	14,095	27,795
2027	14,905	29,321
2028	14,734	30,279
2029	14,620	31,343
2030	16,227	33,358
2031	15,548	34,252
మొత్తం	1,17,355	2,73,780

'సైకో' చర్యలు భరించలేం..!

- భోగిమంటల్లో జిఒ నంబర్-1 ప్రతుల దగ్ధంలో చంద్రబాబు

ప్రతులను భోగి మంటల్లో వేస్తున్న చంద్రబాబు, ఇతర నాయకులు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

'ఇవ్వాళ ప్రతి ఇంటిలోనూ కష్టాలున్నాయి.. వీటిని భోగి మంటల్లో తగలబెట్టి కొత్త ఉత్సాహంతో ముదుకెళ్లాలి.. సైకో చర్యలను భరించలేకున్నాం.. ఈ రాష్ట్రానికి పట్టిన శని సిఎం.. టిడిపిని ఎవరూ ఏమీ చేయలేరు' అని మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గం నారావారిపల్లిలో శనివారం తెల్లవారుజామున తన కుటుంబంతో కలిసి చంద్రబాబు భోగి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిఒ నంబర్-1 ప్రతులను భోగి మంటల్లో దగ్ధం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అందరికీ ఈ పండుగ కలిసి రావాలన్నారు. నాడు విజన్ 2020 అంటే అందరూ తనను ఎగతాళి చేశారని, 2047 ఏడాదికి ఒక విజన్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. అప్పట్లో కుటుంబ నియంత్రణ కోసం హెచ్చరించానని, అయితే చావు పుట్టుకల మధ్య అసమతుల్యం వచ్చిందని తెలిపారు. రాబోయే ఏడాది కీలకమని, తన నలభై ఏళ్ల రాజకీయ జీవితంలో ఏ తప్పు చేయలేదని చెప్పారు. పోలీసులు తనను కొడితే సిఎం ఆనందిస్తారని, పుంగనూరులో 40 రోజుల్లో పది ఎఫ్ఐఆర్ కేసులు నమోదు చేసి వందమందిని అరెస్టు చేశారన్నారు. 'మా వాళ్లకు పండుగ లేకుండా చేశావ్.. ఇప్పటివరకూ మంచితనం చూశావు.. నా కఠినత్వం చూస్తావు.. వడ్డీతో సహా చెల్లిస్తాను' అని మంత్రి పెద్దిరెడ్డిని హెచ్చరించారు. టిటిడి అద్దె గదులు పెంచారని, ప్రసాదాల నాణ్యత తగ్గిందని, రేట్లు పెంచి వ్యాపారం చేయొద్దని హితవు పలికారు. నారావారిపల్లి మహిళలతో నారాభువనేశ్వరి, బ్రాహ్మణి కలిసి రంగోలి వేసి గొబ్బెమ్మలు ఆడారు. ప్రతి ఏడాదీ నారావారిపల్లిలో సంక్రాంతి జరుపుకోవడం ఆనందంగా ఉందని బ్రాహ్మణి తెలిపారు.

చంద్రగిరి సినిమా థియేటర్లో బాలకృష్ణ సందడి

నారావారిపల్లి నుంచి స్వయంగా కారు నడుపుకుని చంద్రగిరి సినిమా థియేటర్‌కు బాలకృష్ణ వెళ్లారు. వీరసింహారెడ్డి సినిమా చూసి బాగా ఎంజాయ్ చేశామని, అందరూ చూడాలని అభిమానులను ఈ సందర్భంగా కోరారు. వీరసింహారెడ్డి ఫ్యాక్షన్ సినిమా కాదని, సకుటుంబ సపరివార సమేతంగా చూడాలన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిస్థితులనే వీరసింహారెడ్డి సినిమాలో చూపించామని, రాష్ట్రంలో ఎమర్జన్సీ పరిస్థితులు ఉన్నాయని తెలిపారు.

క్రిప్టో అంటేనే బూటకం

- వాటికి విలువ లేదు
- ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్

ముంబయి : క్రిప్టో కరెన్సీ అంటేనే బూటకం, జూదం లాంటిదని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) గవర్నర్ శక్తికాంత దాస్ అన్నారు. ఆ కరెన్సీకి ఎలాంటి విలువ లేదని స్పష్టం చేశారు. అయితే.. వాటికి విలువ ఉన్నట్లుగా నమ్మిస్తున్నారన్నారు. శక్తికాంత దాస్ మీడియాతో మాట్లాడుతూ.. "ఏ ఆస్తికైనా, ఆర్థిక ఉత్పత్తికైనా అంతర్గత విలువ అనేది ఒకటి ఉండాలి. కానీ.. క్రిప్టోల విషయంలో అలాంటి విలువ ఏదీ లేదు. వీటి విలువ అంతా అభూత కల్పనే.. మన దేశంలో జూదం అడటానికి అనుమతి లేదు.. జూదాన్ని అనుమతించాలనుకుంటే క్రిప్టోలను జూదంగా పరిగణించాల్సి వస్తుంది. ఈ జూదాన్ని అనుమతించబోం. అలాంటి వాటి విస్తరణను నిషేధించాల్సిన అవసరం ఉంది. వాటి అనియంత్రిత వృద్ధికి అనుమతించినట్లయితే కేంద్ర బ్యాంకు అధికారాన్ని కూడా బలహీనం చేస్తుంది. అలాంటి క్రిప్టో కరెన్సీలను దేశంలో నిషేధించాల్సిందే." అని దాస్ పేర్కొన్నారు.

"క్రిప్టో కరెన్సీల వృద్ధిని ఎదుర్కొనేందుకు ఇటీవల ఆర్‌బిఐ ఇ-రూపాయి సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ (సిబిడిసి)ని పైలట్ పద్ధతిలో ఆవిష్కరించింది. ఈ సిబిడిసి అనేది డబ్బు భవిష్యత్ అని, దానిని స్వీకరించడం రవాణ, ముద్రణ వ్యయాలను ఆదా చేయడంలో సాయపడుతుంది. మారుతున్న టెక్నాలజీలకు అనుగుణంగా విధానాలు మార్చుకుంటూ బ్లాక్ చెయిన్ టెక్నాలజీకి క్రిప్టో అప్లికేషన్ల కారణంగా మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఉందని కొంత మంది వాదిస్తున్న నేపథ్యంలో అలాంటప్పుడు ఆస్థికి అంతర్లీన విలువ ఉండాలి.. కానీ క్రిప్టోకు అంతర్లీన విలువ లేదు. క్రిప్టోలతో దేశ ఆర్థికవ్యవస్థ కుదేలయ్యే ప్రమాదం ఉంది." అని దాస్ పేర్కొన్నారు.

హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్‌కు రూ.12,259 కోట్ల లాభాలు

ముంబయి : ప్రయివేటు రంగంలోని హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ 2022-23 ఆర్థిక సంవత్సరం డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో 18.50 శాతం వృద్ధితో రూ.12,259 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.10,342.20 కోట్ల లాభాలు నమోదు చేసింది. క్రితం క్యూ3లో బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) రూ.22.987 కోట్లకు చేరడంతో మెరుగైన ఆర్థిక ఫలితాలను సాధించగలిగింది. 2021-22 ఇదే క్యూ3లో రూ.18,443 కోట్ల ఎన్ఐఐ నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.26,627 కోట్లుగా ఉన్న రెవెన్యూ.. క్రితం క్యూ3లో 18.3 శాతం పెరిగి రూ.31,487.7 కోట్లకు చేరింది. 2022 డిసెంబర్ ముగింపు నాటికి బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు యథాతథంగా 1.23 శాతంగా నమోదయ్యాయి. నికర నిరర్థక ఆస్తులు 0.33 శాతంగా చోటు చేసుకున్నాయి. గడిచిన డిసెంబర్ త్రైమాసికంలో మొండి బాకీల కోసం రూ.2,806.4 కోట్ల కేటాయింపులు చేసింది. 2022 డిసెంబర్ 31 నాటికి బ్యాంక్ మొత్తం రుణాలు రూ.15.07 లక్షల కోట్లుగా, రూ.17.33 లక్షల కోట్ల డిపాజిట్లు నమోదయ్యాయి.

OFFICE OF THE RECOVERY OFFICER-II
DEBTS RECOVERY TRIBUNAL
(Ministry of Finance, Government of India)
Ground & 1st Floor, 31-31-21, Narayana Bhavanam, Sai Baba Street, Dabagardens, Visakhapatnam-530020, A.P.

FORM – 17
(See Rule No. 53 of the Second Schedule to the Income Tax Act, 1961)
NOTICE FOR SETTLING A SALE PROCLAMATION

R.P. No.788 of 2017 in OA No. 79 of 2016
Canara Bank, Gudivada Branch, Krishna District
Versus
Sri Jaddu Papamani & another

To
(CD-1) Mr. Jaddu Papamani, S/o Surayya, D.No. 14-9-16, Kavurivari street, Bhimavaram, West Godavari Dt, Andhra Pradesh.
(CD-2) Mr. Chilukuri Venkateswara Rao, S/o Nageswara Rao D.No. 8/315, Rajendranagar, Gudivada, Krishna Dt, Andhra Pradesh.

Whereas in execution of Recovery Certificate dated 14.11.2017 in O.A. No. 79/2016 for **Rs. 37,49,641.20** ps. with future interest @ 13.40% p.a. with half yearly rests from 01.02.2016 till realization forwarded by the Hon'ble Presiding Officer, Debts Recovery Tribunal, Visakhapatnam, the undersigned has ordered the sale of the under mentioned immovable properties.

You, the Certificate Debtors / Defendants above named, are hereby informed that on or after fifteenth day from the date of service of this notice has been fixed for drawing up the proclamation of sale and settling the terms thereof. You are requested to bring to the notice of the undersigned any encumbrances, charges, claims or liabilities attaching to the said properties or any portion thereof.

SPECIFICATION OF PROPERTIES

SCHEDULE-A: Site measuring an extent of 1000 Sq. Yds. Out of total extent 9800 sq. yds. in Old R.S.No. 118, and New R.S.No.48, situated at Tangellamudi Village, Thangellamudi Gram panchayat, Eluru Mandal, Eluru Sub-Registry, West Godavari District with the following boundaries: North: Panchayath Road, South: Site of Executants, East: Remaining site of Executant, West: Site of Jaddu Bhaskara Rao.

Given under my hand and seal of this at Visakhapatnam on the 21st December, 2022
(B.N.S.V.S.K. Bangarraju) Recovery Officer-II
Debts Recovery Tribunal, Visakhapatnam

OFFICE OF THE RECOVERY OFFICER-II
DEBTS RECOVERY TRIBUNAL
(Ministry of Finance, Government of India)
Ground & 1st Floor, 31-31-21, Narayana Bhavanam, Sai Baba Street, Dabagardens, Visakhapatnam-530020, A.P.

FORM – 17
(See Rule No. 53 of the Second Schedule to the Income Tax Act, 1961)
NOTICE FOR SETTLING A SALE PROCLAMATION

R.P. No.624 of 2018 in OA No.477 of 2017
Canara Bank, Chandramouli Nagar Branch, Guntur District
Versus
M/s. Sai Sreeja Traders & Others

To
(CD-1) M/s. Sai Sreeja Trders, Rep by its Proprietor Sri Godugula Vamsi Krishna Varma, D.No.25-13-36, 8th line, Srinivasaraothota, Guntur-522002.
(CD-2) Sri Godugula Vamsi Krishna Varma, S/o G. Murali Varma, D.No.25-13-36, 8th line, Srinivasaraothota, Guntur.
(CD-3) Smt. G. Swathi, W/o Sri Godugula Vamsi Krishna Varma, Flat No.A4, R.R. Residency, 7/7 line, Srinagar, Guntur.

Whereas in execution of Recovery Certificate dated 09.10.2018 in O.A. No.477/2017 for Rs.4,12,53,902/- with future interest @ 11.50% p.a. with monthly rests from 16.06.2017 till realization forwarded by the Hon'ble Presiding Officer, Debts Recovery Tribunal, Visakhapatnam, the undersigned has ordered the sale of the under mentioned immovable properties.

You, the Certificate Debtors / Defendants above named, are hereby informed that on or after fifteenth day from the date of service of this notice has been fixed for drawing up the proclamation of sale and settling the terms thereof. You are requested to bring to the notice of the undersigned any encumbrances, charges, claims or liabilities attaching to the said properties or any portion thereof.

SPECIFICATION OF PROPERTIES

SCHEDULE-A: Schedule of property belongs to Defendant No.2&3: (Vide document No.11406/2013). All that part and parcel of land property is tthatched house bearing D.no.8-12-129 situated at Sanjeevreddy nagar Bapathu Guntur village D.No.423/2, D.T.No.26, within the municipal corporation area, Guntur Sub-division, Guntur District, bounded by: East Plot no.11 of Kotari Seetharavamma, South: Plot No.4 of Buchenna Boyina Venkatarlu, West: 22 feet wide Road, North: Plot No.2 of Thuraka Kotaiah.

Schedule-B: Sehedule of property belongs to Defendant No.2: All that part and parcel of agricultural land property to an extent of Ac 1.20 Cents, covered by S.No. 136, situated at Kismathpur village and G.P.Rajendranagar Mandal, R.R. District, A.P., bounded by: East : Land belongs to Smt. G.Sudha Rani, South: Part of land in S.No.136, West: Part of land in S.No.136, North: 40 feet wide road

Given under my hand and seal of this at Visakhapatnam on the 21st December, 2022
(B.N.S.V.S.K. Bangarraju) Recovery Officer-II
Debts Recovery Tribunal, Visakhapatnam

సంపాదకీయం

సెల్యూట్

సైనికుడనే పదం వినగానే ఒళ్లు పులకరిస్తుంది. సైనికుడి యూనిఫాం మనసులో ఒకరకమైన ఉద్వేగాన్ని రగిలిస్తుంది. యుద్ధరంగంలో, మంచుకొండల్లో...ఎముకలు కొరికే చలిలో విధులు నిర్వర్తిస్తూ... దేశానికి కంటికిరెప్పలా కాపలా కాయడం, అవసరమైతే... గుండు కెదురు గుండె నిలపడం పవిత్ర కర్తవ్యంగా భావిస్తాడు సైనికుడు. ఆ తపనతోనే చిన్నతనం నుంచే సైన్యంలో చేరాలని తహతహ లాడాడు. తన లక్ష్యాన్ని సాధించేందుకు తల్లిదండ్రులకు చెప్పకుండానే ప్రయత్నం చేశాడు. చివరకు అందరినీ ఒప్పించి దేశ సేవకు బయల్దేరాడు. ఉగ్రవాదుల కాల్పుల్లో వీరమరణం పొందాడు. దేశ భద్రత కోసం ప్రాణాలను అర్పించిన యువకుడు నిజామాబాద్ జిల్లాకు చెందిన మహేష్. దేశ సేవలో తరించాలని, శత్రుసేనలతో తలపడాలని, తుదిశ్వాసను సరిహద్దుల్లోనే విడవాలని తపించే... తపనపడే మహేష్ లాంటి యువకులు అనేకమంది వున్నారు. 'జననీ జన్మ భూమిశ్చ... స్వర్గాదపీ గరీయసి, స్వర్గాదపీ గరీయసి/ నీ తల్లి మోసేది... నవమాసాలేరా/ ఈ తల్లి మోయాలి... కడవరకురా, కట్టే కాలే వరకురా/ ఆ ఋణం.. తలకొరివితో తీరేనురా/ ఈ ఋణం... ఏ రూపాన తీరేదిరా/ ఆ రూపమే ఈ జవానురా... త్యాగానికి మరో రూపు నువ్వురా' అంటాడో కవి. జవాన్ అంటే రియల్ హీరో... జవాన్ అంటేనే త్యాగానికి మారు పేరు. దేశానికి అన్నం పెట్టేది రైతన్న అయితే, దేశాన్ని కాపాడేది సైనికుడు. అందుకే అన్నారు- జై జవాన్... జై కిసాన్ అని.

'పైన ఎరోప్లేను, చేతిలో స్టెన్‌గన్/ కీ యిస్తే తిరిగే అట్టముక్క సైనికులం/ మార్చ్/ వన్ టూ త్రీ ఘూట్ డెడ్ ఎవడ్' అంటూ వణికించే చలిలో, అరణ్యాలలో, మంచులో ఏ విధంగా నరక యాతన పడతారో, ఇంటి దగ్గర ఉన్న ఆత్మీయులు దూరమై ఎంతగా తల్లడిల్లిపోతారో ఆ ఆవేదననంతా 'సైనికుడి ఉత్తరం' కవితలో చెబుతాడు తిలక్. దేశమంటే భక్తితో... దేశ సేవను మించినది వేరేది లేదని... దేశ రక్షణ కోసం ప్రాణాలకు తెగించి పోరాడతారు సైనికులు. 'నేను సైతం/ ప్రపంచాగ్నికి/ సమిధనొక్కటి/ ఆహుతిచ్చాను/ నేనుసైతం/ ప్రపంచాబ్జపు/ తెల్లరేకై పల్లవిస్తాను' అంటాడు శ్రీశ్రీ. అటువంటి త్యాగధనులను, పోరాట వీరులను కాంట్రాక్ట్ కార్మికులుగా మార్చారు. 'అగ్నిపథ్' పేరుతో పార్టీ ఆఫీస్‌లకు, కార్పొరేట్ కంపెనీలకు వాచ్‌మెన్‌లు, గార్డులుగా, సెలబ్రిటీలకు బౌన్సర్లుగా ఒక కొత్త వ్యవస్థను సృష్టించింది బిజెపి. ఇలాంటి చర్యలు దేశం కోసం... దేశ సేవ కోసం సైన్యంలో చేరాలని తపన పడే యువత కలలను, ఆశలను, ఆకాంక్షలను నిర్దాక్షిణ్యంగా నలిపివేయడమే. సైన్యంలో చేరడం అంటే మామూలు ఉద్యోగం కాదు. దేశసేవకు అంకితమవడం. సైన్యంలో చేరాలనే యువత కలలపై కేంద్రం నీళ్లు చల్లింది. రకరకాల కారణాలతో సైనిక రిక్రూట్‌మెంట్‌ను వాయిదా వేస్తూ వచ్చిన కేంద్రప్రభుత్వం... చివరకు అగ్నిపథ్ అనే కుంపటిని యువత నెత్తిన రుద్దింది. తాను బతికితే... సైనికుడిగానే- అనుకునే యువతకు నాలుగేళ్ల సైనిక ఉద్యోగాలనిచ్చి షాక్ ఇచ్చింది.

దేశభక్తిని, దేశ భద్రతను, దేశ వనరులను అంబానీ, అదానీలకు అప్పగించి... రైతులు, సైనికులను వారి సేవకు వినియోగించే కుట్ర ఇది. 'సరిహద్దులు కాపాడే /యోధులు మీరు/ ప్రాణాలను త్యజిస్తున్న /త్యాగ మూర్తులు మీరు/ ఆకలిని తట్టుకొని / రక్షించే ధీరులు మీరు' అని సైనికుల త్యాగాలను గుర్తుచేస్తారొక కవయిత్రి. ప్రజలంతా అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటోంటే... పాలకులు మాత్రం వారి త్యాగాలతో రాజకీయం చేస్తున్నారు. భావోద్వేగాలను తమ గెలుపునకు వనరుగా మార్చుకుంటున్నారు. ఈ ఒరవడి మారాలి. భారత సైన్యం ఒక పటిష్టమైన వ్యవస్థ. బంగారానికి కిలుము పట్టదు. నిప్పుకు చెదలు పట్టదు. 'దేహంతో వెళ్లిపోదీ కథ/ దేశంలా మిగిలుంటుందిగా/ సమరం ఒడిలో నీ మరణం/ సమయం తలచే సంస్మరణం/ చరితగా చదివే తరములకు/ నువ్వో స్ఫూర్తి సంతకం' అంటాడో కవి. ప్రతియేటా జనవరి 15ను 'జాతీయ సైనిక దినోత్సవం'గా జరుపుకుంటున్నాం. అమరవీరుల త్యాగాలను స్మరించుకునే దినం ఇది. మన సైనికులకు సెల్యూట్ !!

మహనీయుల మాట



నాకొక స్వప్నం ఉంది-ఈ దేశం స్వేచ్ఛా, సమానత్వాల ఆదర్శాలకు నిలయంగా మారుతుందని. నాకొక స్వప్నం ఉంది-బానిసల పిల్లలు, శ్వేత జాతీయుల పిల్లలు సోదర భావంతో కలిసిమెలిసి ఉంటారని. నాకొక స్వప్నం ఉంది-నా నలుగురు పిల్లలు చర్మం రంగుని బట్టి కాకుండా వ్యక్తిత్వాన్ని బట్టి గుర్తించడతారని.

- మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్

న్యాయ వ్యవస్థపై దాడి వెనక కుట్ర

ప్రస్తుతం



తెలకపల్లి రవి

అత్యున్నత న్యాయ వ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తికి వ్యతిరేకంగా ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ నిరంతరం మాట్లాడే తీరు అత్యంత అభ్యంతరకరంగానూ ఆందోళనకరంగానూ తయారైంది. స్వతహాగా సీనియర్ న్యాయవాది అయిన ఆయన ఇవేవీ అమాయకంగానో వ్యక్తిగతంగానో మాట్లాడటం లేదు. దేశంలో రాజ్యాంగం రీత్యా ద్వితీయ స్థాయిలో వున్న ధన్‌కర్ రాజకీయ కోణం పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా వుండి ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రభుత్వానికి ప్రబల శత్రువుగా వ్యవహరించినప్పుడే స్పష్టమైంది. కాకుంటే మమత కూడా తక్కువ తినలేదు గనక పరస్పర ఘర్షణ కింద నడిచిపోయింది. ఇందుకు మెచ్చిన ప్రధాని తనను ఏకంగా ఉపరాష్ట్రపతిని చేశారు. ఇందుకు తగినట్టే ధన్‌కర్ రాజ్యసభ చైర్మన్ బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలి ప్రసంగంలోనే సుప్రీం కోర్టు తీరుపై ధ్వజమెత్తారు. నేషనల్ జ్యుడిషియల్ అపాయింట్‌మెంట్స్ కమిషన్ (ఎన్ జాక్) ఏర్పాటు చేస్తూ ఉభయ సభలు చట్టం చేస్తే సుప్రీంకోర్టు ఎలా కొట్టివేస్తుందని...ఆ స్థానంలో జడ్జిలతో కూడిన కొలీజియం న్యాయమూర్తుల నియామకానికి సిఫార్సులు చేయడం ఏ విధంగా సమంజసమని తీవ్రంగా విమర్శించారు. ఈ విధంగా పార్లమెంటు శాసనాన్ని ఆపేసేట్టయితే ఇది ప్రజాస్వామ్య దేశమెలా అవుతుందని ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలకు ముందు, తర్వాత కూడా న్యాయశాఖామంత్రి కిరణ్ రిజిజు కొలీజియం వ్యవస్థపై దాడిచేస్తూనే వున్నారు. ఆఖరుకు సుప్రీం కోర్టు చిన్నా చితకా కేసులు, బెయిలు కేసులు విచారణ చేస్తూ సమయం వృథా చేయడం వల్లనే కేసులు పేరుకుపోతున్నాయని ఆరోపించారు. ఇందుకు సమాధానంగా సిజెఐ చంద్రచూడ్ మాకు ఏ కేసు ఎక్కువా కాదు, తక్కువా కాదు అని తేల్చిచెప్పారు. ప్రజల ప్రాథమిక హక్కులను, స్వేచ్ఛను కాపాడ్డం కంటే తమకు గొప్ప బాధ్యతలేవీ వుండబోవని స్పష్టం చేశారు. కొలీజియం సిఫార్సులపై ఎడతెగని జాప్యం (సిట్టింగ్ ఓవర్) సమాచారమైనా ఇవ్వకపోవడం ఏమిటని మరో కేసులో సుప్రీం కోర్టు ప్రశ్నించింది. కొలీజియం సిఫార్సులు ఆపడమే గాక కేంద్రం తనుగా పదిమందికి పైన పేర్లను జడ్జిల నియామకం కోసం సిఫార్సు చేసిందని వెల్లడించింది. వీటిపై వ్యాఖ్యానానికి నిరాకరించింది. మరోవైపున కేంద్ర న్యాయవాది కొలీజియం పంపిన పేర్లను తప్పక పరిశీలించి సత్వర నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. కేంద్రం నుంచి వస్తున్న ఒత్తిడిని తట్టుకోవడమే గాక కొంతవరకూ గట్టిగా వ్యవహరించడం వల్లనే ఈ మాత్రం దిగివచ్చారని పరిశీలకులు, న్యాయనిపుణులు అభిప్రాయపడ్డారు.



జగదీప్ ధన్‌కర్ న్యాయవ్యవస్థపై మరో పిడుగు వేశారు. రాష్ట్రాల్లోని చట్టసభల సభాపతుల సమావేశం ప్రారంభోపన్యాసంలో మరోసారి సుప్రీం కోర్టుపై విరుచుకుపడ్డారు. ప్రత్యేకించి రాజ్యాంగ మౌలిక స్వభావానికి సంబంధించిన కేసు తీర్పు స్ఫూర్తికి విరుద్ధంగా మాట్లాడారు. పార్లమెంటు రాజ్యాంగ సవరణలు చేసినా అవి రాజ్యాంగ మౌలిక స్వభావానికి విరుద్ధంగా వుంటే చెల్లవని చెప్పిన కేశవానంద భారతి (1973) తీర్పును వ్యతిరేకించారు. కొన్ని రిజర్వేషన్ సవరణలను, జ్యుడిషియల్ కమిషన్ (ఎన్ జాక్) బిల్లును సుప్రీం కోర్టు ఈ కారణంతోనే కొట్టేసింది. జ్యుడిషియల్ కమిషన్ సవరణ చట్టం బదులు కేంద్రం నియామకాల కమిషన్ చట్టం తెచ్చింది. ఇది విచారణలో వుంది. ఇలాంటి తరుణంలో జగదీప్ ధన్‌కర్ ఇంత తీవ్ర వ్యాఖ్యలు చేయడం యాదృచ్ఛికం కాదు.

రాజ్యాంగ మౌలిక స్వభావం

అయితే ఏదో మెరుగవుతుందనే అంచనాలు వమ్ము చేస్తూ జగదీప్ ధన్‌కర్ న్యాయవ్యవస్థపై మరో పిడుగు వేశారు. రాష్ట్రాల్లోని చట్టసభల సభాపతుల సమావేశం ప్రారంభోపన్యాసంలో మరోసారి సుప్రీం కోర్టుపై విరుచుకుపడ్డారు. ప్రత్యేకించి రాజ్యాంగ మౌలిక స్వభావానికి సంబంధించిన కేసు తీర్పు స్ఫూర్తికి విరుద్ధంగా మాట్లాడారు. పార్లమెంటు రాజ్యాంగ సవరణలు చేసినా అవి రాజ్యాంగ మౌలిక స్వభావానికి విరుద్ధంగా వుంటే చెల్లవని చెప్పిన కేశవానంద భారతి (1973) తీర్పును వ్యతిరేకించారు. కొన్ని రిజర్వేషన్ సవరణలను, జ్యుడిషియల్ కమిషన్ (ఎన్ జాక్) బిల్లును సుప్రీం కోర్టు ఈ కారణంతోనే కొట్టేసింది. జ్యుడిషియల్ కమిషన్ సవరణ చట్టం బదులు కేంద్రం నియామకాల కమిషన్ చట్టం తెచ్చింది. ఇది విచారణలో వుంది. ఇలాంటి తరుణంలో జగదీప్ ధన్‌కర్ ఇంత తీవ్ర వ్యాఖ్యలు చేయడం యాదృచ్ఛికం కాదు. దేశ సార్వభౌమత్వం, ప్రజాస్వామ్యం లౌకికతత్వం, సమాఖ్య తత్వం, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, స్వతంత్ర న్యాయవ్యవస్థ వంటివి రాజ్యాంగ మౌలిక లక్షణాలు. రాజ్యాంగంలో ఉన్న హక్కులు, స్వేచ్ఛలు విస్తరించడం తప్ప విఘాతం కలిగించకూడదనేది మరో సూత్రం. వీటన్నిటికి అడుగడుగునా దెబ్బతీస్తున్న మోడీ ప్రభుత్వానికి ఈ తీర్పు కంటకంగా వుండటంలో ఆశ్చర్యం లేదు. అయితే ఆ మాటలు రాజ్యాంగ పదవుల్లో వున్న వారి ద్వారా, సభాపతుల ద్వారా చెప్పించడం ఒక వ్యూహం.

చట్టసభలు, కార్యనిర్వాహకవర్గం, న్యాయవ్యవస్థ మూడు అంగాలు. వీటిలో దేనికది స్వతంత్ర ప్రతిపత్తి కలిగివుంటుంది. అదే సమయంలో ఎవరైనా రాజ్యాంగ పరిధిలోనే పనిచేయవలసి వుంటుంది. 368వ అధికరణం రాజ్యాంగ సవరణ హక్కు పార్లమెంటుకు ఇస్తుంది. కొన్నిటికి రాష్ట్రాల ఆమోదం కూడా కావాలి. కొన్నిటికి పార్లమెంటు ఉభయసభలు చేస్తే చాలు. ఏది ఏమైనా రాజ్యాంగ పరిధిలో సవరణలుండాలి. 1973లో కేశవానంద భారతి తీర్పు వచ్చినా 1975లో రాజ్యాంగం ద్వారానే ఇందిరాగాంధీ ఎమర్జన్సీ విధించారని మర్చిపోరాదు. ఆ సమయంలో 42వ రాజ్యాంగ సవరణ పేరిట దాన్ని పూర్తిగా మార్చి ఏకపక్ష రాజ్యానికి బాట వేసుకున్నారు. 1977లో దేశ ప్రజలు ఇందిరాగాంధీని ఓడించిన తర్వాత వచ్చిన జనతా ప్రభుత్వం వాటిని మళ్లీ మార్చి ఎమర్జన్సీ విధించే అవకాశాన్ని లేకుండా చేసింది. రాజ్యాంగంలోనే 13వ అధికరణం పౌరుల హక్కులను హరించే సవరణలు చెల్లబోవని చెబుతున్నది. కనుక కేశవానంద భారతి కేసు తీర్పు కన్నా ముందే 13వ అధికరణం కూడా రాజ్యాంగ సవరణపై పరిమితులు విధిస్తున్నది. ఇక స్వతంత్ర న్యాయవ్యవస్థ అనేది కూడా రాజ్యాంగ మౌలిక లక్షణాల్లో ఒకటి. ఎప్పటికప్పుడు సుప్రీం కోర్టు కేంద్ర రాష్ట్రాల చర్యలు రాజ్యాంగ బద్ధమా కాదా అనే పరిశీలన చేసి తీర్పులిస్తున్నాయి. అయోధ్య రామజన్మభూమి వివాదం వంటి వాటిపై వేగంగా తీర్పులు వచ్చాయి. కొన్ని రకాల రిజర్వేషన్లు, కేంద్రం వేసిన పన్నులు, రాష్ట్రాల హక్కులు, 370 రద్దు, మత మార్పిళ్లు, ఎన్నికల బాండ్లు, నదీజలాలు, శబరిమలై, కార్మిక చట్టాల సవరణ, ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణ, జడ్జిల నియామక వ్యవస్థ తదితర అనేక కీలక కేసులు విచారణలోనే వున్నాయి. ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్ రాజధాని విభజన కేసు తీసుకుంటే రాజ్యాంగ పరంగా రాజధాని నిర్ణయం మార్పు వంటి శాసనాలు చేసే అధికారం రాష్ట్రానిదా కేంద్రానిదా ఏవరికీ లేదా, అదైనా ఎన్నిసార్లయినా మార్చుకుంటూ పోవచ్చా వంటి అంశాలను సుప్రీం కోర్టు తేల్చవలసి వుంటుంది. రాజ్యాంగ మౌలిక స్వభావం వీటికి కొలబద్దగా వుంటుంది. అందువల్ల కేశవానంద భారతి కేసు తీర్పును ఉపరాష్ట్రపతి తప్పు పట్టడం అర్థరహితం, అనుమతించరానిది. కానీ చట్టసభల సదస్సు చివరలో ఆమోదించిన తీర్మానంలోనూ అలాంటి అభిప్రాయం వెలిబుచ్చారు. మూడు వ్యవస్థలు దేని పరిధికి అవి పరిమితం కావాలని చెప్పడం సాంకేతికంగా సరైందే గాని ఆ విధంగానైనా న్యాయపరమైన రాజ్యాంగ పరమైన అంశాలు సుప్రీంకోర్టు పరిధిలోకి వస్తాయి. తమ తీర్పులు చట్టాలకు ప్రాతిపదికగా వుంటాయని న్యాయస్థానం ప్రకటించింది.

దేశ సార్వభౌమత్వం, ప్రజాస్వామ్యం లౌకికతత్వం, సమాఖ్య తత్వం, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, స్వతంత్ర న్యాయవ్యవస్థ వంటివి రాజ్యాంగ మౌలిక లక్షణాలు. రాజ్యాంగంలో ఉన్న హక్కులు, స్వేచ్ఛలు విస్తరించడం తప్ప విఘాతం కలిగించకూడదనేది మరో సూత్రం. వీటన్నిటికి అడుగడుగునా దెబ్బతీస్తున్న మోడీ ప్రభుత్వానికి ఈ తీర్పు కంటకంగా వుండటంలో ఆశ్చర్యం లేదు. అయితే ఆ మాటలు రాజ్యాంగ పదవుల్లో వున్న వారి ద్వారా, సభాపతుల ద్వారా చెప్పించడం ఒక వ్యూహం.

గతంలోనే స్పష్టత

రాజ్యాంగంలోని 141వ అధికరణం ప్రకారం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులు అన్ని కోర్టులకూ ఆఖరుకు దానికి కూడా వర్తిస్తాయి. ఎన్‌జాక్ పై కేసు విచారణ సందర్భంగా, జస్టిస్ ఎస్.కె.కౌల్, జస్టిస్ ఎ.ఎస్. ఒకా తో కూడిన ధర్మాసనం ఆ మాటే చెప్పింది. ఆ చట్టం కొట్టివేస్తూ గతంలో ఇచ్చిన కొలీజియం తీర్పు అమలులో వుంటుందనీ, ఒకవేళ దాని స్థానంలో మరో కొత్త శాసనం తెచ్చినా అది కూడా సుప్రీం సమీక్షకు లోబడే వుంటుందని న్యాయమూర్తులు స్పష్టం చేశారు. ఈ విషయం మీ ప్రభుత్వానికి తెలియజేయండని అటార్నీ జనరల్‌ను ఆదేశించారు. అయితే పార్లమెంటు చేసిన చట్టం కూడా సుప్రీం సమీక్షకు లోబడి వుంటుందనే వాదన సరికాదని, ఒక వ్యవస్థపై మరొకటి పైచేయి అనడం చెల్లదని ఆయన వ్యాఖ్యానించారు. పైగా కేశవానంద భారతి కేసు తీర్పుతో తనకు ఆమోదం లేదన్నారు. రాజ్యాంగం లోని 368వ అధికరణం పార్లమెంటుకు సవరణ హక్కు ఇస్తున్నా అది పరిమితులు లేనిది కాదనీ సుప్రీం సమీక్షకు లోబడే వుంటుందని ఇప్పటివరకూ వున్న అభిప్రాయాన్ని తోసిపుచ్చుతున్నారన్నమాట. ఇది కేవలం పరస్పర తనిఖీ కోసం, నియంత్రణ కోసం చేసుకున్న ఏర్పాటు (చెక్స్ అండ్ బాలెన్సెస్) తప్ప ఒక వ్యవస్థ అధికారాలు లాక్కోవడం కోసం కాదని కూడా కేశవానందభారతి కేసు తీర్పు పేర్కొంటున్నది. దీనివల్ల సుప్రీం కోర్టుదే చివరి మాట అవుతుందనుకోవడానికి ఆధారమేమీ లేదని కూడా స్పష్టం చేసింది. ఇదేదో చట్టసభల అధికారంతో తలపడటానికి గాక, వున్న రాజ్యాంగాధికారాలను సవ్యంగా వినియోగించుకోవడంలో సహకరించుకోవడానికేనని 1952 లోనే సిజెఐ పతంజలి శాస్త్రి స్పష్టత ఇచ్చివున్నారు. 2015లో ఎన్‌జాక్‌పై తీర్పులో సిజెఐ జె.ఎస్.ఖేకర్ పునరుద్ఘాటించారు. ముందే చెప్పుకున్నట్టు ఎమర్జన్సీలో 42వ రాజ్యాంగ సవరణ దుర్వినియోగాన్ని అందుకే సరిచేయవలసి వచ్చిందని గుర్తు చేశారు. రాజ్యాంగ సవరణ అధికారం మౌలిక స్వభావానికి లోబడి వుందో లేదో సమీక్షించవలసిన బాధ్యత అందుకే వస్తుందన్నారు. కనుక న్యాయమూర్తుల నియామక ప్రక్రియను ఇప్పటికే కేంద్రం ఎలా ప్రభావితం చేస్తున్నదో తనకు నచ్చనివారిని తొక్కిపట్టడానికీ, కావాలనుకున్న వారిని రుద్దడానికి నానా వ్యూహాలు అనుసరిస్తున్నదో సుప్రీం కోర్టు సాక్షిగానే వెల్లడైంది. అది చాలక ఇప్పుడు నేరుగా ఉపరాష్ట్రపతి కూడా దాడికి దిగడం దారుణం, అప్రజాస్వామికం. ఇటీవలి కాలంలో జస్టిస్ అరుణ్ మిశ్రా, జస్టిస్ రంజన్ గొగోయ్ వంటి వారు నేరుగా ప్రధానిని పొగిడి తరించడం, పదవీ విరమణ తర్వాత కొత్త పదవులు తెచ్చుకోవడం చూస్తున్నాం. సుప్రీంకోర్టు అధికార న్యాయస్థానంగా మారిపోయిందనే విమర్శలూ విన్నాం. దాన్ని కొంతైనా చక్కదిద్దడానికి స్వతంత్రతతో నిలదొక్కుకోవడానికి ప్రయత్నం మొదలవగానే ఏలిన వారు కన్నెర్ర చేస్తున్నారు. అన్ని ప్రతిపక్షాలు దీన్ని ఖండించడం హర్షణీయం. వివిధ వ్యవస్థల మధ్య సమతుల్యత, రాజ్యాంగ బద్ధత వుండాలే గానీ మేము చేసిందే చట్టం అంటే కుదరదు. లౌకికతత్వంపైన, భావప్రకటనా స్వేచ్ఛపైన ప్రాథమిక హక్కులపైనా ఆఖరుకు రాష్ట్ర ప్రభుత్వాలపైన కూడా దాడులు పెరిగిపోతున్న నేటి తరుణంలో ఇది మరీ ముప్పు. వ్యవస్థలకూ వ్యక్తులకూ కూడా సమస్త అధికారాలు రాజ్యాంగం నుంచే వస్తాయి. ఆ స్ఫూర్తికి అనుగుణంగా చట్టాలు వున్నాయా లేదా చూసే బాధ్యత, అధికారం సుప్రీంకోర్టుదే తప్ప రాష్ట్ర మంత్రులు, ప్రధాన మంత్రులది కాదు. ★

మొన్న పెరూ... నిన్న బ్రెజిల్ ...

సామ్రాజ్యవాద కుట్రలు - ప్రతిఘటన!

అంతర్జాతీయం

ఎం. కోటేశ్వరరావు

లాటిన్ అమెరికా లోని రెండు దేశాలు బ్రెజిల్, పెరూ. రెండు చోట్లా ప్రజలు ఎన్నుకున్న వామపక్ష ప్రభుత్వాలను కూల్చివేసేందుకు కుట్ర జరిగింది. పెరూలో మితవాద శక్తులు తమ పథకాన్ని అమలు జరిపారు, బ్రెజిల్‌లో విఫలయత్నం చేశారు. పెరూ వామపక్ష ప్రభుత్వాన్ని కూల్చివేసి పెడ్రో కేస్టిలోను జైలు పాలు చేసినందుకు నిరసనగా డిసెంబరు ఎనిమిది నుంచి జనం వీధుల్లోకి వస్తున్నారు. అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా ఉన్న మచ్చుపిచ్చు విమానాశ్రయాన్ని నిరవధికంగా మూసివేశారు. ఇతర విమానాశ్రయాలదీ దాదాపు అదే స్థితి. రైలు, విమాన సర్వీసులను రద్దు చేశారు. దేశమంతటా 80 రోడ్డు మార్గాలను నిరసనకారులు మూసివేసినట్లు వార్తలు. ఇప్పటి వరకు జరిపిన దమనకాండల్లో 50 మందికి పైగా మరణించారు. ఈ ఉదంతాలలో అవసరమైనదాని కంటె ఎక్కువగా హింస జరిగిందని, దీన్ని మారణకాండగా పరిగణిస్తూ బాధ్యులైన వారిని గుర్తించేందుకు 11 విచారణలు జరపాలని పెరూ అటార్నీ జనరల్ నిర్ణయించారు. దీనిలో తాత్కాలిక అధ్యక్షురాలు దినా బొలార్టే, పలువురు మంత్రులు, అధికారుల పాత్రను విచారిస్తారు. జనవరి 9,10 తేదీలలో పునో ప్రాంతంలో జరిపిన దమనకాండలో 18 మంది మరణించారు.

కేస్టిలో అధ్యక్ష పదవి చేపట్టిన ఏడాదిన్నరకే పార్లమెంటరీ కుట్ర ద్వారా కూల్చివేయగా, లూలాను అధికారం చేపట్టిన ఎనిమిది రోజులకే కూల్చేందుకు అమెరికా అదే తరహా కుట్ర పన్నింది. పెరూలో పెడ్రో కేస్టిలోను గద్దె దింపేందుకు అమెరికా పన్నని కుట్ర లేదు. కేస్టిలో తోపాటు ఉపాధ్యక్షురాలిగా ఎన్నికైన దినా బొలార్టే మితవాదుల మద్దతుతో అధికారాన్ని హస్తగతం చేసుకున్నారు. ఆందోళన మరింత విస్తరించకుండా చూసేందుకు 2026కు బదులు 2024 ఏప్రిల్‌లో (రెండు సంవత్సరాలు ముందుగా) ఎన్నికలు నిర్వహించేందుకు పార్లమెంటును కోరతానని బొలార్టే చేసిన ప్రకటనతో నిరసనలు ఆగలేదు.

కేస్టిలో ప్రజలెన్నుకున్న పార్లమెంటును రద్దు చేసేందుకు పూనుకున్న కారణంగానే దాన్ని కాపాడేందుకు అభిశంసన తీర్మానాన్ని పెట్టి ప్రజాస్వామికంగానే పదవి నుంచి తొలగించామని చెబుతున్నదాన్ని జనం నమ్మటం లేదు. పార్లమెంటుకు అలాంటి అధికారం ఇచ్చిన అక్కడి రాజ్యాంగం అదే పార్లమెంటు అప్రజాస్వామికంగా ఉంటే దాన్ని రద్దు చేసే అధికారాన్ని అధ్యక్షుడికి కూడా కట్టబెట్టింది. తన పాలనకు అడుగడుగునా అడ్డపడుతున్న మితవాదుల ప్రాబల్యం కలిగిన పార్లమెంటును రద్దు చేసేందుకు కేస్టిలో ఆ నిబంధనను ఉపయోగించకుండానే పదవి నుంచి తొలగించారు. పార్లమెంటులోని 130 స్థానాలకు గాను వామపక్ష 'ఫ్రీ పెరూ' పార్టీకి వచ్చిన ఓట్లు 13.41 శాతం కాగా 37 సీట్లు వచ్చాయి.

తాను గెలిస్తే నూతన రాజ్యాంగాన్ని ఆమోదించేందుకు గాను రాజ్యాంగసభ ఏర్పాటు గురించి ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తానని ఎన్నికల్లో కేస్టిలో వాగ్దానం చేశాడు. దాన్ని అడ్డుకొనేందుకు గతేడాది డిసెంబరులో పార్లమెంటులోని మితవాద శక్తులు ఒక తీర్మానాన్ని ఆమోదించాయి. సంస్కరణల కోసం ప్రజాభిప్రాయ సేకరణ జరపాలంటే ముందుగా పార్లమెంటు అనుమతి పొందాలని దానిలో పేర్కొనటం ద్వారా అధ్యక్షపదవి అధికారాలను పరిమితం చేశారు. పార్లమెంటు స్పీకర్ మరియా డెల్ కార్మెన్ అల్వా స్పెయిన్ పర్యటనలో అక్కడి పార్లమెంటులో ప్రసంగిస్తూ "పెరూ కమ్యూనిజం ఆక్రమణకు గురైంది. పెడ్రో కేస్టిలోకు అధ్యక్షుడిగా ఎలాంటి చట్టబద్ధత లేదు" అని ఒక ప్రకటన చేయాలని స్పెయిన్ పాపులర్ పార్టీని కోరటం మితవాదుల కుట్రకు అద్దం పట్టింది.

పెరూ రాజ్యాంగం లోని ఆర్టికల్ 134 ప్రకారం అధ్యక్షుడు లేదా క్యాబినెట్ గానీ రెండు సార్లు విశ్వాస తీర్మానాలను కోరినపుడు తిరస్కరిస్తే పార్లమెంటును రద్దు చేసే అధికారం అధ్యక్షుడికి ఉంటుంది. దాంతో కేస్టిలో ఎక్కడ పార్లమెంటు మీద వేటు వేస్తారోనని ముందుగానే మితవాదులు రంగంలోకి దిగారు. అభిశంసన తీర్మానాన్ని ఆమోదించి కేస్టిలోను గద్దె దించి అరెస్టు చేశారు. కుట్ర పేరుతో విచారణ బూటకానికి తెరలేపారు. ఈ పూర్వరంగంలో కేస్టిలోకు మద్దతుగా, నూతన ప్రభుత్వం గద్దె దిగాలని, తిరిగి ఎన్నికలు జరపాలని కోరుతూ జనం వీధుల్లోకి వచ్చారు. నియంత ఫుజిమోరి ఏర్పాటు చేసిన రాజ్యాంగ పునాదుల మీద అమలు జరుపుతున్న నయా ఉదారవాద ఆర్థిక విధానాలను మార్చేందుకు వీలుగా నూతన రాజ్యాంగాన్ని ఏర్పాటు చేసేందుకు పూనుకోవటం అక్కడి పాలక వర్గాలకు, అమెరికన్ సామ్రాజ్యవాదులకు రుచించలేదు.

కేస్టిలో అధ్యక్ష పదవి చేపట్టిన ఏడాదిన్నరకే పార్లమెంటరీ కుట్ర ద్వారా కూల్చివేయగా, లూలాను అధికారం చేపట్టిన ఎనిమిది రోజులకే కూల్చేందుకు అమెరికా అదే తరహా కుట్ర పన్నింది. పెరూలో పెడ్రో కేస్టిలోను గద్దె దింపేందుకు అమెరికా పన్నని కుట్ర లేదు. కేస్టిలో తోపాటు ఉపాధ్యక్షురాలిగా ఎన్నికైన దినా బొలార్టే మితవాదుల మద్దతుతో అధికారాన్ని హస్తగతం చేసుకున్నారు. ఆందోళన మరింత విస్తరించకుండా చూసేందుకు 2026కు బదులు 2024 ఏప్రిల్‌లో (రెండు సంవత్సరాలు ముందుగా) ఎన్నికలు నిర్వహించేందుకు పార్లమెంటును కోరతానని బొలార్టే చేసిన ప్రకటనతో నిరసనలు ఆగలేదు.

2023 జనవరి ఎనిమిదిన లాటిన్ అమెరికాలో పెద్ద దేశమైన బ్రెజిల్ అధ్యక్ష భవనం, పార్లమెంటు, సుప్రీం కోర్టులపై జైర్ బోల్సనారో అనుచర మూకలు దాడికి తెగబడ్డాయి. అమెరికాలో ట్రంప్ మద్దతుదారులు కూడా జో బైడెన్ ఎన్నికను నిర్ధారించరాదంటూ 2021 జనవరి ఆరున పార్లమెంటు మీద దాడి చేశారు. బ్రెజిల్‌లో లూలా సర్కార్‌ను కూలదోసేందుకు అదే తరహాలో దాడి జరిగింది. బోల్సనారో ఫ్లోరిడా నుంచి ఇందుకు సంబంధించిన కుట్రకు పథక రచన చేశాడు. బ్రెజిల్ అధ్యక్షుడిగా లూలా ప్రమాణ స్వీకారం చేయడానికి ముందు రోజే బోల్సనారో అమెరికాకు పారిపోయాడు.

కుట్రలో బోల్సనారో పాత్ర గురించి విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది. ఎన్నికల్లో అక్రమాలు జరిగినట్లు పునరుద్ఘాటిస్తూ బోల్సనారో జనవరి పదవ తేదీన తన ఫేస్‌బుక్‌లో ఒక వీడియోను పోస్టు చేసి దాడి చేసిన మద్దతుదార్లను సమర్ధించేందుకు పూనుకున్నాడు. అయితే దాన్ని వెంటనే తొలగించాడు. లూలాను సుప్రీంకోర్టు, ఎన్నికల కమిషన్ ఎన్నుకున్నది తప్ప జనం కాదని, ఎలక్ట్రానిక్ ఓటింగ్ అక్రమం అని కూడా దానిలో పేర్కొన్నాడు. దాడిని ప్రోత్సహించిన నేరానికి గాను బోల్సనారో మీద కేసు దాఖలు కోరుతూ 79 మంది ప్రాసిక్యూటర్లు, సహాయ ప్రాసిక్యూటర్లు అటార్నీ జనరల్‌కు లేఖ రాశారు. బోల్సనారో తప్పుడు వార్తలను ప్రచారంలో పెట్టారని, ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా రెచ్చగొట్టేందుకు సామాజిక మాధ్యమ (డిజిటల్) తీవ్రవాదులు వాటిని వ్యాపింపచేసినట్లు పేర్కొన్నారు. జనవరి పదవ తేదీన బోల్సనారో పదకొండు సందేశాలు పోస్టు చేశాడని, చట్టాన్ని ఉల్లంఘించాలని బహిరంగంగా రెచ్చగొట్టాడని కూడా పేర్కొన్నారు. బోల్సనారో వీసాను రద్దు చేసి వెనక్కు పంపాలని అనేక మంది అధికారపక్ష ఎంపీలు జో బైడెన్‌ను డిమాండ్ చేస్తున్నా ఎలాంటి స్పందన లేదు.

తనకు మద్దతు ఇచ్చేదిగా మిలిటరీని మార్చుకోవాలని చూసిన బోల్సనారోకు ఎదురుదెబ్బ తగిలింది. మిలిటరీ, పోలీసు బలగాల్లో మితవాదులు, వామపక్ష వ్యతిరేకులు ఉన్నప్పటికీ ఏకాభిప్రాయం లేదని తాజా పరిణామాలు వెల్లడించాయి. అమెరికా మద్దతుతో 1964 నుంచి 1985 వరకు 21 ఏళ్ల పాటు అక్కడ మిలిటరీ పాలన సాగింది. దాని బాధితులు, వ్యతిరేకంగా పోరాడిన వారు ఇంకా ఎందరో ఉన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మరోసారి సైనిక ఉక్కుపాదాల కింద నలిగేందుకు సిద్ధంగా లేరు.

జనవరి ఎనిమిదిన జరిగిన దాడి తీరుతెన్నులను చూస్తే దుండగులకు కొందరు సహకరించినట్లు అధ్యక్షుడు లూలా చెప్పాడు. అధ్యక్ష భవన తలుపులకు ఎలాంటి నష్టం జరగలేదంటే అక్కడ ఉన్నవారు వాటిని తీసి దుండగుల ప్రవేశానికి సహకరించారని అన్నాడు. మిలిటరీ, పోలీసు యంత్రాంగంలో ఉన్న మితవాద శక్తుల మద్దతు కారణంగానే తాజా దాడి జరిగిందని చెప్పవచ్చు. అధ్యక్ష భవనం, పార్లమెంటు, సుప్రీం కోర్టు మీద దాడికి వచ్చిన వారు ఎనిమిది కిలోమీటర్ల దూరం ప్రయాణించి వచ్చే వరకు నిఘా, భద్రతా దళాలు ఏమి చేశాయన్నది ప్రశ్న. విధుల్లో ఉన్నవారి నుంచి ఆ భవనాల్లో ప్రవేశించిన దుండగులకు ఎలాంటి ప్రతిఘటన లేకపోగా అనుమతించినట్లు కొన్ని వార్తలు వచ్చాయి. దుండగులు మిలిటరీ ప్రధాన కేంద్రం వెలుపలి నుంచే ప్రదర్శనగా వచ్చారని, అప్పుడు ఒక హెలికాప్టర్ ఎగిరిన శబ్దం వినిపించినట్లు, అనేక మంది పోలీసులు ప్రతి చోటా ఉన్నారని, అనేక రోడ్లను మూసివేశారని, తాము లూలాను వదిలించుకొనేందుకే వెళుతున్నట్లు, తమకు బోల్సనారో మద్దతు ఉందని దాడికి వెళ్లిన వారిలోని ఒక మహిళ చెప్పినట్లు లండన్ నుంచి వెలువడే గార్డియన్ విలేకరి కథనం. దుండగులకు బస్సులను సమకూర్చింది ఎవరన్నది కూడా విచారణ జరగనుంది.

వామపక్షాలు, ప్రగతిశీల శక్తులు ఎక్కడ అధికారంలోకి వచ్చినా కార్పొరేట్, సామ్రాజ్యవాద శక్తులు సహించలేవని... లాటిన్ అమెరికా లోనే కాదు...మన దేశంలోను జరుగుతున్న కుట్రలు, కుతంత్రాలు తెలియచేస్తున్నాయి. ★

అనుపల్లిలో పశువుల పండుగ

● పలువురికి స్వల్ప గాయాలు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుపతి జిల్లా రామచంద్రపురం మండలం అనుపల్లి గ్రామంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా పశువుల పండుగ జరిగింది. ఈ పండుగను పోలీసులు అడ్డుకునేందుకు యత్నించగా గ్రామస్తులు, యువత ససేమిరా అనడంతో పండుగను నిర్వహించారు. కోడిగిత్తల కొమ్ములకు వాటి యజమానులు చెక్క పలకలు, బహుమతులు కట్టారు. అనంతరం డప్పుల వాయిద్యాలతో పశువులను పరుగులు తీయించారు. వీటిని పట్టుకునేందుకు యువకులు పోటీపడ్డారు. ఈ క్రమంలో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ పండుగకు వివిధ ప్రాంతాల నుంచి సుమారు ఏడువేల మంది తరలివచ్చినట్లు స్థానికులు తెలిపారు.

బాలసాయి బాబా ట్రస్టు భారీ విరాళం

● కర్నూలు నగర తాగునీటికి రూ.10 కోట్లు

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

కర్నూలు నగర ప్రజల దాహార్తిని తీర్చేందుకు జగన్నాథగట్టుపై నిర్మించే ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణానికి బాలసాయిబాబా ట్రస్టు రూ.పది కోట్లు విరాళం ప్రకటించింది. బాలసాయి బాబా 62వ జన్మదిన వేడుకలను కర్నూలులోని శ్రీనిలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలసాయి బాబా మేనేజింగ్ ట్రస్టీ రామారావు మాట్లాడుతూ.. బాలసాయి బాబా జన్మదిన వేడుకల సందర్భంగా ప్రపంచ శాంతి సదస్సు, దీన జనసేవలో భాగంగా ఓమిని హాస్పిటల్, ఆర్కెహాస్పిటల్, అమ్మ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించామని తెలిపారు. పేదలకు కుట్టుమిషన్లు, ఇస్త్రీ పెట్టెలు, తోపుడుబండ్లు, మిక్సర్ గ్రైండర్స్, వికలాంగులకు ట్రై సైకిళ్ళు అందజేశామన్నారు. నగర మేయర్ బివై.రామయ్య కోరిక మేరకు నగర ప్రజల దాహార్తి తీర్చేందుకు ట్యాంక్ నిర్మాణానికి రూ.పది కోట్లు ఆర్థిక విరాళాన్ని అందించామని తెలిపారు.

స్లమ్స్ తొలగింపు ఉత్తర్వులను నిరసిస్తూ ఆప్ ధర్నా

న్యూఢిల్లీ : స్లమ్స్ తొలగింపు ఉత్తర్వులను నిరసిస్తూ బిజెపి ఢిల్లీ కార్యాలయం వద్ద ఆమ్ ఆద్మీ పార్టీ కార్యకర్తలు శనివారం ధర్నా నిర్వహించారు. దౌలాఖాన్ సమీపంలో గల మురికివాడలను ధ్వంసం చేయాలంటూ పబ్లిక్ వర్క్స్ విభాగం (పిడబ్ల్యుడి) జారీ చేసిన ఆదేశాలను తక్షణమే ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ వారు ధర్నాకు దిగారు. 15 రోజుల్లోగా ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయాలంటూ దౌలాఖాన్ మురికివాడల వాసులకు పిడబ్ల్యుడి గత నెల 29న నోటీసులు జారీ చేసింది. ఎవరి ఇంటినీ కూల్చివేయడానికి తమ పార్టీ అనుమతించబోదని ఆప్ ఎంఎల్‌ఎ సోమ్‌నాథ్ భారతి అన్నారు. బిజెపికి ఏమైంది? ఢిల్లీ ప్రజలకు వ్యతిరేకంగా ఎందుకు వ్యవహరిస్తోందని ప్రశ్నించారు. ఇళ్ల కూల్చివేతకు వ్యతిరేకంగా చేపట్టిన ఆందోళనను పార్లమెంట్ వరకు తీసుకెళతామని మరో ఎంఎల్‌ఎ ఆదిల్ ఆహ్మద్ అన్నారు. మురికివాడల వాసులకు ఇళ్లు కట్టించి ఇస్తామని ఎన్నికల ప్రణాళికలో హామీ ఇచ్చిన బిజెపి ఇప్పుడు వారి ఇళ్లనే కూల్చివేయడానికి చూస్తోందని ఆయన విమర్శించారు.

నెల రోజుల్లో చైనాలో దాదాపు 60వేల కోవిడ్ మరణాలు !

చైనాలో బీజింగ్ : గత నెల రోజుల కాలంలో చైనాలో కోవిడ్ సంబంధిత మరణాలు దాదాపు 60వేలు నమోదయ్యాయని జాతీయ ఆరోగ్య కమిషన్ (ఎన్‌హెచ్‌సి) శనివారం వెల్లడించింది. ఈ మేరకు ఒక నివేదిక విడుదల చేసింది. డబ్ల్యుహెచ్‌ఓ, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా న్యూక్లిక్ యాసిడ్ పరీక్షల్లో పాజిటివ్ వచ్చిన వారి మరణాలనే కోవిడ్ సంబంధిత మరణాలుగా వర్గీకరించాలని చైనా భావించినట్లు ఆ నివేదిక తెలిపింది. డిసెంబరు 8 నుండి జనవరి 12వరకు మధ్య కాలంలో ఈ మరణాలు చోటు చేసుకున్నాయి. కోవిడ్‌తో మరణించిన వారి సగటు వయసు 80ఏళ్ళుగా వుందని ఎన్‌హెచ్‌సి అధికారి జియావో యాహుయి తెలిపారు. మృతి చెందిన వారిలో 90శాతం మంది 65 ఏళ్ళు దాటినవారేనని తెలిపింది. 80ఏళ్లు దాటినవారు 56.5శాతం మంది వున్నారని పేర్కొంది. కోవిడ్ మరణాలను కూడా రెండు కేటగిరీలుగా విభజించారు. కరోనా వైరస్‌తో శ్వాసకోశ వ్యవస్థ విఫలమై మరణించిన వారు 5,503మంది వుండగా, వైరస్‌తో ఇతర అనారోగ్య సమస్యలు కూడా కలిసి మృతి చెందిన వారు 59,938 మంది చనిపోయారని జియావో తెలిపింది. చైనాలో కోవిడ్ మరణాలపై అంతర్జాతీయ సమాజం తీవ్రంగా ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో చైనా ఈ నివేదిక జారీ చేసింది. ఈ వైరస్ వల్ల శీతాకాలంలో వృద్ధులు తీవ్రంగా ప్రభావితమయ్యారని పేర్కొంది. అప్పటికే శ్వాసకోశ సమస్యలతో, ఇతర వ్యాధులతో ఇబ్బందిపడేవారి పరిస్థితి ఈ వైరస్‌తో మరీ అధ్వానంగా తయారైందని, అందువల్లే ప్రస్తుత పరిస్థితి తలెత్తిందని ఆ నివేదిక తెలిపింది.

టెక్ కంపెనీల్లో 30వేల తొలగింపులు

● రెండేళ్లలో రోడ్డునపడ్డ ఉద్యోగులు ● కొత్త నియామకాలపై నీలినీడలు

హైదరాబాద్ : భారత టెక్ కంపెనీల్లో వేల ఉద్యోగాలు ఊడుతున్నాయి. గడిచిన రెండు ఏళ్లలోనే దాదాపు 30,000 మంది పైగా ఉద్యోగులను టెక్ కంపెనీలు తొలగించాయని అంచనా. కరోనా సంక్షోభానికి తోడు ఆర్థిక వ్యవస్థలో మందగమనం నేపథ్యంలో అనేక పెద్ద కంపెనీలు, స్టార్టప్‌లు సిబ్బందిని తొలగించడంతో పాటు కొత్త నియామకాలను స్తంభింపజేశాయి. ఈ విషయాన్ని 2019 నుంచి టెక్ ఉద్యోగుల తొలగింపునపై అధ్యయనం చేస్తున్న ఆన్‌లైన్ వేదిక లేఆఫ్స్.ఎఫ్‌వైఐ ఓ రిపోర్టులో వెల్లడించింది. ఆ వివరాలు.. 2020-2022 మధ్య కాలంలో ఓలా దాదాపు 2600 మంది ఉద్యోగులను తొలగించింది. ఈ క్యాబ్ అగ్రిగేటర్ వేదిక మే 2020లో 1,400 ఉద్యోగాలను లేదా 35 శాతం సిబ్బందికి కోత పెట్టింది. తాజాగా పునర్వ్యవస్థీకరణ పేరుతో మరో 200 మందిని ఇంటికి పంపించింది. ఎడ్‌టెక్ కంపెనీ బైజూస్ గత రెండేళ్లలో 2,500 మందికి ఉద్వాసన పలికింది. ఉత్పత్తి, కంటెంట్, మీడియా, సాంకేతిక బందాల్లోని వారిని ఎక్కువ తొలగించింది. తిరువనంతపురంలోని టెక్నోపార్క్‌లోని తన కార్యాలయాన్ని కంపెనీ మూసివేయగా.. అక్కడి రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని.. బైజూస్ యాజమాన్యంపై ఒత్తిడి తేవడంతో తిరిగి అక్కడి ఉద్యోగులను వెనక్కి తీసుకుంది.

మరో ఎడ్‌టెక్ కంపెనీ వైట్‌హాట్ జెఆర్ కూడా అధిక తొలగింపులు ఉన్న కంపెనీల జాబితాలో ఉంది. 2020-2022 మధ్య కాలంలో ఈ సంస్థ భారత్‌లోని తమ 2,100 ఉద్యోగులను తగ్గించినట్లు ప్రకటించింది. గౌరవ్ ముంజాల్ యొక్క అన్‌కాడెమీ గత రెండేళ్లలో 1,500 మంది ఉద్యోగులను తొలగించింది.



ఫుడ్ డెలివరీ సంస్థ స్విగ్గీ తొలి రౌండ్‌లో 2020లో 1,100 మంది ఉద్యోగులను ఇంటికి పంపించింది. అదే సంవత్సరం జూలైలో రెండో రౌండ్‌లో మరో 350 మంది ఉద్యోగుల తొలగింపునకు పాల్పడింది. గత రెండేళ్లలో ఈ సంఖ్య 2,250కి చేరుకుంది. కరోనా దెబ్బతో ఓయో కంపెనీ 2019 నుంచి భారత్, చైనాలో తమ ఉద్యోగుల తొలగింపు ప్రక్రియను ప్రారంభించింది. గత నెలలో ఒక నివేదికలో కంపెనీ సేల్స్ విభాగంలో 250 మంది ఉద్యోగులను నియమించుకోవాలని పేర్కొన్నప్పటికీ.. మరోవైపు టెక్నాలజీ బృందంలోని 600 మంది ఉద్యోగులను తొలగించాలని యోచిస్తోంది. ఇటీవల అమెజాన్ ప్రపంచ వ్యాప్తంగా సుమారు 18,000 మంది ఉద్యోగులకు ఉద్వాసన పలకనున్నట్లు ప్రకటించింది. ఇందులో చాలా మందే భారత్‌కకు చెందిన వారు ఉన్నారని పలు రిపోర్టు పేర్కొంటున్నాయి. తొలగింపులపై కంపెనీ ఉద్యోగులకు ఇమెయిల్‌లు పంపడం ప్రారంభించినట్లు సమాచారం. ఇంతక్రితం ఈ సంస్థ భారత్‌లో వెయ్యి మంది ఉద్యోగులను పక్కన పెట్టింది. గడిచిన రెండేళ్లలో వేదాంతు, క్యూర్‌ఫిట్, మేక్‌మైట్రిప్, మీషో తదితర టెక్ కంపెనీలు వరుసగా 1,100, 920, 700, 650 చొప్పున ఉద్యోగులను తొలగించాయి. జొమాటో 620 మందిని, ఉబెర్, ఉడాన్‌లు వరుసగా 600, 530 మంది చొప్పున ఉద్యోగులకు ఉద్వాసన పలికాయి.

దిగ్గజాల వెనుకడుగు

బెంగళూరు : దేశంలోని దిగ్గజ టెక్ కంపెనీలు నూతన నియామకాలపై వేచి చూసే దోరణిని అవలంభిస్తున్నాయి. ఎప్పుడూ లేని విధంగా 2022 డిసెంబర్ త్రైమాసికంలో అతి తక్కువ నియామకాలు చేపట్టాయి. గడిచిన ఈ త్రైమాసికంలో టిసిఎస్, విప్రో, ఇన్ఫోసిస్, హెచ్‌సిఎల్ తదితర నాలుగు దిగ్గజ టెక్ కంపెనీలు 5వేల మేర మందిని కొత్తగా తీసుకున్నాయి. ఇంతక్రితం సెప్టెంబర్‌తో ముగిసిన రెండవ త్రైమాసికంలో కొత్తగా 28,836 ఉద్యోగులను నియమించుకున్నాయి. ఇది మొదటి త్రైమాసికంలో ఆ కంపెనీలు జోడించిన దానిలో సగం కావడం గమనార్హం. గడిచిన డిసెంబర్ త్రైమాసికంలో దేశంలో టాప్ ఐటి కంపెనీ టిసిఎస్ కొత్తగా 2,197 మందిని, విప్రో 500 మందిని, ఇన్ఫోసిస్ 1600, హెచ్‌సిఎల్ 2,945 చొప్పున ఉద్యోగులను మాత్రమే తీసుకున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా చోటు చేసుకుంటున్న అనిశ్చితిని దృష్టిలో పెట్టుకుని ఐటి కంపెనీలు నూతన నియామకాల పట్ల వేచి చూసే దోరణిలో ఉన్నాయని ఆ పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.

భోగి సంబరాలలో భాగంగా నృత్యం చేస్తున్న మంత్రి అంబటి

సంక్రాంతి సంబరాల్లో మంత్రి అంబటి డ్యాన్స్

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్ (పల్నాడు జిల్లా)

పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో మంత్రి అంబటి రాంబాబు ఆధ్వర్యాన శనివారం సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం 5 గంటలకే పట్టణంలోని గాంధీ బొమ్మ సెంటర్లో భోగి మంటలు వేశారు. ఈ వేడుకల్లో మంత్రి అంబటి రాంబాబు పాల్గొన్నారు. సంబరాల్లో భాగంగా బంజారా నృత్య కళాకారులతో కలిసి సరదాగా నృత్యం చేశారు. నియోజకవర్గ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భోగి పండుగా ప్రజలందరికీ సకల భోగభాగ్యాలు అందివ్వాలని అన్నారు. చెడును దహించి మంచిని స్వాగతిండమే ఈ పండుగ ప్రాధాన్యత అని వివరించారు. ఈ వేడుకల్లో పార్టీ నాయకులు చల్లంచర్ల సాంబశివరావు, రాయపాటి పురుషోత్తం, మున్సిపల్ ఆఫీస్ చైర్మన్ కోటేశ్వరరావు నాయక్, కౌన్సిలర్ అచ్యుత శివప్రసాద్ పాల్గొన్నారు.

ఢిల్లీ డిప్యూటీ సిఎం నివాసం, కార్యాలయాలపై

సిబిఐ దాడులు

న్యూఢిల్లీ: ఢిల్లీ లిక్కర్ స్కామ్‌కు సంబంధించి ఢిల్లీ సెక్రటేరియట్‌లో సిబిఐ సోదాలు నిర్వహించింది. ఢిల్లీ డిప్యూటీ సిఎం మనీష్ సిసోడియా నివాసం, కార్యాలయాల్లో సిబిఐ సోదాలు చేపట్టింది. గతంలో కూడా మనీష్ ఇంటితోపాటు కార్యాలయాల్లో సిబిఐ తనిఖీలు చేపట్టిన విషయం విధితమే. తన కార్యాలయంలో సిబిఐ దాడులు నిర్వహిస్తోందని ఢిల్లీ ఉపముఖ్యమంత్రి మనీష్ సిసోడియా ట్విట్టర్ వేదికగా వెల్లడించారు. "ఇవాళ మళ్లీ సిబిఐ నా కార్యాలయానికి చేరుకుంది. వారికి స్వాగతం. నా ఇంటిపై దాడి చేశారు, నా కార్యాలయంపై దాడి చేశారు, నా లాకర్‌పై సోదాలు చేశారు. మా గ్రామంలో విచారణ నిర్వహించారు. నాకు వ్యతిరేకంగా ఏమీ కనుగొనబడలేదు. నేను ఏ తప్పు చేయనందున ఏమీ కనుగొనబడలేదు." అని మనీష్ సిసోడియా ట్వీట్‌లో పేర్కొన్నారు. సిసోడియా



కార్యాలయంలో ఎలాంటి దాడులు నిర్వహించలేదని సిబిఐ పేర్కొంది. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా నుంచి విచారణకు అనుమతి లభించిన తర్వాత ఆగస్టులో సిసోడియా నివాసంలో సిబిఐ పలుమార్లు సోదాలు నిర్వహించింది. మద్యం షాపుల లైసెన్సుల కోసం ప్రైవేటు వ్యక్తుల ద్వారా రాజకీయ నేతలకు ముడుపులు అందజేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈ కేసులో ఉప ముఖ్యమంత్రి ప్రధాన నిందితుడిగా ఉన్నారు.

పురూలియా జిల్లాలో డివైఎఫ్ఐ నేత కాల్చివేత

టిఎంసి గూండాల దాష్టీకంపై ఆందోళనలు

కోల్‌కతా : పశ్చిమ బెంగాల్‌లోని పురూలియా జిల్లాలో డివైఎఫ్ఐ నేతను తృణమూల్ గూండాలు కాల్చి చంపారు. పురూలియాలోని బందోన్ పోలీసు స్టేషన్ ఏరియా మకపోలి గ్రామంలో శుక్రవారం సాయంత్రం దుండగులు డివైఎఫ్ఐ నేత కృష్ణపాద్ తుడుపై కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో తీవ్రంగా గాయపడిన కృష్ణపాద్‌ని సిపిఎం కార్యకర్తలు వెంటనే బంకూరా సామిలని మెడికల్ కాలేజీ ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ వెంటనే ఆపరేషన్ చేసినా ఫలితం లేకపోయింది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు ముగ్గురిని అరెస్టు చేశారు. ఈ దుండగులకు తృణమూల్ కాంగ్రెస్ ఆశ్రయం కల్పించిందని సిపిఎం నేతలు విమర్శించారు. ఈ ఘటనపై పురూలియా జిల్లా సిపిఎం నేత మాట్లాడుతూ, శుక్రవారం సాయంత్రం ఏరియా కమిటీ సభ్యుడు కృష్ణపాద తుడు పార్టీ సమావేశం ముగించుకుని ఇంటికి తిరిగివస్తుండగా, మకపోలి మలుపు వద్ద దుండగులు కాల్పులు జరిపారని తెలిపారు. తుడు భుజం, చేతుల్లో మొత్తంగా మూడు బుల్లెట్లు తగిలాయని తెలిపారు. ఈ ఘటనపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. కృష్ణపాద్ పార్టీలో క్రియాశీల కార్యకర్త అని, ఇటీవల ఆ ఏరియాలో సిపిఎం కార్యకలాపాలను

ఆందోళన చేస్తున్న సిపిఎం కార్యకర్తలు

విస్తృతం చేసిన నేపథ్యంలో దారుణంగా హత్య చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

సిపిఎం కార్యకర్తల ఆందోళన

కృష్ణపాద్ తుడును హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ బంద్వాన్ నుంచి గలుడి వెళ్లే రహదారిలో కుచియా జంక్షన్‌ను సిపిఎం కార్యకర్తలు దిగ్బంధించారు. టిఎంసి హత్యా రాజకీయాలను తిప్పికొట్టాలంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నేతలు హెచ్చరించారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో సిపిఎం ఆధ్వర్యాన ఆందోళనలు నిర్వహించారు.

చెన్నైలోని అవిన్ ప్రధాన కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న తమిళనాడు పాల ఉత్పత్తిదారులు

పాల సేకరణ ధర పెంచండి

తమిళనాడు పాల ఉత్పత్తిదారుల ధర్నా

చెన్నై : పశుగ్రాసం ధరలు విపరీతంగా పెరుగుతున్నందున పాల సేకరణ ధరలు పెంచాలని తమిళనాడు పాల ఉత్పత్తిదారుల సమాఖ్య డిమాండ్ చేసింది. గతేడాది నవంబరులో ప్రభుత్వ పాల సహకార సంఘం ఆవిన్ రైతుల నుండి సేకరించే పాలు ధరను లీటరుకు రూ.3 పెంచింది. ఆవుపాల ధరను రూ.35గా, గేదెపాలు ధరను రూ.44గా నిర్ధారించింది. రూ.10పెంచాలని పాల ఉత్పత్తిదారుల సమాఖ్య డిమాండ్ చేస్తోంది. పశువులకు వేసే గ్రాసం ధర 2019 నుండి 50శాతం పెరిగింది. ఇతర నిత్యావసరాల ధరలు కూడా గణనీయంగా పెరిగాయి. ఇలాంటి పరిస్థితుల్లో కేవలం రూ.3 పెంచడం సరికాదని తమిళనాడు పాల ఉత్పత్తిదారుల సమాఖ్య అధ్యక్షుడు మహ్మద్ అలీ అన్నారు. పొరుగున గల కేరళలో పాల సేకరణ ధర ఆవుపాలకు రూ.42గా వుంది. ఇది తమిళనాడు కంటే రూ.7 ఎక్కువ అని అన్నారు. పాల ధరను పెంచాలని డిమాండ్ చేస్తూ చెన్నైలోని అవిన్ ప్రధాన కార్యాలయం వద్ద తమిళనాడు పాల ఉత్పత్తిదారులు ధర్నా నిర్వహించారు. తక్షణమే ప్రభుత్వం సేకరణ ధరను పెంచి, సవరించిన ధరను ప్రకటించాలని కోరారు. పాలల్లో కొవ్వు శాతం తగ్గిందనే పేరుతో సేకరణ ధర రూ.2 లేదా రూ.3 తగ్గిస్తున్నారని అవిన్ ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ తెలిపారు.

సరిహద్దు అంశంపై చైనా, భూటాన్ చర్చలు

బీజింగ్ : చైనా, భూటాన్ మధ్య సరిహద్దు చర్చలను మరింత ముందుకు తీసుకెళ్లడానికి ఇరు దేశాల అధికారుల మధ్య అంగీకారం కుదిరింది. నైరుతి చైనా నగరమైన కన్‌మింగ్‌లో చైనా, భూటాన్ అధికారుల బృందం సరిహద్దు అంశంపై మూడు రోజులుగా జరుపుతున్న చర్చలు శుక్రవారంతో ముగిశాయి. మూడంచెల ప్రణాళికను ముందుకు తీసుకెళ్లడానికి ఇరు దేశాల అధికారుల మధ్య ఏకాభిప్రాయం కుదిరిందని సంయుక్త ప్రకటన పేర్కొంది. సాధ్యమైనంత త్వరలో చైనా-భూటాన్ 25వ దఫా సరిహద్దు చర్చలను నిర్వహించడంపై దౌత్య మార్గాల ద్వారా సంబంధాలను కొనసాగించనున్నామని తెలిపింది.

వెస్ట్‌బ్యాంక్‌లో ఇద్దరు పాలస్తీనియన్ల హత్య

రమల్లా : ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో శనివారం తెల్లవారు జామున ఇజ్రాయిల్ బలగాలు ఇద్దరు పాలస్తీనియన్లను హత్య చేశాయని పాలస్తీనా అధికారులు తెలిపారు. దాదాపు రెండు వారాల ముందు జరిగిన మరో దాడిలో తీవ్రంగా గాయపడిన మరో పాలస్తీనియుడు మరణించాడు. వాహనంపై వెళుతున్న సాయుధులు తమపై కాల్పులు జరపడంతో తమ సైనికులు కూడా ఎదురు కాల్పులు జరిపారని మిలటరీ తెలిపింది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు మరణించిన పాలస్తీనియన్ల సంఖ్య 12కి చేరింది.

జోడోయాత్రలో విషాదం

● గుండెపోటుతో ఎంపీ సంతోఖ్ సింగ్ మృతి

లూధియానా : జోడోయాత్రలో విషాదం చోటు చేసుకుంది. పంజాబ్‌లోని ఫిలింనగర్‌లో శనివారం ఉదయం నిర్వహించిన జోడోయాత్రలో జలంధర్ ఎంపీ సంతోఖ్ సింగ్ చౌదరి (76) పాల్గొని, కొద్దిదూరం నడిచారు. అనంతరం ఒక్కసారిగా గుండెపోటుకు గురై కుప్పకూలిపోయారు. హుటాహుటిన కాంగ్రెస్ కార్యకర్తలు, నేతలు ఆయన్ని ఫగర్వాలోని ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మరణించారు. రాహుల్‌గాంధీ ఆసుపత్రికి చేరుకుని, సంతోఖ్‌సింగ్ కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఈ ఘటనతో జోడోయాత్రను నిలిపివేశారు. సంతోఖ్‌సింగ్ మృతిపట్ల కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్‌గాంధీ, జైరామ్ రమేష్, పంజాబ్ సిఎం భగవంత్‌మాన్ తదితరులు సంతాపం తెలిపారు.

మరో రెండు నెలల్లో కాంగ్రెస్ 'సాత్ సే హాత్ జోడో'

మరో రెండు నెలల్లో 'సాత్ సే హాత్ జోడో' పేరుతో మరో యాత్రను ప్రారంభిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. కాంగ్రెస్ సీనియర్ నేత జైరామ్ రమేష్ మీడియాతో మాట్లాడుతూ రాహుల్‌గాంధీ జోడో యాత్రకు కొనసాగింపుగా సాత్ సే హాత్ జోడో యాత్ర జరుగుతుందని చెప్పారు. ఆ యాత్రలో రాష్ట్ర రాజధానుల్లో మహిళల నేతృత్వంలో పాదయాత్రలు, సమావేశాలు, ర్యాలీ నిర్వహిస్తారు. ఆ తర్వాత రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఇంటింటి ప్రచారం చేస్తారు. జోడో యాత్రలో రాహుల్ తెలుసుకున్న ప్రజా సమస్యలు, బిజెపి వైఫల్యాలపై రెండు కరపత్రాలను జైరామ్ రమేష్ విడుదల చేశారు. ఆ అంశాలపై కాంగ్రెస్ కమిటీలకు రాహుల్‌గాంధీ బహిరంగ లేఖ రాశారు.

యాజమాన్యానికి వ్యతిరేకంగి నిరసన తెలుపుతున్న నాయకులు, కార్మికులు

కొనసాగుతున్న పేపర్‌మిల్లు కార్మికుల దీక్షలు

● అక్రమ రిక్రూట్‌మెంట్ ప్రతుల దహనం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఆంధ్ర పేపర్‌మిల్లు యాజమాన్యం వైఖరిని నిరసిస్తూ, పరంపరం స్కీమ్‌ను రద్దు చేయాలంటూ రాజమహేంద్రవరంలో పేపరుమిల్లు గేటు ఎదుట కార్మిక సంఘాలు చేపట్టిన నిరసన దీక్షలు శనివారం నాటికి మూడో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా పరంపర పేరుతో యాజమాన్యం ఇచ్చిన అక్రమ రిక్రూట్‌మెంట్ ఉత్తర్వులను భోగి మంటల్లో వేసి దహనం చేశారు. మూడో రోజు దీక్షలను సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు, పేపర్ మిల్ యూనియన్ గౌరవాధ్యక్షులు టి.అరుణ్ ప్రారంభించి మాట్లాడారు. మూడు రోజులుగా నిరసన దీక్షలు చేస్తున్నా యాజమాన్యంలో ఎలాంటి స్పందనా లేదన్నారు. యాజమాన్యం వైఖరి ఇలానే ఉంటే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. 20 ఏళ్లుగా మిల్లులో పనిచేస్తున్న సీనియర్ కాంట్రాక్ట్ కార్మికులకు ద్రోహం చేసి బయటి వ్యక్తులకు ఉద్యోగాలు అమ్ముకోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. మిల్లులో యాజమాన్యం కార్మికులపట్ల నిరంకుశంగా వ్యాహరించడం తగదన్నారు. వేతన అగ్రిమెంట్ చేయకుండా కార్మికుల శ్రమను దోచుకుంటున్నారని విమర్శించారు. తక్షణమే ఎన్నికలు నిర్వహించాలని, నూతన వేతన అగ్రిమెంట్ చేయాలని, అర్హులైన సీనియర్లను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల దీక్షలకు మాజీ ఎమ్మెల్సీ, టిడిపి నాయకులు ఆదిరెడ్డి అప్పారావు మద్దతు తెలిపారు. దీక్షల్లో ఎనిమిది కార్మిక సంఘాల నాయకులు, టిడిపి, సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ఎన్‌సిపి ఎంపిపై అనర్హత వేటు

● పదేళ్ల జైలు, జరిమానా

ఢిల్లీ : లక్షద్వీప్ ఎంపి, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి) నేత మహ్మద్ ఫైజల్ లోక్‌సభ సభ్యత్వం రద్దయ్యింది. హత్యాయత్నం కేసులో ఆయనతోపాటు నలుగురిని దోషులుగా నిర్ధారించి, పదేళ్ల జైలు శిక్షతోపాటు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున జరిమానా విధిస్తూ కవరట్టీ సెషన్స్ కోర్టు తీర్పుచెప్పింది. ఈ నేపథ్యంలో ఫైజల్‌పై లోక్‌సభ స్పీకర్ అనర్హత వేటు వేసినట్లు లోక్‌సభ సెక్రటేరియట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 102 (1)(ఇ) ప్రకారం ఈ నెల 11 నుంచి ఈ నిర్ణయం అమల్లోకి వచ్చిందని పేర్కొంది. కేంద్ర మాజీ మంత్రి పిఎం సయీద్ అల్లుడు పదాంత సాలిహ్‌పై మహ్మద్ ఫైజల్‌తోపాటు మరికొందరు మారణాయుధాలతో హత్యాయత్నానికి పాల్పడినట్లు 2009లో కేసు నమోదైంది.

బోల్సనారోను విచారించండి

● బ్రెజిల్ సుప్రీంకోర్టు ఆదేశం

రియో డీ జెనీరో : బ్రెజిల్ రాజధానిలో ఈ నెల 8న అల్లర్లను, హింసను రెచ్చగొట్టడం వెనుక ఎవరున్నారో కనుగొనేందుకు చేపట్టిన విస్తృత దర్యాప్తులో మాజీ అధ్యక్షుడు జేర్ బోల్సనారోను కూడా చేర్చి, విచారణ జరిపేందుకు బ్రెజిల్ అత్యున్నత న్యాయస్థానం పచ్చజెండా వూపింది. లూలా డసిల్వా ఎన్నికల్లో గెలుపొందలేదని సుప్రీం కోర్టు, ఎన్నికల సంస్థ కలిసి ఆయనను అధ్యక్షుడుగా ఎంపిక చేశాయని పేర్కొంటూ అల్లర్లు జరిగిన రెండు రోజుల తర్వాత బోల్సనారో ఫేస్‌బుక్‌లో ఒక వీడియో పోస్ట్ చేశారు. సుప్రీంకోర్టు, పార్లమెంట్, అధ్యక్ష భవనాలపై బోల్సనారో మద్దతుదారులు దాడి చేసి, హింసకు పాల్పడటాన్ని నిరసిస్తూ దేశవ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళనలు జరిగాయి. దీంతో, ఆ తరువాత వీడియోను బోల్సనారో తొలగించారు. బోల్సనారో పోస్ట్ చేసిన ఆ వీడియోను పేర్కొంటూ, అల్లర్లకు సంబంధించి ఆయనను కూడా విచారించాలని ప్రాసిక్యూటర్ జనరల్ కార్యాలయం నుంచి వచ్చిన అభ్యర్థనకు న్యాయమూర్తి అలెగ్జాండర్ డీ మోరెసే తాజాగా ఆమోదముద్ర వేశారు.

బ్రెజిల్ మాజీ మంత్రి అరెస్టు

ఈ నెల 8న దేశ రాజధాని బ్రసీలియాలో జరిగిన అల్లర్లు, విధ్వంస ఘటనల నేపథ్యంలో బ్రెజిల్ మాజీ మంత్రిని శనివారం తెల్లవారు జామున అరెస్టు చేసినట్లు స్థానిక మీడియా తెలిపింది. మాజీ అధ్యక్షుడు బోల్సనారో ప్రభుత్వంలో న్యాయ శాఖ మంత్రిగా పనిచేసిన ఆండర్సన్ టారెస్‌ను ప్రభుత్వ భవనాల కూల్చివేతకు సంబంధించి అరెస్టు చేశారు. అరాచక మూకలతో కుమ్మక్కైనందుకు ఆండర్సన్‌ను అరెస్టు చేయాల్సిందిగా సుప్రీం కోర్టు వారంటు జారీ చేసింది. ఆ నేపథ్యంలో అమెరికా నుండి శనివారం తెల్లవారు జామున స్వదేశానికి చేరిన ఆండర్సన్‌ను బ్రసీలియా విమానాశ్రయంలో అరెస్టు చేశారు.

ఉక్రెయిన్‌కి పశ్చిమ దేశాల సాయం

● రొమేనియాకు నాటో నిఘా విమానం

● ట్యాంక్‌లు, శతఘ్నులు పంపనున్న బ్రిటన్

బ్రస్సెల్స్ : రష్యాపై పోరులో ఉక్రెయిన్‌కు అవసరమైన సైనిక సాయం నాటో మిత్ర దేశాల నుంచి కొనసాగుతోంది. రష్యా మిలటరీ కార్యకలాపాలు పర్యవేక్షించడానికి రొమేనియాకు నిఘా విమానాన్ని పంపించనున్నట్లు నాటో కూటమి శుక్రవారం తెలియచేయగా, మరోవైపు ట్యాంక్‌లు, శతఘ్ని వ్యవస్థలను అందజేస్తామని బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ శనివారం హామీ ఇచ్చారు. ఉక్రెయిన్‌పై రష్యా దాడి మొదలైనప్పటి నుండి ఉక్రెయిన్ సరిహద్దు దేశమైన రొమేనియాలో నాటో తన బలగాలను బలోపేతం చేసింది. "మా అవాక్స్ (గాల్లోనే హెచ్చరికలు జారీ చేయగల, నియంత్రణ వ్యవస్థతో కూడిన విమానాలు) వందలాది కిలోమీటర్ల దూరంలో గల విమానాన్ని కూడా కనిపెట్టగలవు. నాటో నిరోధక, రక్షణ సామర్థ్యానికి ఇవి కీలకమైన రీతిలో దోహదపడతాయి" అని నాటో ప్రతినిధి ఓనా లాంగెస్కూ ఒక ప్రకటనలో తెలిపారు. బుఖారెస్ట్‌కి సమీపంలోని ఒటోపెనికి మంగళవారానికి ఈ విమానాలు చేరతాయి. అక్కడ నాటో బోయింగ్ అవాక్స్ దళంలో భాగమవుతాయి. రొమేనియా నుండి గస్తీకి ఎన్ని అవాక్స్ విమానాలను మోహరిస్తోందో నాటో వెల్లడించలేదు. ఒటొపెనిలో రొమేనియా వైమానిక స్థావరంలో దాదాపు 180మంది సైనిక సిబ్బంది వుంటారు. పలు వారాల పాటు ఈ మిషన్ కొనసాగుతుందని నాటో తెలిపింది.

శనివారం ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో బ్రిటన్ ప్రధాని మాట్లాడారు. అనంతరం ఒక ప్రకటన చేస్తూ, ఛాలెంజర్ 2 ట్యాంక్‌లు, ఇతర శతఘ్ని వ్యవస్థలను కీవ్‌కు అందజేస్తామని హామీ ఇచ్చారు. బ్రిటీష్ ఆర్మీ ఛాలెంజర్ 2 మెయిన్ ట్యాంకులను నాలుగింటిని తూర్పు యూరప్‌కు తక్షణమే పంపుతున్నట్లు బ్రిటీష్ మీడియా తెలిపింది. ఆ తర్వాత మరో ఎనిమిది ట్యాంకులు పంపనున్నట్లు పేర్కొంది.

ప్రభుత్వం దిగొచ్చే వరకూ పోరాటం

పండగ పూటా కొనసాగిన రిలే నిరాహార దీక్ష

ప్రజాశక్తి-పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా)

ప్రభుత్వం దిగి వచ్చే వరకు తమ ఆందోళన విరమించేది లేదని తాము చేస్తున్న పోరాటానికి న్యాయం జరిగే వరకు ఉద్యమాన్ని ఆపేది లేదని ప్రజా సంఘాల ఐక్య వేదిక కన్వీనర్ కూడా రాధాకృష్ణ, కో కన్వీనర్ ప్రభుదాస్ స్పష్టం చేశారు. ఐటీడీఏ వద్ద ప్రజా సంఘాల వేదిక ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం భోగి పండుగ రోజున కూడా కొనసాగాయి. గత రెండు సార్లు జిల్లా గిరిజన సంక్షేమ అధికారులు ప్రజా సంఘాల నాయకులతో వారి డిమాండ్లపై చర్చలు జరిపినప్పటికీ ఫలప్రదం కాక పోవడంతో దీక్షలు కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థుల మరణాలు అరికట్టేందుకు అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గు చేటన్నారు. గిరిజన విద్యార్థులు చనిపోతే ధీమాగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.గిరిజన విద్యార్థుల వరస మరణాలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, ఆశ్రమాల్లో తక్షణమే హెల్త్ అసిస్టెంట్లను నియమించాలని పేర్కొన్నారు. గిరిజన ఆశ్రమ విద్యార్థులు మరణాలు అరికట్టేందుకు శాశ్వత పరిష్కార మార్గం చూపాలని, ప్రజా సంఘాలతో సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

శబరిమలలో మకరజ్యోతి దర్శనం..

తిరువనంతపురం: శబరిమలలో మకరజ్యోతి దర్శనం ఇచ్చింది. పొన్నంబలమేడు నుంచి భక్తులకు మూడుసార్లు మకరజ్యోతి దర్శనమిచ్చింది. మకరజ్యోతిని అయ్యప్ప భక్తులు వీక్షించారు. మకరజ్యోతి దర్శనానికి లక్షలాది మంది అయ్యప్ప భక్తులు తరలివచ్చారు. అయ్యప్ప నామస్మరణతో శబరి గిరులు మార్మోగాయి. ప్రతి ఏడాది జనవరి 14వ తేదీన శబరిమలలో మకరజ్యోతి దర్శనం ఇస్తున్న సంగతి తెలిసిందే. పొన్నంబలమేడు శబరికి 4 కిలోమీటర్ల దూరంలో ఉంది.

జాతీయస్థాయి పోటీలకు పలాస క్రీడాకారుడు

ప్రజాశక్తి - పలాస (శ్రీకాకుళం)

పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల 9వ తరగతి చదువుతున్న బొమ్మాళి సిద్ధార్థ టెన్నికాయిట్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 11, 12 తేదీల్లో అనకాపల్లిలో జరిగిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ పోటీల్లో మూడోస్థానం సాధించి ఈ అర్హతను పొందాడు. ఈ పోటీలో పదోతరగతి విద్యార్థి లండ రాజు బెస్ట్ 8లో స్థానం పొంది, శిక్షణా శిబిరానికి ఎంపికయ్యాడు. పాఠశాల పీడీలు పి.తవిటయ్య, బి.శంకరరావు మెలకువలు నేర్పారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి.తులసీరావు, ఉపాధ్యాయులు అభినందించారు. జాతీయ పోటీలు ఈ నెల 22 నుంచి 26 వరకూ అనకాపల్లిలో జరుగుతాయని తవిటయ్య చెప్పారు. ఈ నెల 16 నుంచి 21 వరకూ పలాస మైదానంలో శిక్షణ శిబిరం జరుగుతుందని పిఇటి తెలిపారు.

బిజెపికి ఎదురులేదనుకుంటే పొరబాటే..

2024లో ప్రాంతీయ పార్టీలే కీలకం : అమర్త్యసేన్

న్యూఢిల్లీ : అధికార బిజెపికి ఎదురులేదని భావించటం పొరబాటని నోబెల్ గ్రహీత, ప్రముఖ ఆర్థికవేత్త అమర్తసేన్ అన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో (2024) ప్రాంతీయ పార్టీలు కీలకపాత్ర పోషిస్తాయన్నారు. శనివారం ఒక వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన దేశంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై తన అభిప్రాయాలను వ్యక్తం చేశారు. "రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రాంతీయ పార్టీలు డిఎంకె, సమాజ్‌వాదీ కీలకంగా వ్యవహరిస్తాయి. బిజెపికి ఎదురునిలిచే పార్టీ లేదనే ఆలోచన సరైంది కాదు. అలాగే కాంగ్రెస్, ఎన్‌సిపి, జెడియు కొత్త పొత్తులకు సిద్ధమవుతున్నాయి. మరోవైపు భారత్ విజన్‌ను అధికార బిజెపి గణనీయంగా తగ్గించింది. ఈ సమయంలో బిజెపికి ప్రత్యామ్నాయం లేకపోతే మంచిది కాదు. ఆ పార్టీకి బలంతోపాటు బలహీనత లున్నాయి. మిగతా పార్టీలు గట్టిగా ప్రయత్నిస్తే...గట్టి పోటీ ఇవ్వొచ్చు" అని అమర్త్యసేన్ అభిప్రాయ పడ్డారు. పార్టీ బలహీన పడిందని కాంగ్రెస్ తనకు తానుగా భావిస్తోం దన్నారు. దీంతో 2024 ఎన్నికల్లో కాంగ్రెస్ విజయంపై ఆయన అనుమానాలు వ్యక్తం చేశారు. అయినప్పటికీ భారత్‌లోని వివిధ వర్గాల విజన్‌ను కాంగ్రెస్ ముందుకుతీసుకెళ్లగలదని అన్నారు.

మైనార్టీల ప్రాధాన్యత తగ్గించేందుకే సిఎఎ

దేశంలో మెజార్టీ వాదాన్ని బలోపేతం చేసేందుకు, మైనార్టీల పాత్రను తగ్గించేందుకు పౌరసత్వ సవరణ చట్టాన్ని (సిఎఎ) మోడీ సర్కార్ తీసుకొచ్చిందని అమర్త్యసేన్ అన్నారు. "సమాజంలోని అన్నివర్గాల ప్రజల కోసం మహాత్మాగాంధీ రాజకీయాల్ని కొనసాగించారు. ఇప్పటివరకూ నేను చూసినదాని ప్రకారం, అధికార బిజెపి లక్ష్యం ఒకటే. సిఎఎ ద్వారా రాజకీయాల్లో మైనార్టీల ప్రాధాన్యతను తగ్గించటం మోడీ సర్కార్ లక్ష్యం. లౌకిక దేశంగా భారత్‌లో ఇలాంటి చట్టం చేయటం దురదృష్టకర"మని అన్నారు.

సందడిగా జాతీయస్థాయి

ఒంగోలు జాతి ఎడ్ల బండలాగుడు పోటీలు

పోటీలను ప్రారంభిస్తున్న సినిమా డైరెక్టర్ వివి వినాయక్

ప్రజాశక్తి - గుడివాడ (కృష్ణా జిల్లా)

కృష్ణాజిల్లా గుడివాడ మండలంలోని లింగవరం గ్రామంలో జరుగుతున్న జాతీయస్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బండలాగుడు ప్రదర్శన పోటీలు మూడోరోజైన శనివారం ఉత్సాహపూరిత వాతావరణంలో కొనసాగాయి. సబ్ జూనియర్స్ విభాగంలో గుంటూరుకు చెందిన సోమిశెట్టి ఆంజనేయులు, పెద్దకాకాని మండలం తక్కెళ్ళపాడుకు చెందిన సయ్యద్ ఖాసిం ఎద్దుల జత 3866.9 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. ప్రకాశం జిల్లా బెస్తవారిపేట మండలం కాజీపురం గ్రామానికి చెందిన ఎంపిపి వేగనాటి ఓసురారెడ్డి ఎద్దుల జత 3758.02 అడుగుల దూరం లాగి ద్వితీయ స్థానంలో నిలిచాయి. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం కుంచనపల్లి గ్రామానికి చెందిన పులగం త్రిషజ్ఞరెడ్డి, జశ్వితరెడ్డిల ఎద్దులు 3664.06 దూరం లాగి తృతీయ స్థానం సాధించాయి. కృష్ణాజిల్లా పెనమలూరు గ్రామానికి చెందిన బావినేని మల్లికార్జునరావు అండ్ బ్రదర్స్, బావినేని ధార్మిక రామ్ చౌదరికి చెందిన ఎద్దులు 3600 అడుగులు దూరం బండను లాగి 4వ స్థానంలోనూ, బాపట్ల జిల్లా బల్లికురవ గ్రామానికి చెందిన పావులూరి వీరస్వామి చౌదరి ఎద్దుల జత 3046 అడుగుల దూరం లాగి ఐదో స్థానంలోనూ, కృష్ణా జిల్లా తోట్లవల్లూరు మండలం కళ్ళంవారిపాలెం గ్రామానికి చెందిన కళ్ళం అనూష రెడ్డి, కళ్ళం మనోజ్ రెడ్డిల ఎద్దుల జత 2801.03 అడుగుల దూరం లాగి 6వ స్థానంలోనూ, పల్నాడు జిల్లా బెల్లంకొండ మండలం పాపయ్యపాలెం గ్రామానికి చెందిన మర్రి అచ్చిరెడ్డి ఎద్దుల జత 2700 అడుగుల దూరం లాగి 7వ స్థానంలోనూ, ప్రకాశం జిల్లా బల్లికురవ మండలం కే రాజుపాలెం గ్రామానికి చెందిన ఏలూరి గణేష్ చౌదరి ఎద్దుల జత 600.10 అడుగుల దూరం బండను లాగి 8వ స్థానంలోనూ నిలిచాయి. ఈ పోటీల్లో పాల్గొన్న వారికి సినీ నిర్మాత వివి వినాయక్ జ్ఞాపికలు అందజేశారు.

20న రాష్ట్ర గవర్నర్ రాక

ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎస్‌పి

ప్రజాశక్తి - పాణ్యం (నంద్యాల)

రాష్ట్ర గవర్నర్ విశ్వ భూషణ్ హరి చందన్ ఈ నెల 20న నంద్యాల జిల్లా పాణ్యం మండలంలోని నెరవాడ గ్రామానికి విచ్చేస్తున్నారు. రాష్ట్ర గవర్నర్ పర్యటన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్, జిల్లా ఎస్‌పి కె.రఘువీర్ రెడ్డిలు శనివారం పరిశీలించారు. సివిల్ వర్క్స్, అప్రోచ్ రోడ్లు, భూమి చదును, షామియానా, భద్రత ఏర్పాట్లు, పోలీస్ అధికారులు, సిబ్బంది తదితర విషయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నెరవాడ గ్రామంలోని సోషియల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ట్రైబల్ స్కూల్‌లో నిర్వహించనున్న బహిరంగ సభ ఏర్పాటుకు సంబంధించి ఏర్పాట్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ రాష్ట్ర గవర్నర్ విశ్వ భూషణ్ హరి చందన్ ఈ నెల 20వ తేదీ పాణ్యం మండలంలోని నెరవాడ గ్రామంలో స్థానిక గిరిజనులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కట్టుదిట్టమైన భద్రతచర్యలు, సభ ప్రాంగణంలో, చుట్టుపక్కల బారికేడ్లు ఏర్పాటు చెయ్యాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి అవాంచనీయ సంఘటలు జరగకుండా గట్టి భద్రత ఏర్పాట్లు చేసి గవర్నర్ పర్యటనను విజయవంతం చెయ్యాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ శ్రీనివాసులు, డిఎస్‌పి మహేశ్వర్ రెడ్డి, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ట్రైబల్ స్కూల్ ప్రిన్సిపాల్, పాణ్యం సిఐ వెంకటేశ్వర రావు, ఎస్‌ఐ సుధాకర్ రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయండి : బుగ్గన

ప్రజాశక్తి - బేతంచెర్ల (నంద్యాల)

బేతంచెర్ల పట్టణ, మండల పరిధిలోని గ్రామాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఆయా శాఖల అధికారులకు ఆదేశించారు. శనివారం బేతంచర్ల నగర పంచాయతీ కార్యాలయంలో ఎంపిపి బుగ్గన నాగభూషణం రెడ్డి, బేతంచర్ల నగర పంచాయతీ చైర్మన్ సిహెచ్ చలం రెడ్డిల ఆధ్వర్యంలో ఆయా శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలోని ఆర్.బుక్కాపురం గ్రామ పరిధిలో రైల్వే డబల్ లైన్ పనులు జరుగుతున్న పరిసర ప్రాంతంలో ఆ గ్రామ ప్రజలకు దారి విషయంపై రైల్వే అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారని మంత్రి దృష్టికి తెచ్చారు. వెంటనే మంత్రి స్పందించి బేతంచెర్ల తహశీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డిని పిలిచి విషయాన్ని త్వరగా పరిష్కరించాలని, ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. కొమ్మూరి కొట్టాల, బలపాల పల్లె, ముసలాయ చెరువు, ముద్దవారం, తలసికొండ, సీతా రాంపురం, రంగాపురం తదితర గ్రామాల సర్పంచులు, సంబంధిత అధికారులతో వారి వారి గ్రామాలలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మద్దిలేటి స్వామి ఆలయ చైర్మన్ రామచంద్రుడు, ఆర్అండ్‌బి ఇంజనీర్ గణేష్, శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపిపి రంగస్వామి, రంగాపురం సర్పంచి గుమ్మగాళ్ల రాజు, గూని నాగేశ్వరరావు, గూని నాగరాజు, తిరుమలేశ్వర్ రెడ్డి, కోడె వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, శేఖరయ్యా, శివయ్య, భాస్కర్, కుమార్ రెడ్డి, ఆదిలక్ష్మి బాయ్, మద్దమ్మ, ఎస్ కాజా హుస్సేన్, సముదాని భాష, తిమ్మయ్య, చిట్టే వేణుగోపాల్ రెడ్డి, సర్పంచి తిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

కేరళ యూనివర్సిటీ చారిత్రక నిర్ణయం..

'మెన్‌స్ట్రేషన్ బెనిఫిట్' సెలవులు...

తిరువనంతపురం : దేశంలో విద్య, వైద్యం, టూరిజం వంటి రంగాల్లో ప్రత్యేకత చాటుకున్న కేరళ.. మరో చరిత్రాత్మక నిర్ణయానికి వేదికగా మారింది. రాష్ట్రంలోని ఒక యూనివర్సిటీ, పీరియడ్స్ సమయంలో విద్యార్థినులు లీవ్ తీసుకునేందుకు ప్రత్యేకంగా 'మెన్‌స్ట్రేషన్ బెనిఫిట్' పేరుతో హాజరు మినహాయింపు ఇస్తున్నట్టు ప్రకటించింది. కేరళలోని కొచ్చిన్ యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఈ మేరకు ప్రకటన చేసింది. ప్రతి సెమిస్టర్‌లోనూ విద్యార్థినులకు మెన్‌స్ట్రేషన్ బెనిఫిట్ కింద హాజరులో రెండు శాతం మినహాయింపు ఇస్తున్నట్టు వెల్లడించింది. యూనివర్సిటీ రూల్ ప్రకారం.. ప్రతి విద్యార్థికీ తప్పనిసరిగా 75శాతం హాజరు ఉండాలి. పరీక్షలకు హాజరు కావాలంటే ప్రతి సెమిస్టర్‌లో ఈ హాజరు శాతం తప్పనిసరి. అటెండెన్స్ పర్సంటేజ్ తక్కువగా ఉన్న సందర్భంలో, మహిళా విద్యార్థినులకు మెన్‌స్ట్రేషన్ బెనిఫిట్‌ను క్లెయిమ్ చేసుకోవచ్చు. అంటే వీరికి మినిమం అటెండెన్స్ పర్సంటేజ్ 73 శాతానికి తగ్గినా ఫర్వాలేదు. ఈ విషయంపై యూనివర్సిటీ జాయింట్ రిజిస్ట్రార్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. 'ఫిమేల్ స్టూడెంట్స్‌కు మెన్‌స్ట్రేషన్ బెనిఫిట్స్ కావాలనే అభ్యర్థనలను వైస్-ఛాన్సలర్ పరిగణనలోకి తీసుకున్నారు. ప్రతి సెమిస్టర్‌లో మహిళా విద్యార్థులకు హాజరు మినహాయింపు 2 శాతం మంజూరు చేయాలని ఆదేశించారు. అకడమిక్ కౌన్సిల్ ఆదేశాలకు లోబడి ఈ రూల్ వర్తిస్తుంది.' అని ఆర్డర్‌లో పేర్కొన్నారు.

ఢిల్లీలో పడిపోతున్న గాలి నాణ్యత...

పెరుగుతున్న కాలుష్యం

న్యూఢిల్లీ : ఢిల్లీలో వాయుకాలుష్యం పెరుగుతూనే ఉంది. దేశరాజధానిలో గాలి నాణ్యత తీవ్రస్థాయిలో పడిపోతున్నట్టు వాతావరణశాఖ వెల్లడించింది. తాజాగా ఢిల్లీలో శనివారం ఉదయం ఎయిర్ ఇండెక్స్ క్వాలిటీ (ఎక్యూఐ) 337గా నమోదైందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. ఇక సిస్టమ్ ఆఫ్ ఎయిర్ క్వాలిటీ అండ్ వెదర్ ఫోర్‌కాస్టింగ్ అండ్ రీసెర్చ్ (ఎస్ఎఎఫ్ఎఆర్) సమాచారం ప్రకారం ఢిల్లీ యూనివర్సిటీ ప్రాంతంలో 357, పూసా టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్‌లో 329, ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో 326గా ఎక్యూఐ నమోదయ్యాయి. ఢిల్లీ ఐఐటి చుట్టుపక్కల ప్రాంతంలో 337, మధుర రోడ్‌లో 349, లోధి రోడ్ ప్రాంతంలో 327గా ఏక్యూఐ నమోదయ్యాయి. ప్రస్తుతం ఢిల్లీలో శనివారం ఉదయం 11.6 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైనట్టు వాతావరణశాఖ వెల్లడించింది. దీంతో అక్కడ చలిగాలులు వీస్తున్నట్టు ఐఎండి పేర్కొంది. రాబోయే రెండు రోజులు 15, 16 తేదీల్లో వాయువ్య భారతదేశంలో చలిగాలులు తీవ్రంగా వీచే అవకాశముందని, మరోసారి గరిష్టస్థాయికి ఉష్ణోగ్రతలు పడిపోయే అవకాశముందని వాతావరణశాఖ వెల్లడించింది. జనవరి 15న పంజాబ్, చండీగఢ్, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, బీహార్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీలోని కొన్ని ప్రాంతాల్లో దట్టమైన పొగమంచు కురిసే అవకాశముందని ఐఎండి అంచనా వేసింది.

అరసవల్లిని సందర్శించిన హైకోర్టు జడ్జి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి తర్లాడ రాజశేఖరరావు శనివారం దర్శించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ ఆయన ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి సేవల అనంతరం ఆలయ ప్రాంగణంలో ఆలయ ఇన్‌ఛార్జి ఎస్ఇ కె.వెంకటేశ్వరరావు స్వామి వారి చిత్రపటాన్ని ఆయనకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా, ప్రోటోకాల్ జడ్జి కె.రాణి, తహశీల్దార్ వెంకటరావు, ఆలయ జూనియర్ అసిస్టెంట్ బి.ఎస్ చక్రవర్తి, పోలీస్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

సమాజంలో మార్పే లక్ష్యం

డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు వై.రాము

ప్రజాశక్తి-ఆకివీడు (పశ్చిమగోదావరి జిల్లా)

సమాజంలో మార్పే తమ లక్ష్యమని, ఆ లక్ష్య సాధన కోసం తాము కృషి చేస్తున్నామని డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు వై.రాము అన్నారు. సంక్రాంతి యువజనోత్సవాల్లో భాగంగా డివైఎఫ్ఐ ఆధ్వర్యాన ఆకివీడులో నిర్వహిస్తున్న క్రీడా పోటీలను శనివారం ఆయన ప్రారంభించారు. తొలుత ఆయన సంఘ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం యువజనోత్సవాల ఆహ్వాన సంఘం అధ్యక్షులు ఎమ్‌డి. మదని అధ్యక్షతన జరిగిన సభలో రాము మాట్లాడుతూ సమాజంలో దురాచారాలను రూపుమాపి మంచి సమాజాన్ని నిర్మించాలన్నదే తమ ఆశయమన్నారు. దానిలో భాగంగానే పండుగ సందర్భంగా యువత దుర్వ్యసనాల బారిన పడకుండా ఉండేలా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామనాన్రు. చాలాకాలం గా ఈ పోటీల విజయవంతానికి చాలామంది నిర్విరామంగా కృషి చేస్తున్నారని అభినందించారు. ప్రస్తుతం యువత డ్రగ్స్ కబంధ హస్తాల్లో చిక్కుకుందని, వాటి నుండి విముక్తి చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. 'డ్రగ్స్ అంతం- డివైఎఫ్ఐ పంతం' అనేది తమ నినాదమన్నారు. ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షులు డాక్టర్ పిబి.ప్రతాప్‌కుమార్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. మరో ముఖ్యఅతిథి విని యోగదారుల సమాఖ్య జిల్లా అధ్యక్షులు బొబ్బిలి బంగారాయ్య మాట్లాడుతూ డివైఎఫ్ఐ 40 సంవత్సరాలుగా చేస్తున్న కృషిని అభినందించారు. సమావేశంలో బి. సత్యనారాయణ, బి.రాంబాబు, జి. ధనుష్, క్రీడాపోటీల కన్వీనర్ డోకల రవితేజ మాట్లాడారు.

వీడని ప్లాస్టిక్

- విచ్చలవిడిగా వినియోగం
- ప్రమాదంలో ప్రజారోగ్యం..!
- పర్యావరణంపై తీవ్ర ప్రభావం
- నిషేధం అమల్లో ఉన్నా చోద్యం చూస్తున్న యంత్రాంగం

ప్రజాశక్తి-హిందూపురం (సత్యసాయి జిల్లా)

ప్లాస్టిక్ వినియోగం ఆరోగ్యానికి ప్రమాదకరమని, వాతావరణంపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిసినా దాని వినియోగం మాత్రం తగ్గడం లేదు. 50 మైక్రాన్స్ కన్నా తక్కువ ఉన్న ప్లాస్టిక్ వినియోగాన్ని ప్రభుత్వం పూర్తిగా నిషేధించింది. దీనిని పక్కాగా అమలు చేయాల్సిన అధికార యంత్రాంగం నిర్లక్ష్యం కారణంగా పట్టణ వీధులు, మురుగకాలువలు ప్లాస్టిక్ కూపాలుగా మారుతున్నాయి. రోగాలు పెంచుతున్నాయి. ప్లాస్టిక్‌ను భూమిలో వేస్తే నేల కలుషితమవుతోంది. కాలిస్తే విషవాయువులు వాతావరణంలో కలిసి పర్యావరణం దెబ్బతింటోంది. జీవ మనుగడపై దుష్ప్రభావం కలిగించే ప్లాస్టిక్ నిషేధంలో నగర, పురపాలక సంస్థలు వైఫల్యం చెందాయనే ఆరోపణలు విన్పిస్తున్నాయి.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో అనంతపురం కార్పోరేషన్‌తో పాటు హిందూపురం, పుట్టపర్తి, ధర్మవరం, మడకశిర, పెనుకొండ, రాయదుర్గం, తాడిపత్రి, గుంతకల్లు, గుత్తి, కళ్యాణదుర్గం, మున్సిపాలిటీలలో ప్లాస్టిక్ నిషేధం అమలులో ఉంది. ఈ పట్టణాల్లో దాదాపు 10.45 లక్షల జనాభా ఉంది. రోజూ 422 టన్నుల చెత్త సేకరిస్తున్నారు. ఈ చెత్తలో సుమారుగా 68 టన్నులు ప్లాస్టిక్ వ్యర్థాలు ఉన్నాయని అధికారులే తెలిపారు. అంటే నెలకు 1,845 టన్నులు, ఏడాదికి సరాసరి 22 వేల టన్నులకు పైగా ప్లాస్టిక్ వినియోగిస్తున్నట్లు స్పష్టమవుతోంది. గ్రామాల్లో వినియోగం సరేసరి. సుప్రీంకోర్టు తీర్పుమేరకు 50 మైక్రాన్ల కంటే తక్కువ ఉన్న ప్లాస్టిక్ వినియోగిస్తే పురపాలక శాఖ అధికారులు దాడులు చేసి జరినామా వేయవచ్చు. రూ.500 నుంచి రూ.5 వేలకుపైగా అపరాధ రుసుం విధించవచ్చని అధికారులే చెబుతున్నారు. అయినా దాడులు నామమాత్రంగానే జరుగుతున్నాయి.

సచివాలయ వ్యవస్థ ఉన్నా నిర్లక్ష్యమే

ఉమ్మడి అనంతపురం జిల్లాలో అన్ని పురపాలక సంఘాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో అన్ని సచివాయాల్లో పర్యావరణానికి ప్రత్యేక కార్యదర్శిని ప్రభుత్వం నియమించినప్పటికీ ప్లాస్టిక్ నిషేధం పూర్తి స్థాయిలో అమలు కావాడం లేదు. అక్కడక్కడ పురపాలక సంఘాల్లో సచివాలయ పర్యావరణ కార్యదర్శులు బృందంగా ఏర్పడి దాడులు నిర్వహించి, ప్లాస్టిక్‌ను పట్టుకున్నప్పటికీ వారికి విధించే జరిమానాలు తక్కువ ఉండడంతో వ్యాపారులు ప్లాస్టిక్ నిషేధాన్ని పాటించడం లేదు. నిషేధాన్ని కఠినంగా అమలు చేయడంలో పర్యావరణ కార్యదర్శులు నిర్లక్ష్యం విడిచి దాడులు నిర్వహిస్తే తప్పా పూర్తి స్థాయిలో ప్లాస్టిక్ నిషేధం అమలు కాని పరిస్థితి కన్పిస్తోంది.

ఎక్కడపడితే అక్కడ ప్లాస్టిక్...

ప్లాస్టిక్ వ్యర్థాలు ఎక్కడపడితే అక్కడ పారేస్తున్నారు. మురుగు కాల్వల్లో వేయడం వల్ల కాలువలకు అడ్డంపడి మురుగు రోడ్లపైకి చేరుతోంది. కల్వర్టులకు అడ్డంగా చేరి వర్షం వస్తే రోడ్లు చెరువుల్లా మారుతున్నాయి. దుకాణదారులు డ్రెయినేజీలపై బండలు వేయడంతో వాటి కింద ప్లాస్టిక్ ఇరుక్కుపోయి పారిశుధ్య సమస్యలు తలెత్తుతున్నాయి. 50 మైక్రాన్ల లోపు ప్లాస్టిక్ వినియోగం నిషేధం ఉన్నా.. అమలు చేయడంలో పురపాలక యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే ఆరోపణలున్నాయి. ప్లాస్టిక్ వాడకం వల్ల భూతాపం పెరుగుతుందని పలు అధ్యయనాలు నిగ్గుతేల్చాయి. ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల్లోని ఆహార పదార్థాలు తినడం వల్ల ప్రమాదకరమైన 'కార్సినోజన్లు' శరీరంలో చేరి క్యాన్సర్‌కు దారితీస్తుందని వైద్యులు చెబుతున్నారు. ఇంతటి నష్టాన్ని చేకూర్చే ప్లాస్టిక్ వినియోగించకుండా ఉండేలా ప్రజల్లో అధికారులు చైతన్యం తీసుకురావాల్సి ఉందని పలువురు సూచిస్తున్నారు.

మళ్లీ ఏనుగులొచ్చాయ్..

ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి - జియ్యమ్మవలస (పార్వతీపురం మన్యం)

రెండు నెలలుగా ఏనుగుల అలజడుల నుంచి ఇప్పుడిప్పుడే ఊపిరి పీల్చుకుంటున్న మండల వాసులకు హఠాత్తుగా మళ్లీ ఏనుగుల గుంపు వచ్చి పడడంతో రైతులు ఒక్కసారి ఉలిక్కిపడ్డారు. ఏనుగుల గుంపు శుక్రవారం రాత్రి మండలంలోని చింతల బెలగాం, రాజయ్యపేట మధ్య సంచరించాయి. రాత్రి 12, ఒంటి మధ్య ఒంటరి ఏనుగు రాజీపేటకు చేరుకొని హల్‌చల్ చేసింది. దీంతో గ్రామస్తులు భయాందోళన చెందారు.

అరటి, పామాయిల్, చెరకు తోటలు ఈ ప్రాంతంలో ఉండడంతో ఏనుగులు తమ పంటలు నాశనం చేస్తాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత రెండు నెలలుగా ఊపిరి పీల్చుకున్న రైతాంగానికి ఏనుగులు గుంపు వచ్చి భయపెడుతున్నాయి. ఏనుగులు బెడద ఎప్పుడు తప్పుతుందా అని రైతులు ఆందోళన చెందుతున్నారు.

సెమీస్‌లో సాత్విక్ జోడీకి నిరాశ

మలేషియా ఓపెన్‌లో ముగిసిన భారత్ పోరు

కౌలాలంపూర్: మలేషియా ఓపెన్ సూపర్-1000 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత్ పోరాటం ముగిసింది. పురుషుల సింగిల్స్‌లో ఒక్కరు మినహా మిగతా వారంతా తొలిరౌండ్‌లోనే నిష్క్రమించగా.. పురుషుల డబుల్స్ సెమీస్‌కు చేరి ఆశలు రేపిన చిరాగ్ శెట్టి-సాత్విక్ సాయిరాజ్ జోడీ ఓటమిపాలయ్యారు. శనివారం జరిగిన డబుల్స్‌లో భారత జోడీ 16-21, 21-11, 15-21తో చైనాకు చెందిన లియాంగ్-వాంగ్‌ల చేతిలో పోరాడి ఓడారు. తొలి గేమ్‌ను ఓడినా.. రెండో గేమ్‌లో పుంజుకొని ఆ గేమ్‌ను గెలుచుకున్నారు. నిర్ణయాత్మక మూడో గేమ్‌లోనూ పోరాడినా 15-21తో ఓడి టోర్నీనుంచి నిష్క్రమించారు. పురుషుల సింగిల్స్‌లో హెచ్ఎస్ ప్రణయ్ రాయ్ క్వార్టర్‌ఫైనల్లో ఓడగా.. మహిళల డబుల్స్‌లో త్రీషా-గాయత్రి గోపీచంద్ జోడీ ప్రిక్వార్టర్స్‌కు చేరడమే గొప్ప ప్రదర్శన. మరో సెమీస్‌లో మలేషియాకు చెందిన ఆర్డియాంటో-అల్ఫియన్ జోడీ 21-17, 21-17తో కొరియా జోడీపై నెగ్గి ఫైనల్లోకి దూసుకెళ్లారు.

ఇక పురుషుల సింగిల్స్ ఫైనల్లోకి అక్సెల్సన్(డెన్మార్క్), నర్రాకో(జపాన్) దూసుకెళ్లారు. సెమీస్‌లో అక్సెల్సన్ 21-7, 21-15తో సునేయమా(జపాన్)పై, నర్రాకో 21-17, 19-21, 21-17తో విటిడ్‌స్యామ్(థాయ్‌లాండ్)పై విజయం సాధించారు. ఇక మహిళల సింగిల్స్ ఫైనల్లోకి యమగుచి(జపాన్), సన్-యన్-అన్(కొరియా) దూసుకెళ్లారు. సెమీస్‌లో యమగుచి 21-18, 21-16తో తైజు-యింగ్(తైపీ)పై, సన్ 21-12, 19-21, 21-9తో చెన్-యుఫీ(చైనా)పై గెలిచారు.

క్లీన్‌స్వీప్‌పై దృష్టి

శ్రీలంకతో చివరి, మూడో వన్డే నేడు

మధ్యాహ్నం 1.30గం॥ల నుంచి

తిరువనంతపురం: తొలి రెండు వన్డేలను గెలిచిన టీమిండియా వన్డే సిరీస్‌ను ఇప్పటికే చేజిక్కించుకోగా.. ఇక క్లీన్‌స్వీప్‌పై దృష్టి సారించింది. కోల్‌కత్తా వేదికగా రెండో టివన్డేలో వైస్ కెప్టెన్ కేఎల్ రాహుల్ అర్ధసెంచరీతో రాణించి మ్యాచ్‌ను ముగించాడు. తొలుత కుల్దీప్ స్పిన్ మాయాజాలానికి శ్రీలంక జట్టు భారీస్కోర్ చేయలేకపోయింది. దీంతో టీమిండియా ప్రయోగాలకు అవకాశమిచ్చే అవకాశం లేదు. మరోవైపు శ్రీలంక జట్టు స్వదేశంలో న్యూజిలాండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌ను గెలిచి 2023 వన్డే ప్రపంచకప్‌కు అర్హత సాధించేందుకు మెట్టు దూరంలో ఉంది. చివరి వన్డేలోనైనా గెలిస్తే నేరుగా ప్రపంచకప్‌కు అర్హత సాధిస్తుంది. ఈసారి వన్డే ప్రపంచకప్‌లో ఆడే దేశాల సంఖ్య పెరగడంతో 12 ర్యాంక్‌ల్లోపు ఉన్నట్లు నేరుగా అర్హత సాధిస్తాయి. దీంతో ఇరుజట్ల మధ్య జరిగే ఆఖరి వన్డేకు ప్రాధాన్యత సంతరించుకుంది.

చిన్నారి



మూడు రోజుల సందడి

మూడు రోజుల పండగ సంబరాలు
పల్లెలన్నీ ఆనందాల అంబరాలు
పొగమంచు కురిసే చిరుజల్లులు
వాకిళ్ళ ముందు రంగవల్లులు !

నేలతల్లి ఇచ్చే పసిడి పంటలు
మనతల్లి చేసే పిండి వంటలు
గొబ్బెమ్మలతో అలంకారాలు
పిల్లా పాపలతో సంబరాలు !

భోగి మంటల భోగభాగ్యాలు
నవ వసంతాల సౌభాగ్యాలు
బొమ్మల కొలువుల వేడుకలు
దేవ దేవుళ్ళను కోరే కోరికలు !

గంగిరెద్దులు ఆడే ఆటలు
నింగిలో ఎగిరే గాలిపటాలు
కోడి పందేల కోలాహాలు
తీపి కారాల ఫలహారాలు !

అనుబంధాలతో ఊరు వాడలు
తియ తియ్యని చెఱకు గడలు

హరిదాసులు పాడే గీతాలు
కొత్త బట్టల్లో నిండు ఉత్సాహలు !

పాడి పశువులకు ప్రత్యేక పూజలు
పంట పొలాలకు హారతులు
కర్షకుల కళ్ళల్లో కాంతులు
పల్లెలన్నీ పచ్చని పూబంతులు !

భూమాత భోగాలిచ్చే భోగి పండుగ!
సిరుల ధాన్యాలిచ్చే సంక్రాంతి రైతు పండుగ !
కడవరకు కలిపి నిలిపేది
కమనీయ కనుమ పండుగ !

- బోనగిరి పాండు రంగ
తొర్రూరు

మంచి మార్పు కావాలి

ఉరుకుల పరుగుల బాల్యం
చదువుల ఛత్రంలో బందీ
అయిన వైనం
బండెడు పుస్తకాల భయం
ఆటల పాటలకు దూరం

బట్టీ పట్టే చదువుల తత్వం
మార్పులు,ర్యాంకులకై గమ్యం
పిల్లలలో సృజనాత్మక స్వేచ్ఛ
లోపం

నైపుణ్యం శూన్యం..
సమాజ ప్రగతికి అవరోధం..

సినిమా, టీవీ, సెల్ ఫోన్
ప్రభావం
పిల్లల మనసులో చెడు సంస్కృ
తికి బీజం
కాలక్షేప వలయంలో భావి తరం
ప్రశ్నార్థకమే కదా, భవితవ్యం!

స్వేచ్ఛకు అర్థం తెలియని కూనలు
స్వచ్ఛమైన నవ్వుల బాలలు
ఏమీ ఎరగని పువ్వులు
రివ్వున ఎగిరే తూనీగలు..

ప్రగతిశీల మార్పు అవసరం
సన్నద్ధం కావాలి అందరం
రేపటి భవితవ్యం కోసం
శాస్త్రీయ విద్యా విధానం తక్షణ
కర్తవ్యం!

- ఎస్. కె. బాజీ సైదా
88972 82981

నేను గీసిన బొమ్మ

జి. కీర్తిప్రియ,
6వ తరగతి,
ఇంగ్లీష్ మీడియం,
జడ్పిహెచ్ఎస్ హవేలీ,
ఘనాపూర్,
మెదక్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

అనుబంధాల పండగ సంక్రాంతి

ఆరుగాలం చేసిన శ్రమ ఫలించి
ఫలసాయం ఇంటికొస్తే...
ఆనందమే ఆనందం!
గూడు వదిలి వెళ్లిన పిల్లలు-
పిల్లాపాపలతో వచ్చి వాలితే...
సందడే సందడి!
చిన్ననాటి స్నేహితులూ, సరదాలూ
ఏకమై ఏరువాకలా సాగితే...
సంబరమే సంబరం!
ఆ ఆనందం, సందడి, సంబరం
ఒకేసారి సాకారమైతే...
అది సంబరాల సంక్రాంతి!

సంక్రాంతి పెద్ద పండగ. దాదాపు నెలరోజులపాటు సంబరాలకు సన్నద్ధమయ్యే పండగ. ఎక్కడెక్కడో ఉన్న అందరినీ ఏకం చేసే పండగ. అత్తారిళ్లకు వెళ్లిన ఆడపిల్లలను, చదువులకో, బతుకుతెరువుకో బహుదూరం తరలిపోయిన మగపిల్లలను ఆత్మీయంగా ఆహ్వానించే పండగ. సంక్రాంతిని తలచుకోగానే మనసు సంబరంతో ఉరకలేస్తోంది. ఎన్నో జ్ఞాపకాలను తెరలుతెరలుగా గుబాళిస్తోంది.

సంక్రాంతి రావడమే గొప్ప ఆహ్లాదకర వాతావరణంలో వస్తోంది. నులివెచ్చని చలి గిలిగింతలు పెడుతుంటే– వెండితెరల పొగమంచు ఎన్నో వర్ణ దృశ్యాలను ఆవిష్కరిస్తూ ఉంటుంది. చల్లని మంచు బిందువులు పూలబుగ్గలపై మంచిముత్యాల్లా మెరుస్తుంటాయి. అప్పుడే ఉదయించిన సూరీడి అరుణ కిరణాలు ఆ జలముత్యాలకు పసిడికాంతులను ప్రసాదిస్తాయి. ఆమూలన వారంరోజుల క్రితమే ఈనిన ఆవు అంబా అని మోరెత్తి పిలుస్తోంది. తల్లి పొదుగును కుడవడానికి లేగదూడ ఆరాటంతో గెంతులేస్తోంది. ఊరంతా ఆటలతో పాటలతో, నవ్వుల తుళ్లింతలతో కళకళలాడుతోంది. ధనుర్మాసం ప్రారంభం నుంచీ పండగ వాతావరణం నెలకొంటుంది. నెలగంట మోగిన నాటినుంచి వాకిళ్లముగ్గులతో ముస్తాబవుతాయి. రథాల ముగ్గులూ, రతనాల ముగ్గులూ ఎప్పటికప్పుడు సరికొత్తగా సింగారించుకొని పోటీ పడతాయి. కొత్త బట్టల కొనుగోళ్లు, హరిదాసుల సందళ్లు, గంగిరెద్దుల పరవళ్లు మొదలవుతాయి. 'పండగ బట్టలు తీసేశారా? పిండివంటలు మొదలెట్టారా?' వంటి పలకరింపులు సర్వసాధారణమవుతాయి.

ఇక దూరంగా ఉన్నవాళ్లకు కూడా నెలరోజులనుంచే ఊరూ, ఇల్లూ క్షణక్షణానికీ గుర్తొస్తాయి. అమ్మకు ఏ రంగు చీర తీసుకెళ్లాలి? చెల్లికి ఏం కొనాలి? వంటి సంతోష సందిగ్ధాలు వెన్నాడుతుంటాయి. చిన్ననాటి స్నేహితులు, బంధువులూ కళ్లముందు కదలాడతారు. ఎప్పుడు ఊరెళతామా అన్న ఉబలాటం సంతోషాన్ని రెట్టింపు చేస్తూ ఉంటుంది. కుటుంబ సమేతంగా ఊరికి బయల్దేరడం ఎక్కడిలేని ఆనందం కలిగిస్తోంది. సొంత ఊరినీ, కన్నతల్లినీ, బంధుమిత్రులను కలుస్తామన్న హృదయానందం ఏ ప్రయాణం కన్నా అమితంగా, ఆహ్లాదంగా ఉంటుంది. ఈ సంగతి సంక్రాంతి వేళ ఊరెళ్లే ప్రతి ఒక్కరికీ అనుభవంలోకి వస్తోంది.

సంక్రాంతి పాడిపంటల పండగ. వ్యవసాయ ఫలసాయం ఇంటికొచ్చే వేళ... కళ్లం నిండా ధాన్యం ఉంటే... రైతు కళ్లల్లో ఆనందం తాండవిస్తుంది. అతడి సంతోషానికి పట్టపగ్గాలుండవు. ఆ ఉత్సాహాన్ని అందరితో పంచుకుంటాడు. ఉత్సవంగా జరుపుకుంటాడు. ఫలసాయం పొందే ప్రక్రియలో తనకు సహకరించిన ప్రతి జీవికీ, ఉపకరణానికీ చేతులెత్తి నమస్కరిస్తాడు. భోగి, సంక్రాంతి, కనుమ... ఈ మూడ్రోజులూ వ్యవసాయ సంబంధమైన విశేషాలతోనే ముడిపడి ఉన్నాయి. తాడిపెద్దును గౌరవించడం, గంగిరెద్దును ఆదరించడం సేద్యం నేపథ్యంలోంచి వచ్చినవే!

అయితే, మునుపటి సందళ్లు ఇప్పుడు గ్రామాల్లోనూ లేవు. ఊళ్లు కూడా పట్టణాలాగానే మారిపోయాయి. వ్యవసాయం దారుణమైన ఒడిదుడుకులకు లోనవటమే దీనికి కారణం. పెట్టుబడులు పెరిగి, గిట్టుబాటు దక్కని పంటలూ, సాగు పద్ధతులూ వచ్చాయి. ఒకప్పుడు ప్రకృతి కరుణించకపోతే రైతుకు కాయకష్టమే పోయేది. ఇప్పుడు పీకల్లోతు నష్టాలొస్తున్నాయి. చిన్న రైతులు, వ్యవసాయ కూలీలూ అనివార్యంగా పట్టణాలకు వలస పోయే పరిస్థితి! సాంప్రదాయ కళలకు, కళాకారులకు ఆదరణ తగ్గిపోయింది. హరిదాసులు, కొమ్మదాసులూ అన్ని ఊళ్లలోనూ కనపడడం లేదు. టీవీలొచ్చాక సంబరాన్ని ఉమ్మడిగా ఆస్వాదించలేని పరిస్థితి! ఎవరింట్లో వాళ్లు... అచ్చం పట్టణంలాగానే!

ఏ సంబంధాల్లో ఎన్ని మార్పులొచ్చినా అమ్మ అమ్మే! సొంత ఊరు కూడా అంతే! చిన్నప్పుడు తిరిగాడిన నేలను తాకడం ఒక తన్మయత్వం. చిన్ననాటి చెలికాళ్లను కలవడం ఒక పారవశ్యం. చిన్నప్పుడు అమ్మతో కథలు చెప్పించుకున్న వేళప్పుడే... పిల్లలతో కలిసి అమ్మతో మాట్లాడడం ఒక ఆనందం. అక్షరాలు నేర్పిన బడిని, దిద్దించిన గురువునీ, చిన్ననాటి సాహసాల్లో భాగస్వాములైన సావాసగాళ్లనూ సందర్శించి సంభాషించడం ... అద్భుతానందం, ఆత్మీయ సంబంధం.

మనకే కాదు, అమ్మకూ అంతే! మన ఊరికీ అంతే! చదువులకని, ఉద్యోగాలకని, ఉపాధికని ఊరొదిలి వెళ్లిన బిడ్డలు... కలివిడిగా వచ్చి చేరితే అమ్మ ఆనందిస్తోంది. మనవళ్లనూ, మనవరాళ్లనూ మురిపెంగా చూసుకుంటూ చిన్నప్పటి గురుతులేవో వాళ్ల మాటల్లో చేతల్లో వెతుకుతుంటోంది. మన పిల్లల్లో మనకే తెలియని మన ఆనవాళ్లను పదిలంగా పట్టుకొని, ఆపాత మధురాలకు అన్వయిస్తోంది. ఇలా ఎన్నో విధాల బంధాలు మరింత బలపడ్డానికి పండగ ఒక వేదిక అవుతుంది.

పండగ మూడ్రోజులూ పరమానందంగా గడిసిపోతాయి. స్కూళ్లు, ఆఫీసులూ, మన పనులూ వెనక్కి రారమ్మని పిలుస్తూ ఉంటాయి. వచ్చినంత ఉత్సాహంగా ఉండదు, తిరిగి వెళ్లడం. వీడ్కోలు చెప్పటం అంత ఈజీగా ఉండదు. అలా ఈజీగా ఉండకపోవడమే ఈ పెద్ద పండగ విశేషం, విశిష్టత.

ఫొటో : రాజేష్

రంగవల్లి

రంగవల్లి శీర్షిక ఈ రోజుతో ముగిసింది. ముగ్గులు పంపిన అందరికీ ధన్యవాదాలు. సంక్రాంతి శుభాకాంక్షలు.



13 చుక్కలు 13 వరుసలు

సత్య,
కాకినాడ.



17 చుక్కలు 3 వరుసలు 3 వచ్చేవరకు

బి వేదశ్రీ,
శివాలయం వీధి,
వేల్పూరు.

13 చుక్కలు 5 వరుసలు 5 వచ్చేవరకు

చుండూరు ఆకాంక్ష,
ఎఎస్ రావు నగర్,
హైద్రాబాద్.

అదే జరిగితే మేమిద్దరం ముందే పారిపోతాం

'ఆర్ఆర్ఆర్' చిత్రంలోని 'నాటు నాటు' పాటకు గోల్డెన్ గ్లోబ్ అవార్డు వచ్చిన సందర్భంగా రామ్‌చరణ్, ఎన్టీఆర్ తాజాగా ప్రముఖ హాలీవుడ్ మ్యాగజైన్ 'వెరైటీ'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. పలు అంశాలపై ముచ్చటించారు. ఆ సంగతులు ఇవీ ..

'గోల్డెన్ గ్లోబ్ అవార్డుల వేడుకల్లో భాగంగా మేము ఇక్కడికి రావడం చాలా ఆనందంగా ఉంది. సాధారణంగా కుటుంబంతో కలిసి అమెరికాకు వెకేషన్ కోసం వస్తుంటాం. ఈ సారి సినిమా కోసం రావడం ప్రత్యేకంగా ఉంది. భారతీయులుగా ఈరోజు ఇంతటి ఆదరణ అందుకుంటున్నందుకు గర్వంగా ఉంది' అన్నారు తారక్. 'లాస్ ఏంజెల్స్ స్టూడియోలో ఉన్నానంటే ఇంకా నమ్మలేకపోతున్నా. ఎంతో ఆనందంగా ఉంది. ప్రపంచం మొత్తం ఇప్పుడు ఒక్కటవుతోంది. అదే విధంగా భాషాపరమైన వ్యత్యాసాలు లేకుండా సినిమా ప్రపంచం కూడా ఒకే వేదికపైకి వస్తోంది' అన్నారు చరణ్.

క్లైమాక్స్‌లో ఎన్టీఆర్ భుజాల మీద నేను కూర్చొని ఫైట్స్ చేస్తుంటాను. ఆ సీక్వెన్స్ మా ఇద్దరికీ ఎంతో కష్టంగా అనిపించింది. ముఖ్యంగా తారక్ ఆ సీన్స్ చేసేటప్పుడు ఎంతో కష్టపడ్డాడు. నన్ను తన భుజాలపై మోశాడు. సుమారు 15 రాత్రులపాటు ఆ సీన్స్ షూట్ చేసినట్లు చరణ్ ఆనాటి సంగతిని గుర్తుచేసుకున్నారు. 'ఈ సినిమా కోసం ఫిట్‌నెస్ పరంగా ఎన్నో జాగ్రత్తలు పాటించాం. కొన్ని నెలలు ఒకే తరహా శరీరాకృతిని మెయిన్‌టెయిన్ చేశాం. నేనైతే ఒక రోజులో సుమారు 3000 కేలరీలు పెంచుకోవాల్సి వచ్చింది. దీని కోసం రోజుమొత్తం మీద ఏడు సార్లు భోజనం చేశాను. ఆ లుక్‌లోకి రావడానికి 16 నుంచి 17 నెలల సమయం పట్టింది' అంటూ నాటి జ్ఞాపకాన్ని నెమరువేసుకున్నారు తారక్.

తమ స్నేహ బంధం గురించి చెబుతూ.. 'నా దృష్టిలో చరణ్ నీరు లాంటివాడు. అతడిని నేను సముద్రంతో పోలుస్తా. మరింత లోతుగా వెళ్లి, అతడితో మంచి అనుబంధాన్ని కలిగి ఉన్నప్పుడే చరణ్ గురించి ఎక్కువగా తెలుస్తుంది' అన్నాడు తారక్. సినిమాలో పులితో జరిగిన ఫైట్ సీక్వెన్స్ నిజ జీవితంలో జరిగితే ఎవరు ఎక్కువ సేపు తలపడతారన్నప్పుడు 'అదే జరిగితే మేమిద్దరం ముందే పారిపోతాం' అంటూ నవ్వుతూ సమాధానమిచ్చారు.

నటుడు రణ్‌దీప్ హుడాకు తీవ్ర గాయాలు

బాలీవుడ్ నటుడు రణ్‌దీప్ హుడా తీవ్ర గాయాల పాలయ్యాడు. హార్స్ రైడింగ్ చేస్తున్న సమయంలో కళ్లు తిరగడంతో జారి కింద పడి పోయాడు. చికిత్స కోసం ముంబైలోని కోకిలాబెన్ ధీరూబాయ్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు సర్జరీ అవసరమని చెప్పినట్టు సమాచారం. గతంలో రాధే సెట్‌లోను ఈ బాలీవుడ్ నటుడికి గాయాలయ్యాయి. అప్పుడు కూడా కుడి కాలికి గాయమయింది. రణ్ దీప్ ప్రస్తుతం స్వీయ దర్శకత్వం వహిస్తూ 'స్వతంత్ర వీర్ సావర్కర్' చిత్రంలో టైటిల్ రోల్ పోషిస్తున్నాడు. అందుకోసం 22 కేజీల బరువు తగ్గాడు. ఒక్కసారిగా బరువు తగ్గడంతో హార్స్ రైడింగ్ చేస్తున్న సమయంలో తగినంత శక్తి లేక జారి పడి ఉంటారని వైద్యులు అంటున్నారు.

.. ఆ వార్తలు అబద్ధం



ఐదు దశాబ్దాల పాటు నటిగా ఎన్నో వైవిధ్య భరిత పాత్రలు పోషించిన జయసుధ సినీ ఇండస్ట్రీలో తన కంటూ ప్రత్యేక స్థానం ఏర్పరచుకున్నారు. ప్రస్తుతం క్యారెక్టర్ ఆర్టిస్టుగా బిజీగా ఉన్నారు. తెలుగుతో పాటు తమిళం, మలయాళం, హిందీ భాషల్లోనూ సినిమాలు చేస్తున్నారు. కాగా, ఆమె మూడో పెళ్లి చేసుకున్నారని సోషల్ మీడియాలో వార్తలు వచ్చాయి. కొన్ని రోజుల క్రితం అమెరికా వెళ్లిన జయసుధ అక్కడి బిజినెస్ మ్యాన్‌ను వివాహం చేసుకున్నారని ఆ వార్తల సారాంశం. ఆ వార్తలను జయసుధ ఖండించారు. అందులో ఏమాత్రం వాస్తవం లేదని, అతను అమెరికాకు చెందిన వ్యక్తి అని, తన బయోపిక్ తీసేందుకే ఇండియాకు వచ్చాడని స్పష్టం చేశారు. ఇండస్ట్రీలో తన ప్రాముఖ్యతను తెలుసుకోవడానికి తనతోనే ఉంటూ గమనిస్తున్నాడని పేర్కొన్నారు. అదిస్పిరిచ్యువల్ బయోపిక్ కావడంతో నేను క్రిస్టియానిటీలోకి ఎలా మారాను? అంతకుముందు నా జీవితం ఎలా ఉండేది అని తెలుసుకుంటున్నారని వివరించారు.

ఆదిపురుష్ పై మరో వివాదం

ఓంరౌత్ దర్శకత్వం వహిస్తూ హీరో ప్రభాస్ నటిస్తున్న చిత్రం 'ఆదిపురుష్'. గత ఏడాది దసరా కానుకగా టీజర్ విడుదలైంది. అప్పటి నుండి సినిమాపై వివాదాలు తలెత్తుతూనే ఉన్నాయి. రాముడు, హనుమంతుడు తోలుతో చేసిన దుస్తులు ధరించారని, రావణుడిని చూపించిన విధానం సరిగా లేదని కొందరు విమర్శలు చేశారు. ఈ సినిమా విడుదలపై స్టే విధించాలని ఢిల్లీ హైకోర్టులో పిటీషన్ దాఖలైంది. ఈ విమర్శలతో ఆది పురుష్ బృందం వెనక్కు తగ్గింది. వీఎఫ్ఎక్స్‌ను మెరుగు పరచడం కోసం ఆరు నెలలు సినిమాను పోస్ట్ పోన్ చేశారు. ఇప్పుడు మరో వివాదం ఎదురైంది. కుల్దీప్ అనే వ్యక్తి ఆదిపురుష్ టీజర్‌పై అలహాబాద్ హైకోర్టులో పిటీషన్ దాఖలు చేశాడు. సెన్సార్ బోర్డు నుంచి సర్టిఫికేట్ రాకుండానే టీజర్‌ను విడుదల చేశారని పిటీషన్‌లో పేర్కొన్నాడు. కృతిసనన్ ధరించిన దుస్తులపై కూడా అభ్యంతరాలు తెలిపాడు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం సెన్సార్ బోర్డ్‌కు నోటీసులిచ్చింది. దీనిపై వివరణ ఇవ్వాలని కోరుతూ, తదుపరి విచారణను ఫిబ్రవరి 21కి వాయిదా వేసింది.

శివాలెత్తిన సెహ్రావత్

దక్షిణాఫ్రికాపై ఏడు వికెట్ల తేడాతో గెలుపు

ఐసిసి అండర్-19 మహిళల ప్రపంచకప్

శ్వేత సెహ్రావత్ (92 నాటౌట్)

జోహాన్స్‌బర్గ్: ఐసిసి అండర్-19 మహిళల ప్రపంచకప్ గ్రూప్-డిలో ఉన్న భారత జట్టు శుభారంభం చేసింది. ఐసిసి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న తొలి అండర్-19 మహిళల ప్రపంచకప్‌లో భారత్ ఏడు వికెట్ల తేడాతో ఆతిథ్య దక్షిణాఫ్రికాను చిత్తుచేసింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా మహిళల జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 166పరుగులు చేసింది. ఛేదనలో భారతజట్టు 16.3ఓవర్లలో కేవలం 3వికెట్లు కోల్పోయి 170పరుగులు చేసి గెలిచింది. టాస్ గెలిచి తొలిగా బ్యాటింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికా జట్టు పవర్‌ప్లే 6 ఓవర్లలోనే 70 పరుగులు చేసింది. లారెన్స్(61; 44బంతుల్లో 9ఫోర్లు, సిక్సర్), ల్యాండ్మన్(32) బ్యాటింగ్‌లో రాణించారు. షెఫాలీ వర్మకు రెండు, సోనమ్, చోప్రాకు ఒక్కో వికెట్ దక్కాయి. ఛేదనలో టీమిండియాకు కెప్టెన్ షెఫాలీ వర్మ(45; 16బంతుల్లో 9ఫోర్లు, సిక్సర్) ఆకాశమే హద్దుగా చెలరేగి ఆడింది. మరో ఓపెనర్ శ్వేతా సెహ్రావత్(92నాటౌట్; 57బంతుల్లో 20ఫోర్లు) విధ్వంస ఇన్నింగ్స్ ఆడింది. వీరిద్దరూ కలిసి తొలి వికెట్‌కు 7 ఓవర్లలో 77పరుగులు జతచేశారు. ఆ తర్వాత త్రిషా(15), సౌమ్య తివారి(10) నిరాశపరిచినా.. సెహ్రావత్ ఒంటిచేత్తో మ్యాచ్‌ను ముగించింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ సెహ్రావత్‌కు లభించింది.

గ్రూప్-డి తొలి లీగ్ మ్యాచ్‌లో యుఏఇ మహిళల జట్టు 6వికెట్ల తేడాతో స్కాట్లాండ్‌పై ఘన విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన స్కాట్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 9వికెట్లు నష్టపోయి 99పరుగులు చేయగా.. యుఏఇ జట్టు 16.2ఓవర్లలో 4వికెట్లు కోల్పోయి 100పరుగులు చేసి గెలిచింది. మహికా గౌర్(33నాటౌట్) బ్యాటింగ్‌లో రాణించింది.టిక గ్రూప్-ఏలో బంగ్లాదేశ్ మహిళల జట్టు 7వికెట్ల తేడాతో ఆస్ట్రేలియాపై, శ్రీలంక జట్టు 7 వికెట్ల తేడాతో అమెరికాపై విజయం సాధించాయి.

స్కోర్‌బోర్డు..

దక్షిణాఫ్రికా(అండర్-19) మహిళలు: రెన్స్‌బర్గ్ (సి)ఘోష్ (బి)యాదవ్ 23, లారెన్స్ (రనౌట్) త్రిషా/ఘోష్ 61, సియో (బి)షెఫాలీ వర్మ 0, రెనెకె (సి)త్రిషా (బి)షెఫాలీ 11, ల్యాండ్స్‌మన్ (ఎల్‌బి)చోప్రా 32, కరాబో మెసో (నాటౌట్) 19, మినే స్మిత్ (నాటౌట్) 16, అదనం 4. (20 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి) 166పరుగులు. **వికెట్ల పతనం:** 1/56, 2/61, 3/89, 4/126, 5/142 **బౌలింగ్:** షబ్నమ్ 1-0-20-0, సోనమ్ యాదవ్ 4-0-47-1, అర్చనా దేవి 3-0-18-0, షెఫాలీ వర్మ 4-0-31-2, సోనియా 3-0-19-0, పర్షవీ చోప్రా 4-0-15-1, సౌమ్య తివారి 1-0-16-0

ఇండియా(అండర్-19) మహిళలు: శ్వేత సెహ్రావత్ (నాటౌట్) 92, షెఫాలీ వర్మ (సి)నాయుడు (బి)స్మిత్ 45, త్రిషా (స్టంప్) మెసో (బి)నాయుడు 15, తివారీ (సి)రెన్స్‌బర్గ్ (బి)ల్యాండ్మన్ 10, సోనియా (నాటౌట్) 1, అదనం 7. (16.3 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి) 170పరుగులు. **వికెట్ల పతనం:** 1/77, 2/106, 3/165 **బౌలింగ్:** అయంద హుబి 4-0-36-0, నాయుడు 3-0-32-1, రెనెకె 4-0-40-0, నిని 1-0-26-0, స్మిత్ 2-0-15-1, ల్యాండ్మన్ 2.3-0-20-1.

నెదర్లాండ్స్, న్యూజిలాండ్ శుభారంభం

హాకీ ప్రపంచకప్

రూర్కెలా(ఒరిస్సా): హాకీ ప్రపంచకప్‌లో భాగంగా శనివారం జరిగిన పోటీల్లో నెదర్లాండ్స్, న్యూజిలాండ్, జర్మనీ, బెల్జియం జట్లు శుభారంభం చేశాయి. రూర్కెలాలోని బిర్సాముండా హాకీ స్టేడియంలో జరిగిన పూల్-సిలో న్యూజిలాండ్ 3-1గోల్స్ తేడాతో చిలీపై, నెదర్లాండ్స్ జట్టు 4-0తో మలేషియాపై ఘన విజయం సాధించాయి. నెదర్లాండ్స్ యువ ఆటగాడు జొర్రిట్ క్రూన్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ లభించింది. దీంతో నెదర్లాండ్స్, న్యూజిలాండ్ జట్లకు మూడేసి పాయింట్లు దక్కాయి. ఇక భువనేశ్వర్ వేదికగా జరిగిన పూల్-బిలో బెల్జియం జట్టు 5-0తో దక్షిణ కొరియాను, జర్మనీ జట్టు 3-0తో జపాన్‌ను ఓడించాయి.

యుకి-సాకేత్‌కు బ్యాంకాక్ ఓపెన్ టైటిల్

నాన్థబురి(థాయ్‌లాండ్): టాప్‌సీడ్ యుకీ బాంబ్రీ-సాకేత్ మైనేని జోడీ బ్యాంకాక్ ఓపెన్ ఛాలెంజర్స్ టైటిల్‌ను కైవసం చేసుకున్నారు. శనివారం జరిగిన ఫైనల్లో 2-6, 7-6(7), 14-12తో క్రిస్టోఫర్-రంగ్‌కాట్ (ఇండోనేషియా- ఆస్ట్రేలియా) జోడీపై ఉత్కంఠ పోటీలో పోరాడి నెగ్గారు. ఈ మ్యాచ్ సుమారు గంటా 50నిమిషాల సేపు సాగింది. గత ఏడాది నుంచి భారత టెన్నిస్ జోడీ జతకట్టి డబుల్స్‌లో బరిలోకి దిగుతున్నారు. వీరిద్దరూ ఫైనల్‌కు చేరిన ఆరు సందర్భాల్లో ఐదుసార్లు టైటిళ్లను సాధించడం విశేషం. 28ఏళ్ల యూకీ డబుల్స్‌లో 90వ, 35ఏళ్ల సాకెత్ మైనేని 74వ ర్యాంక్‌లో ఉన్నారు. వీరిద్దరూ జతకట్టి తొలిసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల డబుల్స్‌లో వైల్డ్‌కార్డ్ ఎంట్రీతో బరిలోకి దిగనున్నారు.

హ్యాండ్‌బాల్ ఛాంప్ విశాఖ

ప్రజాశక్తి - గన్నవరం (కృష్ణా జిల్లా)

కృష్ణా జిల్లా గన్నవరంలో జరుగుతున్న జూనియర్, సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో విశాఖ జట్లు ఛాంపియన్లుగా నిలిచాయి. నంద్యాల జట్లు రెండో స్థానంలో నిలిచాయి. జూనియర్స్ విభాగంలో మూడో స్థానాన్ని కర్నూలు, విజయనగరం జట్లు, సబ్ జూనియర్స్ విభాగంలో అనంతపురం, తూర్పు గోదావరి జట్లు దక్కించుకున్నాయి. ఈ పోటీల్లో 16 జిల్లాల నుండి 32 జట్లు తలపడ్డాయి. అనంతరం గన్నవరం బాలికోన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఏపి ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి కెపి.రావు, రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ అధ్యక్షులు టిఎస్ఆర్‌కె.ప్రసాద్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి జాతీయస్థాయిలో గుర్తింపు తేవడానికి క్రీడాకారులు చేస్తున్న కషిని అభినందించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోనూ విజయం సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హ్యాండ్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ శ్రీనివాసులు, హ్యాండ్‌బాల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రామాంజనేయులు, బేస్‌బాల్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు తులసీరావు, ఉపాధ్యక్షులు సత్యప్రసాద్ పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీల్లో ఛాంపియన్‌గా నిలిచిన విశాఖ జట్టు

G20 भारत 2023 INDIA | 75 Azadi Ka Amrit Mahotsav | PM Gati Shakti National Master Plan for Multi-Modal Connectivity | Indian Railways

తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు సంక్రాంతి కానుక

ప్రారంభోత్సవం

వందే భారత్ ఎక్స్‌ప్రెస్

సికింద్రాబాద్ నుండి విశాఖపట్నం వరకు

ప్రారంభించువారు

నరేంద్ర మోది

ప్రధాన మంత్రి

(వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా)

తేది : 15 జనవరి, 2023

సమయం : ఉ. 9.30 గం.కు | సికింద్రాబాద్ రైల్వే స్టేషన్

సికింద్రాబాద్ - విశాఖపట్నం వందే భారత్ రైలు ముఖ్యాంశాలు

- భారతదేశపు 8వ వందే భారత్ ఎక్స్‌ప్రెస్, ఆత్మనిర్భర్ భారత్ క్రింద దేశీయంగా తయారు చేయబడినది.
- 700 కి.మీ. దూరం కవర్ చేసేందుకు ప్రయాణ సమయం సరాసరి 12 గంటల నుండి 8 గంటల 30 నిమిషాలకు తగ్గించబడుతుంది.
- 160 kmph గరిష్ఠ వేగంతో చేరేందుకు సమర్థవంతమైనది.
- ఇది ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ మధ్య అనుసంధానత పటిష్టపరుస్తుంది మరియు తదుపరి ఆర్థిక, సామాజిక మరియు సాంస్కృతిక అనుబంధాన్ని పెంపొందిస్తుంది.
- ఉత్తమ ప్రయాణానికి ప్రపంచ శ్రేణి లక్షణాలు అంటే – సౌకర్యవంతమైన, ఎర్గానమిక్ రిక్లైనింగ్, దివ్యాంగ్‌జన్ ఫ్రెండ్లీ సీట్లు, కవాచ్ ఎనేబుల్డ్ సేఫ్టీ, వాటంతట అవే ముడుచుకుని తెరుచుకునే ఫుట్ స్టెప్స్‌తో ఆటోమేటిక్ డోర్స్ ఉంటాయి.
- ఉత్తమ ట్రెయిన్ కంట్రోల్ మేనేజ్‌మెంట్ కొరకు లెవల్-II సేఫ్టీ ఇంటిగ్రేషన్ సర్టిఫికేషన్
- చక్కని హీట్ వెంటిలేషన్ మరియు ఎయిర్ కండీషనింగ్ కంట్రోల్
- 360^0 రొటేషనల్ సీట్స్ అండ్ ఇన్ఫోటెయిన్‌మెంట్ సిస్టమ్

20833 విశాఖపట్నం - సికింద్రాబాద్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్		↓ స్టేషన్లు ↑	20834 సికింద్రాబాద్ - విశాఖపట్నం వందే భారత్ ఎక్స్‌ప్రెస్	
బయలుదేరుట	చేరుట		బయలుదేరుట	చేరుట
05:45	----	విశాఖపట్నం	----	23:30
07:55	07:57	రాజమండ్రి	20:58	21:00
10:00	10:05	విజయవాడ	19:00	19:05
11:00	11:01	ఖమ్మం	17:45	17:46
12:05	12:06	వరంగల్	16:35	16:36
----	14:15	సికింద్రాబాద్	15:00	----

నడిచే రోజులు : ఆరు రోజులు (ఆదివారం మినహా)

వీరి సమక్షంలో

డా॥ తమిళసై సౌందర్య రాజన్
గవర్నర్, తెలంగాణ

కె. చంద్రశేఖర్ రావు
ముఖ్యమంత్రి, తెలంగాణ

అశ్వినీ వైష్ణవ్
కేంద్ర రైల్వేలు, కమ్యూనికేషన్స్ & ఎలక్ట్రానిక్స్ మరియు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖల మంత్రి

జి. కిషన్ రెడ్డి
కేంద్ర సాంస్కృతిక, పర్యాటక మరియు ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ మంత్రి

మమ్మల్ని అనుసరించండి : /RailMinIndia

DD NEWS డిడి న్యూస్‌లో కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారం వీక్షించండి

భారతీయ రైల్వేలు
www.indianrailways.gov.in

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68